
అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230




నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం 03

ఉపాధి హామీ పథకం రద్దు చేయాలనుకుంటున్న మోదీ ఈ చర్య ప్రజాస్వామ్య మూలాలపై దాడి 05



సంపుటి 09, సంచిక: 53 | బుధవారం | 21-01-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00





# వామపక్ష ఐక్యతే దేశ ప్రగతికి మూలాధారం

## బలమైన ఐక్యఉద్యమాల నిర్మాణానికి నడుంకట్టాలి

## ఖమ్మంలో జరిగిన సిపిఐ సెమినార్‌లో వామపక్షపార్టీల అగ్రనాయకుల ఉద్ఘాటన



వామపక్షాల సెమినార్ దృశ్యాలు 12

కె.సంతోష్ కుమార్

**ఖమ్మం :** వామపక్ష పార్టీలతోనే భారతదేశ భవిష్యత్తు ముడిపడి ఉందని వామపక్ష పార్టీల అగ్రనేతలు అభిప్రాయపడ్డారు. వామపక్షాల బలోపేతం ద్వారానే పీడిత వర్గాలకు న్యాయం జరుగుతుందని, అసమానతలులేని నవ సమాజ నిర్మాణానికి అవకాశం కలుగుతుందని ఉద్ఘాటించారు. భారతదేశంలో పేట్రేగిపోతున్న ఫాసిస్టు శక్తులకు, అత్యంత ప్రమాదకరంగా మారిన మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా వామపక్షాలు బలమైన ఐక్య పోరాటాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఒక వైపు దేశంలో పాతుకుపోయిన కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడుతూ, మరోవైపున ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ అత్యంత ప్రమాదకరంగా మారిన మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఐక్య కార్యాచరణతో ముందుకు సాగాలని, అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని వారు చెప్పారు.

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మం పట్టణంలోని ఎస్.ఆర్.గార్డెన్‌లో 'వర్తమాన భారతదేశం–వామపక్షాల ముందున్న సవాళ్లు' అనే అంశంపైన సిపిఐ మంగళవారం జాతీయ సదస్సును నిర్వహించింది. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ (ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబి, సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి) జాతీయ ప్రధాన కార్యదర్శి డి.దేవరాజన్, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రసంగించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అతిథులకు తరువాయి 3లో

## ప్రజాస్వామ్యానికి సవాళ్లను ఐక్యంగా ఎదుర్కొందాం : భట్టి



ఏనుగు వెంకటేశ్వరరావు

**ఖమ్మం :** ప్రజాస్వామ్యానికి కార్పొరేట్ శక్తులు సరికొత్త సవాళ్లు విసురుతున్నాయని, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల చేతిలో బందీగా మారిందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మతాన్ని అడ్డుపెట్టుకుని లబ్ధి పొందేందుకు కార్పొరేట్, ఫాసిస్టు శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆయన తెలిపారు. మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో 'వర్తమాన భారతదేశం– వామపక్షాల ముందున్న సవాళ్లు' అనే అంశంపై ఖమ్మం ఎస్ ఆర్ గార్డెన్స్‌లో తరువాయి 2లో

## ఐక్యతపై వామపక్ష నేతలు..

బొమ్మగాని కిరణ్‌కుమార్

**ఖమ్మం :** ఖమ్మంలో జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం 'వర్తమాన భారతదేశం – వామపక్షాల ముందున్న సవాళ్ళు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో వామపక్షాల ఐక్యతపై వివిధ పార్టీల నాయకులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభోపన్యాసం చేస్తూ కమ్యూనిస్టుల ఐక్యత నేటి తక్షణావసరమని, ఐక్యత మరింత బలోపేతం కావాలని అన్నారు. చండ్ర రాజేశ్వరరావు కాలంలోనే కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణకు పిలుపునిచ్చారని, హరికిషన్ సింగ్ సూర్జీత్, ప్రకాశ్ కారాత్, ఏచూరి, బేబీ, దీపాంకర్‌లతో నిరంతరం చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. దీనిపై మనం మరింత ముందుకు పోవాలన్నారు. వామపక్షాల భవిష్యత్తు ఏమిటని కొందరు ప్రశ్నిస్తుంటారని, వామపక్షాల భవిష్యత్తుతోనే భారతదేశ భవిష్యత్తు ముడిపడి ఉందని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మితవాద బిజెపి ప్రభుత్వాన్ని సాధ్యమైనంత త్వరగా దింపేసేందుకు వామపక్షాలు కలిసి పని చేయాలని, లౌకిక, ప్రజాతంత్ర పార్టీలను ఏకం చేసి, వారిలో మరింత స్పష్టతను తీసుకురావాల్సిన బాధ్యత వామపక్షాలపై ఉందన్నారు.

సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ ప్రసంగిస్తూ వివిధ సమస్యలు, అంశాలపై వామపక్షాల అవగాహనలో ఎలాంటి తేడాలు లేవని, కొంత లోతుగా ఆలోచించినప్పుడు ఏమైనా ఉండవచ్చునని అన్నారు. అయితే, మితవాద ప్రతీఘాత శక్తులకు వ్యతిరేకంగా, కలిసి పోరాటం చేయడంలో అవేవి అడ్డురాబోవని చెప్పారు. మావోయిస్టులతో తమకు తీవ్రమైన రాజకీయ,సైద్ధాంతిక భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మూలిస్తున్న తీరు అనాగరికమైనదని, దానిని తీవ్రంగా వ్యతిరేకించామని తెలిపారు. మితవాద శక్తులపై పోరాటంలో వామపక్షాలు, ప్రజాతంత్ర పార్టీలు స్వంతంగా బలం పెంచుకోవాలని, అది మరింత విస్తరించాలన్నారు. సైద్ధాంతిక అంశాలలో వామపక్షాల మధ్య తేడాలు ఉన్నప్పటికీ, అంశాల విషయంలో ఐక్యంగానే ఉన్నాయన్నారు.

సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ప్రసంగిస్తూ తాము కూడా సిపిఐ తరహాలోనే దేశవ్యాప్తంగా సంఘటిత కమ్యూనిస్టు ఉద్యమ వందేళ్ళ ఉత్సవాలను ఏడాది పాటు ఘనంగా నిర్వహించామని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలన్నీ ఒకే పార్టీగా ఎందుకు కాకూడదని అంటారని, 1925 తరహాలో 2030 నాటికి ఒకే పార్టీగా అవ్వొచ్చని అన్నారు. ఒకటి అవడం పైనే ఆలోచన చేస్తున్నారని, ఏకమైన తరువాత ఏమి చేయాలనే అంశంపై కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. 1925లో సిపిఐ ఆవిర్భావం నాటి పరిస్థితులే నేడు మరోసారి తలెత్తుతున్నాయని, మరోసారి ఫాసిజం, తరువాయి 3లో



# ఖరీఫ్ నాటికి రాష్ట్రమంతా యూరియా యాప్

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఈ యాప్‌ను కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ ప్రశంసించిందని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యూరియా యాప్‌ను వచ్చే ఖరీఫ్ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఈ యాప్‌ను కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ ప్రశంసించిందన్నారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, కోఆపరేషన్, హార్టికల్చర్ శాఖల పురోగతిపై వ్యవసాయశాఖ కారదర్శి, ఆయా శాఖల డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం, తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలు రైతులకు పూర్తిస్థాయిలో చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నప్పటికి, మార్కెట్లో నకిలీ ఆర్గానిక్ లేబుల్లతో నకిలీ ఉత్పత్తులు చలామణీలో ఉండడంతో నిజమైన ఆర్గానిక్ పంటలు పండించే రైతులకు నష్టం చేకూరుతుందని , దీనిని నివారించడానికి వ్యవసాయశాఖ ఆర్గానిక్ ఉత్పత్తులకు సర్టిఫికేషన్ ఇచ్చే విధంగా ఒక యాప్ తీసుకురానుందని అన్నారు. ఈ యాప్ ద్వారా కొనుగోలుదారు తాను కొనబోయే ఉత్పత్తి ఎక్కడ, ఏ రైతు, ఎలా పండించాడో తెలుసుకుంటాడని అన్నారు. అదేవిధంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాల తరువాయి 2లో

## హెల్త్, అగ్రిటెక్, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్‌లో

# తెలంగాణ స్టార్టప్‌లకు ఇజ్రాయెల్ మద్దతు



ప్రజాపక్షం/హైదరాబాద్

దావోస్‌లో తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం మొదటి రోజున బిజీ బిజీగా గడిపారు. ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ ఛైర్మన్ అలోన్ స్టోపెల్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. సిఎంతో పాటు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. వ్యవసాయం, వాతావరణ మార్పులకు సంబంధించిన ఇన్నోవేషన్ స్టార్టప్‌లకు సహకారాలపై విస్తృతంగా చర్చించారు. ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, డీప్టెక్ ఇన్నోవేషన్ తో పాటు హెల్త్‌టెక్, అగ్రిటెక్, సైబర్ సెక్యూరిటీ, ఏరో స్పేస్ వంటి సాంకేతిక రంగాల్లో తెలంగాణ స్టార్టప్‌లకు ఇజ్రాయెల్ మద్దతు ఇవ్వడంతో పాటు భాగస్వామ్యం పంచుకుంటుంది. ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ సహా పలు రంగాల్లో ఇజ్రాయిలీ స్టార్టప్‌లతో కలిసి తెలంగాణ పైలట్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించనుంది.

**ఎఐ రంగంలో రాయల్ ఫిలిప్స్ ఆసక్తి:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) రంగంలో తెలంగాణతో భాగస్వామ్యమయ్యేందుకు ప్రముఖ హెల్త్ టెక్ సంస్థ రాయల్ ఫిలిప్స్ ఆసక్తి వ్యక్తం చూపింది. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు అవకాశాలపై కూడా చర్చించేందుకు ముందుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక వేదిక–2026 వార్షిక సమావేశాల్లో భాగంగా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం ఫిలిప్స్ గ్లోబల్ నాయకత్వంతో భేటీ అయ్యారు. రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ , గ్లోబల్ హెడ్ జాన్ విల్లెమ్– స్కీజ్ గ్రోండ మాట్లాడుతూ.. ఏఐ రంగంలో తెలంగాణ చేపడుతున్న కార్యక్రమాలు తమను ఆకట్టుకున్నాయని చెప్పారు. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో తెలంగాణ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత సేవలపై ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 'తెలంగాణ నెక్స్–జెన్ లైఫ్ సైన్సెస్ తరువాయి 2లో

## ఎఐతో మెరుగైన పౌర సేవలు అందించడమే లక్ష్యం

### ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)ను వినియోగించి తెలంగాణ రాష్ట్రంలో పౌర సేవలను మరింత సమర్థవంతంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఎఫ్) ఆధ్వర్యంలో దావోస్‌లో నిర్వహించిన 'ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ బిల్డింగ్ కంపెటిటివ్‌నెస్' అంశంపై జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా వంటి సబ్సిడీల ట్రాకింగ్ నుంచి మొదలుకుని ఆస్తి తరువాయి 2లో





## సిట్ విచారణలో ఏడు గంటలు

- హరీశ్‌రావును ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు
- సిట్ విచారణ ఒక ట్రాష్ అంటూ మాజీ మంత్రి మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్‌ఎస్ ముఖ్యనేత, మాజీ మంత్రి హరీష్ రావును సిట్ అధికారులు మంగళవారం ఏడు గంటలకుపైగా విచారించారు. జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమైన విచారణ సాయంత్రం 6.30 గంటల వరకు కొనసాగింది. ఈ సమయంలో బిఆర్‌ఎస్ నేతలు జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయం బయట ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రోడ్డుపై బైఠాయించిన బిఆర్‌ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి అనంతరం స్వంత పూచీకత్తుపై విడుదల చేశారు. సిట్ అధికారులు హరీష్‌రావును ఏడు గంటలకు పైగా పలు ప్రశ్నలు వేసి విచారించారు. పలు కీలక ప్రశ్నలకు హరీష్ రావు చెప్పిన తరువాయి 2లో

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

# ప్రపంచంలోనే ఆదర్శవంతంగా నిలువబోతున్నాయ్

- రూ.200 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలి
- నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదు
- పాఠశాల నిర్మాణ పనులు నెలకొకసారి తనిఖీ చేస్తా
- దేశ అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు పోటీపడే విధంగా సిబిఎస్‌ఇ సెలబస్ అమలు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/గరిడేపల్లి /హుజూర్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రపంచంలోనే ఆదర్శవంతమైన విద్యాసంస్థలుగా నిలవబోతున్నాయని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం తరువాయి 2లో



## మేడారం జాతరకు 4000 ప్రత్యేక బస్సులు

### భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు : మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్

మేడారం జాతరకి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా బస్సుల ఆపరేషన్స్ నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఆర్‌టిసి ఉన్నతాధికారులతో సెక్రటేరియట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గత మేడారం జాతరలో 3491 తరువాయి 2లో

## ఇక శాంతి గురించి ఆలోచించ!



- అమెరికాకు ఏది మంచిది అనుకుంటే దాని గురించే నిర్ణయం తీసుకుంటా
- నోబెల్ ఇవ్వలేదని నార్వే ప్రధానిపై నోరు పారేసుకున్న ట్రంప్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్ దురాక్రమణ ఆలోచనకు, గత ఏడాది తనకు రాని నోబెల్ బహుమతికి లింకు పెట్టారు. నార్వే ప్రధానమంత్రికి పంపిన సందేశంలో ఆ దేశంపై నిందలు వేశారు. తనకు నోబెల్ బహుమతి రాకుండా చేశారని, అందువల్ల ఇక తాను శాంతి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని, అమెరికా దేశానికి ఏది మంచి అనుకుంటే దాని గురించే ఆలోచించి నిర్ణయాలు తీసుకోవచ్చునని పేర్కొన్నారు. నార్వే దేశ ప్రధానమంత్రి జోనాస్ గహర్ స్టోర్‌కు ట్రంప్ ఒక సందేశం పంపారు. ఆ సందేశంలో నోబెల్ కమిటీ తనకు బహుమతి (2025) ఇవ్వలేదని నిందించారు. అందువల్ల ఇక తాను శాంతి గురించి మాత్రమే ఆలోచించాల్సిన అవసరం లేదని, అమెరికా మంచి చెడ్డల గురించి మాత్రమే ఆలోచిస్తే సరిపోతుందంటూ గ్రీన్‌లాండ్‌ను వ్యూహాత్మకంగా తమదేశం స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు. ఐతే ట్రంప్ వేసిన నిందలకు నార్వే ప్రధానమంత్రి స్టోర్ కూడా దీటుగా సమాధానం చెప్పారు. 2025వ సంవత్సరానికిగాను నోబెల్ బహుమతిని వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మచాడోకు ఇచ్చారని, ఐతే ఈ బహుమతికి నోబెల్ కమిటీ ఆమెను ఎంపిక చేసింది తప్ప, నార్వే ప్రభుత్వం కాదని, అందువల్ల నోబెల్ బహుమతి ట్రంప్‌కు రాకపోవడానికి నార్వే ప్రభుత్వం కారణం కాదని ఆ దేశ ప్రధానమంత్రి స్టోర్ వివరణ ఇచ్చారు. "ప్రపంచవ్యాప్తంగా తరువాయి 2లో

## యూరియా యాప్ (మొదటి పేజీ తరువాయి)

ఖాళీ ప్రదేశాలలో ఆర్గానిక్ పంటలు పండించి, అక్కడే స్టాల్స్ పెట్టి అమ్మినట్లైతే రైతులు ఆర్గానిక్ పంటలవైపు వెళ్లే అవకాశాలు ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఇప్పటికే రూ. 50 కోట్లు ఖర్చు చేశామని, మరో రూ.50 కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రైతులకు కావాల్సిన యంత్రాలు మార్కెట్ ధరలకే లభించేలా, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ నేరుగా రైతులకు చేరేలా నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఖరీఫ్ నాటికి పెద్ద మొత్తంలో యూరియా బఫర్ స్టాక్ లను నిల్వలో ఉంచుకోవాలని, భవిష్యత్తులో యూరియా ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, రైల్వే రేక్ పాయింట్లను కూడా ఎరువుల పంపిణీకి తగ్గట్లుగా ఉండేలా, మరికొన్ని రైల్వే రేక్ పాయింట్లను అదనంగా ఏర్పాటు చేసేవిధంగా రైల్వే అధికారులను కోరాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సన్నాలకు బోనస్ ఇస్తున్నందున, పంటకాలనికి అనుగుణంగా వ్యవసాయశాఖ ద్వారా సన్న వడ్లలో మేలైన వంగడాలను సూచించాలని, రైతులు అట్టి రకాలను ఉత్పత్తి చేసి మంచిధర పొందేటట్లు చూడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని శాఖల డిపాజిట్లు ప్రైవేట్ కమర్షియల్ బ్యాంకులలో కాకుండా కోఆపరేటివ్, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులలో చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. అందుకోసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పై దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.రాష్ట్ర అవసరాల కోసం కూరగాయలను ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకునే పరిస్థితి మారాలని, ఇందుకు డిమాండ్‌కు తగ్గట్టుగా కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రైతు వేదికల దగ్గర సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా రెండు రైతువేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయగా, నెలకు 400 యూనిట్ల వరకు మిగులు కరెంట్ ఉత్పత్తి అవుతుందని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఉద్యానవన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, హెచ్‌ఎసిఎ ఎండి చంద్రశేఖర్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీ బాయి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యేక బస్సులు (మొదటి పేజీ తరువాయి)

ఆర్టీసీ బస్సులు నడిపించగా 16.82 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించగా, ఈ ఏడాది 20 లక్షల మంది ప్రయాణించవచ్చాన్న అంచన తో 4వేల బస్సులను నడిపిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అయితే ప్రధానంగా మేడారం వెళ్ళే రూట్లలో వరంగల్ ,హనుమకొండ , ఖమ్మం, కరీంనగర్ రూట్లలో రద్దీ ఎక్కువగా ఉండనుండడంతో రద్దీగా తగిన విధంగా బస్సులు నడపడానికి అక్కడ అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. మేడారం లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్ స్టాప్ లో క్యూలైన్ ల వద్ద ప్రయాణికులు జిల్లాల వారిగా వెళ్ళే బస్సులు డిస్ప్లే అయ్యేలా చూడాలని అక్కడ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా పని చేయాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు.

**అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి :** జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి జరుగుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మేడారం వచ్చే భక్తులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కలిగించేలా హోర్డింగులు, బస్ స్టేషన్లలో, బస్సులో టీవీ ల ద్వారా ప్రచారాలు నిర్వహించాలని సూచించారు..ఆర్‌టిసి లో పెండింగ్ పనులు బస్ స్టేషన్ ల అభివృధి పనుల పురోగతి పై ఆరా తీసిన మంతిర. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో రాబోయే కాలంలో పూర్తిస్థాయిలో ఈవి బస్సులు రానుండడంతో అందుకు తగిన విధంగా మౌలిక సదుపాయాలు, ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పుడున్న జెబిఎస్ , ఎంజీబీఎస్ మాదిరి నగరంలో మరిన్ని బస్ టెర్మినల్ రావాల్సిన అవసరముందని దానిని స్టడీ చేయాలని ఆర్టీసీ కి సంబంధించిన భూ బదలాయింపు పై జిల్లా కలెక్టర్ల తో మాట్లాడాలని సూచించారు.. విజన్ 2047 లో ఆర్టీసీ లక్ష్యానికి అనుగుణంగా ఇప్పుడున్న బస్సుల సంఖ్యను మరింత పెంచడం , ఉద్యోగుల సంఖ్యను పెంచడం తదితర వాటిపై కార్యాచరణ తో ముందుకు పోవాలని ఆదేశించారు. మహా లక్ష్మీ ద్వారా 90 కి పైగా డిపోలు లాభాల బాటలో ఉన్నప్పటికీ మిగిలిన డిపో లు నష్టానికి గల కారణాలపై అధ్యయనం చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమీక్షా సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి, ఈడిలు , ఆర్ఎంలు ,ఇతర ఆర్‌టిసి అధికారులు పాల్గొన్నారు.

## ఏడు గంటలు (మొదటి పేజీ తరువాయి)

జవాబులను సిట్ అధికారులు వీడియో రికార్డు చేశారు. సిట్ అధికారులు అడిగిన మరికొన్ని ప్రశ్నలకు హరీష్‌రావు జవాబు చెప్పకుండా దాటవేసినట్లు సమాచారం. ఇదే కేసులో గతంలో సిట్ అధికారుల విచారణలో నిందితులు వెల్లడించిన అంశాలను నివృత్తి చేసుకునే క్రమంలో హరీష్‌రావును ప్రశ్నించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎవరెవరి ఫోన్‌లు రికార్డు చేసేందుకు హరీష్ రావు ఏమైనా ప్రతిపక్ష నేతల ఫోన్ నెంబర్లు ఇచ్చాడా అనే అంశంపై కూడా సిట్ అధికారులు కూపీ లాగినట్లు తెలిసింది. ముఖ్యంగా శాసనసభ ఎన్నికలకు ముందు ఫోన్ ట్యాపింగ్ చేస్తున్న విషయం హరీష్‌రావుకు తెలిసిందా, దీని వెనుక ఎవరెవరి హస్తం ఉందనే పలు ప్రశ్నలను సిట్ అధికారుల సంధించినట్లు తెలిసింది. అలాగే హరీష్‌రావు ఫోన్ నుంచి ఆ సమయంలో ఎవరెవరికి ఫోన్‌లు వెళ్లాయి, ఈ కేసులో ఉన్న నిందితులు పోలీసు అధికారులైన భుజంగరావు, ప్రభాకర్‌రావు, తిరుపతన్న, ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావులకు ఫోన్‌లు చేశారా అనే విషయంపై ఆరా తీసినట్లు తెలిసింది.హరీష్‌రావు డ్రైవర్, పిఎలకు సంబంధించిన ఫోన్ కాల్ లిస్టులో ఉన్న నెంబర్‌లపై కూడా ప్రశ్నించినట్లు తెలిసింది.

**సిట్ విచారణ ఒక 'ట్రాష్' – హరీశ్ రావు నిప్పులు :** సిట్ విచారణ అంతా సొల్లు పురాణమని బిఆర్‌ఎస్ ఎల్‌పి ఉపనేత హరీశ్ రావు అన్నారు. సిట్ విచారణ ముగిసిన అనంతరం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తనను రాజకీయంగా వేధించేందుకే ఇలాంటి 'లట్టు పొట్టు' సిట్‌లతో వేస్తోందన్నారు. సిట్ అధికారుల విచారణ తీరును హరీశ్ రావు ఎద్దేవా చేశారు. 'విచారణలో కొత్తగా ఏమీ లేదు, అడిగిందే మళ్లీ మళ్లీ అడిగారు. మధ్యలో అధికారులకు బయటి నుంచి ఫోన్లు రావడం, వారు బయటకు వెళ్లి చర్చించుకుని రావడం చూస్తుంటే రేవంత్ రెడ్డి లేదా సజ్జనార్ నుంచి ఆదేశాలు అందుతున్నట్లు అర్థమవుతోంది' అని విమర్శించారు. తనపై గతంలో పెట్టిన ప్రైవేటు కేసులను సుప్రీంకోర్టు, హైకోర్టు కొట్టివేసినా, మళ్లీ అదే అంశంపై విచారణ పేరిట కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బామ్మర్దికి సంబంధించిన బొగ్గు కుంభకోణాన్ని ఉదయం బయటపెట్టినందుకే, సాయంత్రానికి తనకు నోటీసులు ఇచ్చారని హరీశ్ రావు ఆరోపించారు. 'రింగ్ కింగ్ మీ బామ్మర్దే. నీకు దమ్ముంటే, నువ్వు తప్పు చేయకపోతే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించు. అన్ని ఆధారాలు ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని సవాల్ విసిరారు.

## ఆలోచించ

(మొదటి పేజీ తరువాయి)

ఎనిమిది యుద్ధాలు ఆపినందుకుగాను నార్వే దేశం నాకు నోబెల్ బహుమతి ఇవ్వలేదు, అందువల్ల ఇకమీదట నేను శాంతి గురించి మాత్రమే ఆలోచించాల్సిన బాధ్యత నాకు ఉండదు, ఐనప్పటికీ కూడా నా అజెండాలో అది ప్రధానాంశంగానే ఉంటుంది, కానీ అమెరికా దేశానికి ఏది ముఖ్యమో అదే చేస్తాను, ఆ నిర్ణయాలే తీసుకుంటాను'' అని నార్వే ప్రధానమంత్రికి ట్రంప్ ఒక సందేశం పంపిస్తూ, ''గ్రీన్‌లాండ్‌ను మనం స్వాధీనం చేసుకోకపోతే, ప్రపంచం సురక్షితంగా ఉండదు'' అని కూడా చివర తన సందేశంలో రాశారు. ట్రంప్ పెట్టిన ఈ సందేశానికి నార్వే ప్రధానమంత్రి సమాధానం చెబుతూ, ''గ్రీన్‌లాండ్‌పై పది శాతం సుంకాలు విధించినందుకు మా దేశం నిరసన తెలియజేసింది. కానీ అదే సమయంలో ఫోన్ ద్వారా త్రైపాక్షిక సంభాషణలను కూడా ప్రతిపాదించింది'' అని గుర్తుచేశారు. నోబెల్ శాంతి బహుమతి కావాలన్న తన కోరికను ట్రంప్ రహస్యంగా తనలో మాత్రమే దాచుకోకుండా పదే పదే దాని గురించి ప్రకటనలు చేశారు. అదేవిధంగా గ్రీన్‌లాండ్ దీవిని అమెరికా రక్షణ ప్రయోజనాల నిమిత్తం ఆక్రమించాల్సిన అవసరం ఉందని ఆయన పదే పదే చెబుతూ వస్తున్నారు. అమెరికా రక్షణ నిమిత్తం గ్రీన్‌లాండ్‌లో శక్తిమంతమైన ఆయుధాలను మోహరించాల్సిన అవసరం ఉందని, అలా మోహరిస్తే, శత్రువు అమెరికా దగ్గరకు రాకముందే హెచ్చరికలు వస్తాయని, అందువల్ల అనివార్యంగా గ్రీన్‌లాండ్ దీవిని కొనుగోలు చేస్తామని ట్రంప్ వాదిస్తున్నారు. ఒకవేళ గ్రీన్‌లాండ్ దీవిని అమెరికాకు విక్రయించకపోతే, దానికి ఆక్రమించేందుకు సైనిక చర్య తీసుకోవడానికి కూడా తమదేశం వెనుకాడదని ఆయన బాహాటంగానే హెచ్చరికలు చేస్తున్నారు.

# స్వతంత్ర యూరప్ నిర్మాణానికి ఇదే తరుణం

## యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా పిలుపు

**దావోస్:** అమెరికాపై ఆధారపడకుండా ఒక స్వతంత్ర యూరప్‌ను నిర్మించుకోవడానికి ఇదే సరైన తరుణమని యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండర్ లేయన్ దావోస్ ప్రపంచ ఆర్థిక వేదికపై పిలుపు ఇచ్చారు. ప్రాదేశిక భౌగోళిక రాజకీయాల్లో ఎదురవుతున్న దిగ్భ్రాంతికర ఘటనలు అనివార్యంగా యూరప్‌కు ఒక అవకాశమని అన్నారు. ''సమకాలీన ప్రపంచం చూస్తున్న భౌగోళిక రాజకీయ ప్రకంపనలు స్వతంత్ర యూరప్ నిర్మాణానికి ఒక మంచి అవకాశం, ఇది కొత్త విషయం కాదు, పైగా ఇటీవల జరుగుతున్న పరిణామాలకు ప్రతిస్పందన అంతకన్నా కాదు, ఇది ఒక అవసరం, చాలాకాలంనాటి వ్యవస్థాగత యూరప్ నిర్మాణ అత్యవసరానికి ఇదే సరైన తరుణం'' అన్నారు. ఈ మార్పు శాశ్వతమైతే, యూరప్ కూడా ఈ రూపంలో అనివార్యంగా శాశ్వతం కావాలన్నారు. మెర్కోసర్ ఒప్పందం, చైనాతో వాణిజ్య సంబంధాలు, స్వతంత్రంగా సైనిక బలగాలను, సైనిక వ్యవస్థను పటిష్టం చేసుకోవడానికి యూరప్ ఆలోచనలు, ప్రయత్నాలు ఇటీవలికాలంలో వేగం పుంజుకున్నాయి.

**డెన్మార్క్–గ్రీన్‌లాండ్‌లతో చేయి చేయి కలిపి పనిచేస్తాం**




ఆర్కిటిక్ ప్రాంత రక్షణకోసం డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌లతో చేయి చేయి కలిపి యూరోపియన్ యూనియన్ పనిచేస్తుందని యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండర్ లేయన్ దావోస్ వేదికపై చెప్పారు. గ్రీన్‌లాండ్‌కోసం ఆ దేశ ప్రజలు చేస్తున్న వాదనను ఆమె బాహాటంగా సమర్థించారు. గ్రీన్‌లాండ్ దురాక్రమణను ఎదిరించిన దేశాలపై పదీశాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ చెప్పడం అతిపెద్ద తప్పిదమని ఆమె ఉద్ఘాటించారు. డెన్మార్క్,గ్రీన్‌లాండ్‌లకు యూరోపియన్ యూనియన్ పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తోందన్నారు. గ్రీన్‌లాండ్ సార్వభౌమాధికారంపై చర్చకు ఎలాంటి అవకాశం లేదని, వారి సార్వభౌమాధికారం తిరుగులేనిది, చెక్కు చెదరనిదన్నారు. వారి ఆర్థిక వ్యవస్థకు, మౌలిక సదుపాయాలకు ఉత్తమస్థాయిలో మద్దతు ఇచ్చేందుకు వారితో కలిసి పనిచేస్తామన్నారు. విస్తారమైన ఆర్కిటిక్ భద్రతకోసం అమెరికాతో కలిసి పనిచేస్తామన్నారు. ఆర్కిటిక్ భద్రతకోసం తమ రక్షణ బడ్జెట్‌ను భారీగా పెంచుతామన్నారు. ఇవన్నీ తమ ఉమ్మడి ప్రయోజనాలని కూడా ఆమె చెప్పారు. కెనడా,నార్వే, బ్రిటన్ సహా యూరోపియన్ భాగస్వాములమధ్య ఉమ్మడి భద్రత ముఖ్యమైన విషయమన్నారు. యూరప్‌కు సరికొత్త భద్రతా వ్యవస్థ నిర్మాణం ముఖ్యమని తాను నమ్ముతున్నానన్నారు. యూరప్–అమెరికా మధ్య గత ఏడాది జులైలో జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని కేవలం ఒక ఒప్పందం మాత్రమేనన్నారు. ఐతే గ్రీన్‌లాండ్ విషయంలో మిత్రులందరూ వెనక్కు లాగుతున్నందువల్ల మీ వైఖరిలో మార్పు ఉందా? అని పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు ట్రంప్ స్పందిస్తూ, గ్రీన్‌లాండ్ అమెరికాకు కావాలి, ఈ విషయంలో వెనక్కు తగ్గేదేలేదు, దానిని ఎవరూ రక్షించలేరు, నయానో, భయానో ఆ దీవిని తమ స్వాధీనంలోకి తెచ్చుకుంటాం అని మరోసారి ఉద్ఘాటించారు.

# గ్రీన్‌లాండ్‌పై వెనక్కు తగ్గేదే లేదు: ట్రంప్

## దావోస్ వేదికపై చెబుతా

**వాషింగ్టన్:** దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదికపై ప్రసంగించేందుకు వెళుతున్నానని, ఆ వేదికపై నుండే గ్రీన్‌లాండ్ అమెరికా అధీనంలో ఉండాల్సిన ఆవశ్యకతను ప్రపంచదేశాలకు గట్టిగా చాటి చెబుతానని డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా చెప్పారు. గ్రీన్‌లాండ్ విషయంలో వెనక్కు తగ్గే ప్రశ్నే లేదని అన్నారు. ఈ విషయం దావోస్ వేదికపై ప్రకటిస్తానన్నారు. అమెరికా భద్రతకు గ్రీన్‌లాండ్ చాలా ముఖ్యమైనది, గ్రీన్‌లాండ్‌లో అమెరికా కీలక సైనిక స్థావరం ఉంటే అది శత్రువును అరికట్టేందుకు సైరన్‌లా ముందస్తు హెచ్చరికలకు దోహదం చేస్తుందన్నారు.రాయిటర్స్ వార్తాసంస్థ చెప్పిన సమాచారం ప్రకారం ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ తన సందేశంలో, ''అసలు గ్రీన్‌లాండ్ విషయంలో మీరు ఏం చేద్దాం అనుకుంటున్నారో మాకు అర్థం కావడంలేదు, దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశం తర్వాత ఈ వారంలోనే జి–7 సమావేశం ఏర్పాటు చేయండి'' అని మేక్రాన్ కోరారు. ట్రంప్‌కు మేక్రాన్ పంపిన సందేశం స్క్రీన్ షాట్‌ను సోషల్ మీడియా ద్వారా ఆయన షేర్ చేశారు. గాజా శాంతి మండలం (గాజా బోర్డు)లో చేరాలని ట్రంప్ ఇచ్చిన ఆహ్వానాన్ని మేక్రాన్ తిరస్కరించడంతో ఫ్రాన్స్‌పై 200 శాతం సుంకాలు విధిస్తానని ట్రంప్ బెదిరించారు. దీనిని కూడా మేక్రాన్ తిరస్కరించారు.




ఈ నేపథ్యంలో గ్రీన్‌లాండ్‌పై వెనక్కు తగ్గేదే లేదని ట్రంప్ చెప్పడంతో యూరప్ అంతటా మళ్లీ గందరగోళం రేగింది. దౌత్యకార్యకలాపాలు, పరస్పర ప్రకటనలు ఉద్ధృతమయ్యాయి. ట్రంప్ టారిఫ్‌లు అన్యాయం, అసంబద్ధమైనవని డెన్మార్క్ మంత్రులు విమర్శించగా,యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా కూడా ఈ టారిఫ్‌లు అతిపెద్ద తప్పిదమని విమర్శించారు. ఇదేసమయంలో దావోస్ ఆర్థిక వేదిక సమావేశాలకు వెళ్ళిన అమెరికా కోశాధికారి స్కాట్ బెస్సెంట్ కూడా స్పందిస్తూ, గ్రీన్‌లాండ్‌పై వివాదం జరుగుతున్నప్పటికీ అమెరికా, యూరప్ మధ్య అసాధారణమైన మైత్రి కొనసాగుతోందన్నారు. ఒక్క నిమిషం గుండెనిండుగా గాలి పీల్చుకుని యూరప్ నాయకులు ప్రశాంతంగా ఆలోచించాలని కోరారు.

# ఛాగోస్ దీవులను మారిషస్‌కు ఇవ్వడం బ్రిటన్ తెలివితక్కువ పని : ట్రంప్ విమర్శ



**వాషింగ్టన్ :** హిందూమహాసముద్రంలో బ్రిటన్–అమెరికా వైమానిక స్థావరం ఉన్న డియేగో గార్సియాతో సహా ఛాగోస్ (60 గొలుసుకట్టు దీవులు) దీవులపై ఆధిపత్యాన్ని ఎలాంటి కారణం లేకుండా వదులుకుని ఆ సార్వభౌమాధికారాన్ని మారిషస్‌కు స్వాధీనం చేయడం ''బ్రిటన్ చేసిన అతిపెద్ద తెలివి తక్కువ పని'' అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు. ఐతే దీనిపై బ్రిటన్ వెంటనే తీవ్రంగా స్పందించింది. ఛాగోస్ దీవులపై సార్వభౌమాధికారాన్ని వదులుకోవడం తప్పుకాదని బ్రిటన్ ప్రభుత్వం తనను తాను సమర్థించుకుంది. ఐతే గత ఏడాది బ్రిటన్ చర్యకు ట్రంప్ మద్దతు ఇవ్వడం గమనార్హం. గ్రీన్‌లాండ్ వివాదం నేపథ్యంలో ట్రంప్ మాట మార్చి పైవిధంగా స్పందించారు. అలాంటి తెలివితక్కువ పని (మారిషస్‌కు ఛాగోస్ దీవుల స్వాధీనం) గ్రీన్‌లాండ్ విషయంలో తాను చేయనని అన్నారు. శత్రువులను అదుపుచేసే విషయంలో డెన్మార్క్,గ్రీన్‌లాండ్ తెలివిగా వ్యవహరించాలని ట్రంప్ కోరారు. 1814లోకుదిరిన ఒప్పందం ప్రకారం ఫ్రాన్స్‌దేశం ఈ 60 గొలుసుకట్టు దీవుల సమూహాన్ని బ్రిటన్‌కు అప్పటించింది. గత ఏడాది మారిషస్‌తో బ్రిటన్ చేసుకున్న ఒప్పందం ప్రకారం ఛాగోస్ దీవులను స్వాధీనం చేసింది. ఈ విధంగా మొత్తం దీవులను వదులుకోవడం అతిపెద్ద తెలివితక్కువ పని అని ట్రంప్ ధ్వజమెత్తారు. ఐతే డియెగో గార్సియాలో బ్రిటన్–అమెరికాలకు చెందిన ఉమ్మడి వైమానికదళ,సైనికస్థావరం ఉంది. కానీ మొత్తం దీవులను మన దగ్గరే ఉంచుకుంటే హిందూమహాసముద్రంలో పెత్తనం మనకే ఉండేదన్నది ట్రంప్ వాదన. ఛాగోస్ దీవుల విషయంలో బ్రిటన్ తరహాలో తాను తెలివితక్కువ పనులు చేయనని, అందుకే గ్రీన్‌లాండ్ దీవిని స్వాయత్తం చేసుకునేందుకు అమెరికా గట్టి ప్రయత్నాలు చేస్తోందని ట్రంప్ అసలు విషయం చెప్పారు. తమ ప్రమేయం లేకుండా ఈ దీవులపై అమెరికాకు పెత్తనం ఇస్తున్నారని మారిషస్ చాలా కాలంగా అల్లరిపెడుతోంది. ఈ అల్లరి వెనుక చైనా హస్తం ఉందని ట్రంప్ బలంగా నమ్ముతున్నారు. ఐతే ట్రంప్ చెప్పినట్టు డియెగో గార్సియా దీవిలో సైనికస్థావరంపై మాత్రమే పెత్తనం కొనసాగేలా మారిషస్‌తో బ్రిటన్ ఒప్పందం చేసుకుందన్నది ముఖ్యసమాచారం. డియెగో గార్సియా దీవిని తన వద్దనే 99 సంవత్సరాలపాటు ఉంచుకున్నందుకుగాను ప్రతి సంవత్సరం మారిషస్‌కు 101 మిలియన్ పౌండ్లు బ్రిటన్ చెల్లించాల్సి ఉంటుంది. ఐతే బ్రిటన్ కొత్తగా చేసిన ప్రకటన ప్రకారం ఈ దీవుల్లో స్థానిక కోర్టు తీర్పుల ప్రకారం బ్రిటన్–అమెరికా సైనిక స్థావరం ఉనికి చిక్కుల్లో పడింది. దీంతో ఇప్పుడు ట్రంప్ బ్రిటన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. చైనా,రష్యా దేశాలు బలహీన చర్యలను బాగా గమనిస్తాయి, ఆ రెండు దేశాలూ బలాన్ని అంచనావేస్తాయి, వాటిని గుర్తిస్తాయి, అందుకే నేను అధికారంలోకి వచ్చాక అమెరికాకు గుర్తింపు వచ్చింది, అమెరికా బలోపేతమైంది, మరింత ఎక్కువ గౌరవం సంపాదించింది అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## ఐక్యంగా ఎదుర్కొందాం (మొదటి పేజీ తరువాయి)

జరిగిన సెమినార్‌లో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని బిజెపి నేతృత్వంలోని మతతత్వ శక్తులు నిర్వీర్యం చేస్తున్నాయని, ఆర్థిక సామాజిక అంశాలను పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. లౌకిక ప్రజాతంత్ర శక్తుల ఐక్యతతోనే మతతత్వ శక్తులను అడ్డుకోగలమని ఆయన స్పష్టం చేశారు. దేశంలో మారిన పరిస్థితులకు అనుగుణంగా వామపక్షాలు ఐక్యంగా కదలాలని, మార్క్స్ చెప్పినట్లుగా వర్గ పోరాటాల ద్వారానే సమసమాజం నిర్మితమవుతుందని మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. భారతదేశంలో ప్రస్తుతం పార్లమెంటరీ వ్యవస్థ ప్రశ్నార్థకమైందని, ఒక పక్క ఫాసిస్టు శక్తులు, మరోపక్క కార్పొరేట్‌లు ఈ దేశాన్ని చిన్నాభిన్నం చేయాలని ప్రత్నిస్తున్నాయని ఇటువంటి సమయంలో వామపక్షాలు బలపడటం ఈ దేశానికి అవసరమన్నారు. ఖమ్మం జిల్లా అనేక భావజాలాకు నిలయంగా ఉందని అదే సమయంలో అతిథ్యం అందించడంలో ఖమ్మం ముందు వరుసలో ఉంటుందని, ఖమ్మంలో జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించడం వామపక్ష జాతీయ నేతలు హాజరుకావడం సంతోషకరమన్నారు. వందేళ్ల సిపిఐ చరిత్రలో ఎన్నో అటుపోట్లు ఉన్నాయని విక్రమార్క తెలిపారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో సిపిఐ ప్రముఖ భూమిక పోషించిందని ఆయన తెలిపారు. 1947లో ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని తెలంగాణ ప్రాంతానికి స్వాతంత్ర్యం రాలేదని ఇక్కడి నిజాం రాజును కూల్చడానికి కమ్యూనిస్టులు సాయుధ పోరాటం చేశారని ఆ పోరాటం ప్రపంచ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. తెలంగాణలో భూమి కోసం భుక్తి కోసం పేదల విముక్తి కోసం పోరాడడంతో పాటు దున్నేవానికే భూమి దక్కాలని కమ్యూనిస్టులు పోరాడారని, మహోత్తర పోరాటాలతో విలసిల్లిన నేల తెలంగాణ అని ఆయన తెలిపారు. ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో ఏ ఇంటి తలుపు తట్టిన ఒక వీరగాథ వినిపిస్తుందన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే కాంగ్రెస్ పార్టీ కౌలుదారి చట్టాన్ని, భూ సంస్కరణ చట్టాన్ని, 20 సూత్రాల ఆర్థిక పథకాన్ని , బ్యాంకుల జాతీయ కరణతో పాటు ఇటీవల కాలంలో సమాచార హక్కు చట్టం, జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కూడా కాంగ్రెస్ తీసుకు వచ్చిందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య రక్షణ కర్తవ్యాలుగా వామపక్షాలు ఇతర లౌకిక శక్తులు కలిసి పనిచేయాలన్నారు. ఇప్పటికే హక్కులు హరించబడుతున్నాయని, ఓటు హక్కు సైతం ప్రమాదంలో పడిందని ఆయన తెలిపారు. ఈ దేశంలో కాంగ్రెస్, వామపక్షాలు కలిసి సుదీర్ఘకాలం పయనించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని విక్రమార్క తెలిపారు. ఈ సందర్భంగా వందేళ్ల సిపిఐ సిడిని భట్టి విక్రమార్క ఆవిష్కరించారు.

## నిలువబోతున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండ లం గడ్డిపల్లి గ్రామం సమీపంలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. గడ్డిపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలు ఈ సంవత్సరం చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఇంజనీరింగ్ శాఖ అధికారులకు అదేశించారు. 5లక్షల 36వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 2500 మంది విద్యార్థులకు విద్యతో పాటు వసతి కల్పించే విధంగా అన్ని హంగులతో పాఠశాల భవనాలు, హాస్టళ్లు, స్టాఫ్ క్వార్టర్స్‌తో ఈ పాఠశాలను నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో దేశ అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు పోటీపడే విధంగా ఇంగ్లీష్ మీడియంతో పాటు సిబిఎస్‌ఈ సిలబస్‌ను ఈ పాఠశాలల్లో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గడ్డిపల్లి గ్రామానికి ఇంతమంచి విద్యాసంస్థ రావడం గర్వకారణమన్నారు. భవన నిర్మాణం వేగవంతం చేయడంతో పాటు నాణ్యత ఉండేలా చూసుకోవాలని, నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదని తాను నెలకొకసారి పాఠశాల నిర్మాణ పనులు తనిఖీ చేస్తానని, పాఠశాల నిర్మాణానికి అవసరమైన ఇసుక, బిల్స్ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని మంత్రి వెల్లడించారు. గడ్డిపల్లి వద్ద నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ నిర్మాణ పాఠశాల నిర్వహనపై ప్రత్యేక శ్రద్ద వహించాలని రాష్ట్ర విద్య మౌలిక సదుపాయల సంస్థ నుండి గణపతిరెడ్డిని ఆయన కోరారు. ఈ పాఠశాల నిర్మాణంలో భాగంగా రూ.20 కోట్లతో మంజూరు చేసిన బిటి డబుల్ రోడ్డును వేసవిలోగా పూర్తి చేయాల్సిందిగా ఇంజనీరింగ్ అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలప్రసాద్, ఆర్అండ్‌బి అధికారులు ఈఈ సీతారామయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**పేదల జీవితాల్లో వెలుగు నింపడమే ప్రభుత్వ ధ్యేయం**

మహిళల జీవితాల్లో ప్రత్యేకించి పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని అందులో భాగంగానే వడ్డీలేని రుణాల పంపిణీ ఇస్తున్నట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపల్ ఆవరణలో నేరేడుచర్ల మున్సిపల్ పరిధిలోని 404 స్వయం సహాయక మహిళ సంఘాలకు 52,07,399 రూపాయలు వడ్డీలేని రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.

అలాగే ఇందిర మహిళ శక్తి పథకం కింద 5498 మహిళలకు ఇందిరమ్మ చీరెలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజా జీవితంలో తప్పసులా ముందుకెళ్తున్నానని నేరేడుచర్ల మున్సిపాలిటి పరిధిలో వడ్డీలేని రుణాల పంపిణీతో పాటు 5498 మందికి ఇందిరమ్మ చీరెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, మార్కెట్ కమిటి చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి , వైస్ చైర్మన్ సురేష్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, మోప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్యం (మొదటి పేజీ తరువాయి)

పన్ను వసూళ్లు, మహిళలకు అందించే సంక్షేమ పథకాల అమలు, పట్టణ మున్సిపల్ సమస్యల పరిష్కారం వరకు అనేక రంగాల్లో ఏఐ ఆధారిత పరిష్కారాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. వ్యవస్థలోని మేధస్సే ఒక వైపు సమస్యగా, మరోవైపు పరిష్కారంగా మారుతోందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఏఐని సరైన దిశలో వినియోగిస్తే పాలన మరింత సమర్థవంతంగా మారుతుందని అన్నారు. అదునాతన ఏఐ యుగంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉండలేవని, ముందస్తు చర్యలు తీసుకోవడం, వేగంగా నిర్ణయాలు అమలు చేయడమే కీలకమని ఏఐ ప్రభావం గురించి మాట్లాడారు. ఈ సమావేశంలో ఈజిప్ట్ పెట్టుబడులు, విదేశీ వాణిజ్య మంత్రి హస్సన్ ఎల్కహతీబ్, ఎమరాల్ ఏఐ సిఈఓ వరుణ్ శివరామ్, ప్రపంచ మేధోసంపత్తి సంస్థ (డబ్ల్యుపిఓ) డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, జర్మనీ డిజిటల్ మంత్రిత్వ శాఖ మంత్రి కార్ స్టైన్ వైల్ బెర్గర్, నోకియా సిఈఓ జస్టిన్ హోటార్డ్, హిటాచి సిఈఓ తోషియాకి టోకునాగా సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఇజ్రాయిల్ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

పాలసీ 2026–2030' గురించి ప్రతినిధి బృందం వివరించింది. 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఆర్థిక వ్యవస్థ నిర్మించడమే ఈ విధాన లక్ష్యమని, మెడికల్ ఎలక్ట్రానిక్స్ సహా అనుబంధ రంగాలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు.సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఔషధ తయారీ, పరిశోధనాభివృద్ధి (ఆర్ డి) రంగాల్లో ప్రపంచ స్థాయి, స్థిరమైన పారిశ్రామిక క్లస్టర్‌ను తెలంగాణలో నిర్మిస్తున్నామని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్ఆర్) , రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) మధ్యనున్న ప్రాంతంలో పెరి–అర్బన్ రీజియన్ ఎకానమీ (పుర్) తయారీ, లాజిస్టిక్స్ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ కొత్త లైఫ్ సైన్సెస్ విధానం, ఔషధ తయారీ వ్యూహాలు కలిసి తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు పునాది వేస్తాయని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు, బలమైన ఐటి–లైఫ్ సైన్సెస్–హెల్త్ కేర్ టాలెంట్ బేస్, జీనోమ్ వ్యాలీ, 300 ఎకరాలకుపైగా విస్తరించిన మెడికల్ డివైసెస్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఉన్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ వైద్య పర్యాటకానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, ఇక్కడి ఆస్పత్రులు ఇప్పటికే క్రిటికల్ కేర్, అంబులెన్స్ సేవలు వంటి రంగాల్లో ఏఐను సమర్థవంతంగా వినియోగిస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఏఐకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏఐ సిటీని నిర్మిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇదే సరైన సమయం. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేయడానికి ఇది ఉత్తమ అవకాశమని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణకు వచ్చి.. జీనోమ్ వ్యాలీని సందర్శించాలని మంత్రి ఫిలిప్స్ నాయకత్వాన్ని ఆహ్వానించారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఇప్పటికే మెడ్ ట్రానిక్, ఒలంపస్, జీఈ వంటి అగ్రశ్రేణి సంస్థల ఎంబెడేడ ఇంజినీరింగ్, ఆర్ అండ డీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ జాన్ విల్లెమ్– స్కీజ్ గ్రోండ మాట్లాడుతూ.. ఆరోగ్య రంగంలో తెలంగాణ చేపడుతున్న ఏఐ ఆధారిత మార్పు అత్యంత ప్రశంసనీయమని అన్నారు. తమ నెదర్లాండ్స్ ప్రధాన కార్యాలయాన్ని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సందర్శించాలని ఈ సందర్భంగా ఆహ్వానించారు.

**యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యానికి సౌదీ సంస్థ ఆసక్తి**

సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థ 'ఎక్స్ పర్టైజ్' స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యమయ్యేందుకు ఆసక్తి వ్యక్తం చూపింది. సంస్థ ప్రెసిడెంట్ , సీఈఓ మొహమ్మద్ ఆశిఫ్, దావోస్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థకు ఉద్యోగ అవకాశాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలనే లక్ష్యంతోనే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు, ప్రాక్టికల్ శిక్షణ అందించడమే స్కిల్ యూనివర్సిటీ ప్రధాన ఉద్దేశమన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ 2047 విజన్‌కు అనుగుణంగా తెలంగాణను భవిష్యత్‌కు సిద్ధమైన ప్రతిభా కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రాథమిక విద్య, ఆధునిక నైపుణ్యాలు, శిక్షణ, మెంటార్‌షిప్ ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం సాధించడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. భారతదేశంలో పూర్తిగా పరిశ్రమల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న తొలి విశ్వవిద్యాలయం స్కిల్ యూనివర్సిటీయేనని ఆయన పేర్కొన్నారు. ఎక్స్ పర్టైజ్ సంస్థ సిఇఒ మొహమ్మద్ ఆశిఫ్ మాట్లాడుతూ ప్రతి ఏటా సుమారు 5వేల మంది నైపుణ్య కలిగిన సిబ్బందిని నియమించుకునే అవసరం తమకు ఉందని, ఆ అవసరాలను తీర్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో భాగస్వామ్యం చేసుకోవాలని ప్రతిపాదించారు. అవసరమైన అన్ని విభాగాల్లో శిక్షణను యూనివర్సిటీ తో కలిసి ప్రారంభించాలనుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో ఈ సంస్థ, పెట్రో కెమికల్స్, ఆయిల్ అండ గ్యాస్, ఎరువులు, స్టీల్, సిమెంట్, వాటర్ ట్రీట్‌మెంట్, విద్యుత్ ఉత్పత్తి వంటి నైపుణ్యాధారిత రంగాల్లో ప్లాంట్ నిర్వహణ సేవలను అందిస్తోంది.

**భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తెలంగాణతో కలిసి పనిచేస్తాం : యూఏఈ**

భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి యూఏఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి హెచ్.ఇ. అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వేదిక 2026 సదస్సులో భాగంగా దావోస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో యూఏఈ మంత్రి మంగళవారం భేటీ అయ్యారు. 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి రాష్ట్రంలో చేపట్టే భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ముఖ్యంగా భారత్ ఫ్యూచర్ సిటీపై చర్చించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ ను వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ అభివృద్ధి అవకాశాలపై సిఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇది దేశంలోనే తొలి నెట్‌జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. సుమారు 30 వేల ఎకరాల్లో విస్తరించే ఈ నగరంలో ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాస, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్ట్ లో మారుబేని, సెమ్ కార్ప్ వంటి అంతర్జాతీయ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని, రిలయన్స్ గ్రూప్ వంతారాతో ఫ్యూచర్ సిటీలో కొత్త జూ ఏర్పాటు కోసం అవగాహన ఒప్పందం కుదిరిందని సిఎం వెల్లడించారు. తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని అబ్దుల్లా బిన్ తెలిపారు. ప్రాజెక్ట్ వేగవంతమయ్యేందుకు రెండు ప్రభుత్వాల అధికారులతో సంయుక్త టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్‌తో తెలంగాణ కలిసి పనిచేసి గ్రామీణ, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

### తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు

# ముందుకొచ్చిన గూగుల్




**సిఎం రేవంత్ రెడ్డితో గూగుల్ ఎపిఎసి ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా సమావేశం**

**ట్రాఫిక్, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్‌లు, వ్యవసాయం తదితర రంగాల్లో సహకారం**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ వివిధ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. వ్యవసాయం, వాతావరణ మార్పు, పట్టణ కాలుష్య సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకుంటామని తెలిపింది. ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్లలో భాగస్వామ్యం పంచుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గూగుల్ ఆసియా పసిఫిక్ ఏరియా (ఎపిఎసి) ప్రెసిడెంట్ సంజయ్ గుప్తాతో సమావేశమయ్యారు. ప్రధానంగా వాతావరణంలో పెను మార్పులు, వ్యవసాయంపై దాని ప్రభావం, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న కాలుష్యం వంటి సమస్యల పరిష్కారాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి నమూనాను వివరించారు. కోర్ హైదరాబాద్ సిటీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే ప్రణాళికలను వివరించారు. ట్రాఫిక్ కంట్రోల్, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్ ఇన్నోవేషన్‌కు మరింత మద్దతు వంటి రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తొలి గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినందుకు గూగుల్ బృందానికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ రంగంలో ఎరువుల అతిగా వినియోగం వల్ల ఏర్పడుతున్న సమస్యలు, రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరంపై ఈ సమావేశంలో ప్రతినిధుల బృందం చర్చించింది. సమస్యల పరిష్కారానికి, సమస్యలు తలెత్తకుండా నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గూగుల్ ఎపిఎసి ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్లు, వాతావరణ మార్పు అంశాల్లో తెలంగాణకు పూర్తి స్థాయిలో మద్దతు అందించేందుకు గూగుల్ సిద్ధంగా ఉందని తెలిపారు. సిఎంతో పాటు సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విస్తృత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, బిఎఫ్ఎస్ఐ స్కిల్లింగ్, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలాతో భాగస్వామ్యం, ఏఐ పాఠ్యాంశాల అమలును ప్రధానంగా ప్రస్తావించారు. ప్రభుత్వం పాఠశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా, టీఫైబర్ ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ అందిస్తుందని వివరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**హైదరాబాద్‌లో జిసిసి ఏర్పాటుపై యూనిలీవర్ పరిశీలన**

ప్రపంచ వ్యాప్తంగా వస్తు వినియోగరంగంలో అగ్రగామిగా ఉన్న యూనిలీవర్ సంస్థ, హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జిసిసి) ఏర్పాటు చేసే అవకాశాలపై ఆసక్తి వ్యక్తం చేసింది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్)2026 సదస్సులో భాగంగా మంగళవారం దావోస్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం యూనిలీవర్ చీఫ్ సప్లై చైన్ అండ్ ఆపరేషన్స్ ఆఫీసర్ విల్లెమ్ ఉయిజెన్‌తో సమావేశమైంది. తెలంగాణలో జిసిసి ఏర్పాటు అంశంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు కేంద్రంగా హైదరాబాద్ వేగంగా మారుతుందని వివరించారు. దీనిపై స్పందించిన విల్లెమ్ ఉయిజెన్ హైదరాబాద్‌లో జిసిసి ఏర్పాటు అవకాశాలను తమ సంస్థ సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఇప్పటికే మెక్‌డొనాల్డ్స్, హైనెకెన్, కాస్ట్‌కో వంటి ప్రముఖ ఎఫ్‌ఎంసిజి (త్వరగా వినియోగ వస్తువుల) సంస్థల జిసిసిలు విజయవంతంగా పనిచేస్తున్నాయని చెప్పారు. తెలంగాణకు యూనిలీవర్ విలువైన భాగస్వామి అని, వేగవంతమైన అనుమతులు, లైసెన్సింగ్ ప్రక్రియలతో తెలంగాణ వ్యాపారాలకు అనుకూల రాష్ట్రంగా నిలుస్తోంది అని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహా తెలంగాణ రైజింగ్ బృందం, తెలంగాణలోని పారిశ్రామిక పార్కుల్లో త్వరగా వినియోగ వస్తువుల (ఎఫ్‌ఎంసిజి) తయారీ రంగంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని యూనిలీవర్‌ను ఆహ్వానించారు. వాతావరణ పరిరక్షణ, నీటి వినియోగంలో సానుకూలత, ప్లాస్టిక్ వినియోగ తగ్గింపు వంటి యూనిలీవర్ లక్ష్యాలను, తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న పునరుత్పాదక శక్తి, నీటి సంరక్షణ, సర్క్యులర్ ఎకానమీ కార్యక్రమాలతో అనుసంధానం చేసే అంశాలపై కూడా చర్చలు జరిగినట్లు తెలిపారు.



### 'తెలంగాణ రైజింగ్'లో

# భాగస్వామ్యం అవ్వండి

**'ఇండియా పెవిలియన్' ప్రారంభోత్సంలో దిగ్గజ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించిన మంత్రి శ్రీధర్ బాబు**

ప్రజాపక్షం/హైదరాబాద్

'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచిన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యం కావాలని దిగ్గజ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణతో కలిసి పని చేసేందుకు, రాష్ట్రాభివృద్ధిలో పాలు పంచుకునేందుకు ముందుకు రావాలని వారిని సాదరంగా ఆహ్వానించారు. మంగళవారం వరల్డ్ ఎకనామిక్ ఫోరం(డబ్ల్యూఇఎఫ్) వార్షిక సదస్సులో భాగంగా దావోస్‌లో ఏర్పాటు చేసిన 'ఇండియా పెవిలియన్' ప్రారంభోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా దానిని నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. 2047 నాటికి దేశ జిడిపిలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, అందుకు అనుగుణంగా దార్శనికతతో కూడిన ప్రణాళికాబద్ధమైన అడుగులు వేస్తున్నామన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేలా నిపుణులు, పారిశ్రామికవేత్తలు, ప్రజల భాగస్వామ్యంతో కాంప్రహెన్సివ్ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశామన్నారు. ఈ విజన్ డాక్యుమెంట్‌లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే కీలక రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఫార్మాస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, హెల్త్ కేర్ ఇన్నోవేషన్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్, హార్డ్ వేర్ మాన్యుఫ్యాక్చరింగ్, ఐటి, ఐటిఇఎస్, ఏరో స్పేస్, డిఫెన్స్, టెక్స్ టైల్, అప్పారెల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆగ్రో బేస్డ్ ఇండస్ట్రీస్, రెన్యువబుల్ ఎనర్జీ, గ్రీన్ టెక్నాలజీస్ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలు, అవకాశాలు, ఇక్కడి ఎకో సిస్టం గురించి వివరించారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి, ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. దావోస్ వేదికగా తమ ప్రభుత్వం గత రెండేళ్లలో సుమారు రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులను సమీకరించిందన్నారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో పారిశ్రామికాభివృద్ధికి ఉత్తమిచ్చేలా రూపొందించిన పాలసీలను వివరించి, దిగ్గజ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చేలా కృషి చేస్తామన్నారు. 'తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అయ్యేలా లైఫ్ సైన్సెస్ పాలసీ 2.0, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్( టిఎఐహెచ్) ను దావోస్ వేదికగా లాంఛనంగా ఆవిష్కరిస్తామన్నారు.

### తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులకు

## దరఖాస్తుల ఆహ్వానం

**ఫిబ్రవరి 3 వరకు స్వీకరణ : మంత్రి కోమటిరెడ్డి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి) ద్వారా సర్టిఫికేషన్ పొం దిన చిత్రాలకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటివరకు ఉన్న అవార్డు విభాగాలకు తోడు ఈసారి కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సామాజిక స్పృహను ప్రతిబింబించే చిత్రాలకు 'ఉత్తమ సామాజిక సందేశ చిత్రం' అవార్డు, ప్రత్యేక విభాగంలో డా.సి. నారాయణ రెడ్డి అవార్డులను అందజేయనున్నామన్నారు. అర్హులైన నిర్మాతలు, ఇతర దరఖాస్తుదారులు అవార్డులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు, మార్గదర్శకాలను జనవరి 31వ తేదీ వరకు పొందవచ్చని, ఎంట్రీల సమర్పణకు ఫిబ్రవరి 3 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపే దరఖాస్తులను సమర్పించాలని, అర్హులైన నిర్మాతలను ప్రభుత్వం తరుపున మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు.

## తెలంగాణకు 6 కొత్త అర్బన్ ఫారెస్ట్‌లు

**'నగర్ వన్ యోజన' కింద రూ.8.26 కోట్లు మంజూరు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పట్టణాల్లో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నగర్ వన్ యోజన పథకం' కింద తెలంగాణ రాష్ట్రానికి కీలక ప్రోత్సాహం లభించింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణలో 6 కొత్త అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటుకు గాను మొదటి విడతలో 70 శాతం నిధులను మొత్తం రూ. 8.26 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని అటవీ దళాల ముఖ్య సంరక్షణాధికారిణి డా.సి సువర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులు తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ పరిధిలోని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ద్వారా వినియోగించనున్నారు. నగరాలు, పట్టణాల పరిధిలో అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటు ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడడం, కాలుష్యాన్ని తగ్గించడం, ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. నగర్ వన్ యోజన కింద ఏర్పాటయ్యే అర్బన్ ఫారెస్ట్‌లలో స్థానిక వృక్షజాలానికి ప్రాధాన్యం ఇస్తూ విస్తృతంగా మొక్కలు నాటనున్నారు. నడక మార్గాలు, విశ్రాంతి కేంద్రాలు, పచ్చని మైదానాలతో ప్రజలకు ప్రకృతి ఒడిలో విహరించే అవకాశం కల్పించనున్నారు. పిల్లలు, వృద్ధులు, ఉదయ, సాయంత్రపు వాకర్లకు ఈ అర్బన్ ఫారెస్ట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆమోదం పొందిన అర్బన్ ఫారెస్ట్‌ల ప్రాంతాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని మావలా, యాపల్‌గూడ–II, మంచిర్యాల జిల్లాలోని ఇందారం, చెన్నూర్, మేడ్చల్ జిల్లాలోని యెల్లంపేట, చెంగిచెర్ల అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటు వల్ల పట్టణాల్లో హరితావరణం విస్తరించడంతో పాటు గాలి నాణ్యత మెరుగుపడనుంది. అలాగే ఉష్ణోగ్రతల పెరుగుదలను నియంత్రించడం, వర్షపు నీటి సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఉంటుంది. నగర్ వన్ యోజన ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని పర్యావరణ పరిరక్షణలో ముందంజలో నిలిపే దిశగా ఈ అర్బన్ ఫారెస్ట్‌లు కీలక పాత్ర పోషిస్తాయని డాక్టర్ సువర్ణ తెలిపారు.

## స్కామ్‌లు డైవర్ట్ చేసేందుకే.. ఫోన్ ట్యాపింగ్ డ్రామాలు

**బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను, భారీ కుంభకోణాలను కప్పిపుచ్చుకోవడానికి 'అటెన్షన్ డైవర్షన్' రాజకీయాలకు పాల్పడుతోందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామావు అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి టెండర్లలో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కేంద్రంగా భారీ రిగ్గింగ్ జరుగుతోందని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే నిబంధనను పెట్టి, టెండర్ వేసే కంపెనీలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. కేంద్రం వాటా ఉన్న సింగరేణిలో ఇంత దోపిడీ జరుగుతుంటే కిషన్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని, ఇందులో బిజెపికి కూడా వాటాలు ఉన్నాయా ? అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. బొగ్గు కుంభకోణాన్ని హరీశ్ రావు బయటపెట్టినందుకే, ఆయనకు నోటీసులు ఇచ్చి వేధించడమే కాకుండా అటెన్షన్ డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఒక మంత్రి 20 శాతం కమీషన్ అని, ఇంకో మంత్రి బ్యాగ్ మాన్ అని విమర్శించారు. రాజకీయ క్రీడలో పోలీసులు బలి కావొద్దని, అక్రమ కేసులు పెట్టే అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టే ప్రసక్తే లేదని కెటిఆర్ హెచ్చరించారు. బిఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి చిహ్నమని, ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని లీకులు ఇచ్చినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. న్యాయస్థానాల్లోనే తేల్చుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.


# వామపక్ష ఐక్యతే దేశ ప్రగతికి మూలాధారం

(మొదటి పేజీ తరువాయి)



స్వాగతం పలుకగా, సిపిఐ జాతీయ కార్యదర్శి ప్రకాశ్‌బాబు వందనసమర్పణ చేశారు.
డి.రాజా మాట్లాడుతూ వర్తమాన భారతదేశం వర్గం, కుల వివక్ష, మత విద్వేషాలు, అసమానతలు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడి అనే సవాళ్ళను ఎదుర్కొంటోందని, కమ్యూనిస్టులను రక్షించుకుంటూనే, ప్రమాదకరమైన బిజెపిని అడ్డుకోవడం లాంటి అనేక సవాళ్లు వామపక్షాల ముందున్నాయని వివరించారు. ప్రస్తుతం ఐక్య ఉద్యమాలు చేపడుతున్నప్పటికీ ప్రస్తుత ప్రమాదకర పరిస్థితుల్లో వామపక్షాలు మరింత బలమైన శక్తిగా ఎదిగినప్పుడే భారతదేశ సంక్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. వామపక్షాలు బలమైన శక్తిగా ఎదిగినప్పుడే పేదలు, కూలీలు, రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, మహిళలు తదితర తరగతులకు ఉపయుక్తంగా ఉంటుందని సూచించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న కేరళలో వామపక్ష, ప్రజాతంత్ర ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలని, తమిళనాడులో బిజెపిని అడుగుపెట్టనివ్వకూడదని, పశ్చిమబెంగాల్‌లో వామపక్షాలు మరింత బలంగా ఎదగాలన్నారు. మనిషి మదిలోనే కులం ఉన్నదని ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు మోహన్ భాగవత్ చెబుతున్నారని, కాని కులాన్ని నిర్మూలించాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన విషయాన్ని రాజా గుర్తు చేశారు. ' ఎస్ఐఆర్ ' పేరుతో బిజెపికి ప్రతికూలంగా ఉన్న ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాష్ట్రాల హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హరిస్తోందని, పార్లమెంట్‌లో ప్రజాస్వామిక వాతావరణం లేదని, ఇలాంటి చర్యలతో భారతదేశంలో ప్రజాస్వామ్యం ఉన్నదా అనే పరిస్థితులను తీసుకొచ్చారని రాజా దుయ్యబట్టారు. కృత్రిమ మేథస్సు ఆగమనంతో కార్మిక వర్గ స్వభావం మారిందని, దీనిని కూడా పరిగణలోకి తీసుకొని పోరాట స్వరూపాలను రూపొందించుకోవాలని చెప్పారు.

**ఎస్ఐఆర్ అంటే ...: ఎం.ఎ.బేబి**



ఎం.ఎ.బేబి మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచన మేరకు వారి లెక్కల ప్రకారమే జనగణన జరుగుతుందని, వాటి ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండానే బిజెపికి మూడింట రెండు వంతుల సీట్లు సాధించే విధంగా నియోజకవర్గాల పునర్విభజన, జనగణన, ఓటరు జాబితాల నుంచి ఓటర్ల తొలగింపు కుట్ర జరుగుతోందని, ఇందుకు కొత్త సాంకేతిక విధానాన్ని కూడా ఉపయోగించుకుంటుందని విమర్శించారు. రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రిమూవల్ అని ఎద్దేవా చేశారు. కేరళలో త్రివేండ్రంలో ఎస్ఐఆర్‌లో తన పేరు, తన కుటుంబసభ్యుల పేర్లే ఓటర్ల జాబితాలో కనిపించలేదని, చివరకు వాటిని చేర్చుకోవాల్సి వచ్చిందన్నారు. మాజీ ఎంపిగా ఉన్న తన పరిస్థితి ఇలాగ ఉందన్నారు. వామపక్షాలు లేకుంటే భారతదేశం అనే భావన ఉండబోదని, వామపక్షాలు ఐక్యంగా బలమైన ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో కేవలం ఒక పేరును మాత్రమే మార్చడం కాదని, మొత్తం లక్ష్యాలను మార్చారని విమర్శించారు. అందులో గ్రామీణ భారతాన్ని, అక్కడ ఉపాధిని ప్రశ్నార్థకం చేశారని అన్నారు. మావోయిస్టు పార్టీకి తమకు సైద్ధాంతిక విభేదాలు ఉన్నప్పటికీ ఎన్ కౌంటర్ల పేరుతో కాల్చి చంపడాన్ని నాగరిక సమాజం అంగీకరించబోదని, దానిని తాము వ్యతిరేకించామని బేబీ అన్నారు. భారత ప్రధాని దేశ ప్రయోజనాల కంటే అమెరికా, ఇజ్రాయిల్ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. వామపక్షాలు మత ఉన్మాదానికి వ్యతిరేకమని, మతానికి కాదని స్పష్టం చేశారు.

**దీపాంకర్ భట్టాచార్య**



దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ ప్రస్తుతం దేశం ఫాసిజం బాటలో ఉందని, అది పూర్తిగా రూపాంతరం చెందకముందే పోరాటాల ద్వారా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం సువర్ణాధ్యాయమని, తమ పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి తెభాగ, తెలంగాణ, నక్సల్బరీ ఉద్యమాలను గుర్తు చేసుకుంటామని తెలిపారు. 'జల్ , జంగిల్, జమీన్' తరహాలో పర్యావరణం, నీరు, ప్రజాస్వామ్యం ఏజెండాగా వామపక్షాలు బలమైన ఉద్యమాన్ని నిర్మించాలన్నారు. దళిత, కమ్యూనిస్టు, ఇతర ఉద్యమాలను ఒక దగ్గరకు చేర్చాలని, తద్వారా బలమైన పోరాటంగా అవతరిస్తామని, దేశంలో ఫాసిజం , అప్రజాస్వామ్యం పూర్తిగా విస్తరించకముందే ఉద్యమాలను నిర్మించాలని సూచించారు. మహాత్మాగాంధీ నరేగా చట్టం రద్దు చేసి తెచ్చిన కొత్త చట్టం కేవలం పేరు మార్పు మాత్రమే కాదని మొత్తం పథకాన్ని తొలగించే కుట్ర అని విమర్శించారు. అదాని కోసమే అణుశక్తి రంగంలో ప్రైవేటీకరణను అనుమతిస్తూ చట్ట సవరణ చేశారని విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో 12 రాష్ట్రాలలో సుమారు 7 కోట్ల మంది ఓటర్లను తొలగించారని వివరించారు. హిట్లర్ తొలుత ఎన్నికల ద్వారానే అధికారంలోకి వచ్చారని, ఆ తర్వాత రాజ్యాంగాన్ని మార్చి ఒక నియంతగా మారాడని, ప్రస్తుతం దేశంలో 'ఒకే దేశం, ఒకే నాయకుడు, ఒకే పార్టీ' అనే మోదీ ఆలోచన కూడా హిట్లర్ లాంటిదేనని భట్టాచార్య విమర్శించారు.

**పోరాట పంథాను మార్చుకోవాలి : దేవరాజన్**



జి. దేవరాజన్ మాట్లాడుతూ పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వామపక్షాలు సద్వినియోగం చేసుకోవాలని, వామపక్షాలన్ని కేంద్రీకృతమై ఒక ఎజెండాతో పని చేసినప్పుడు. సత్ఫలితాలు వస్తాయని అన్నారు. మారిన కాలం, సమాజం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని పోరాట మార్గాలు నవీకరించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాను మితవాద శక్తులు ఉపయోగించుకొని అబద్ధాలనే ప్రచారం చేస్తున్నాయన్నారు. మనం ఇంకా 20వ శతాబ్ద కాలపు పరిజ్ఞానంతో 21వ శతాబ్దపు సమస్యలపై పోరాడ లేమని చెప్పారు. ఐక్య ఉద్యమాలు కేవలం నినాదాలుగా మిగలొద్దన్నారు. సెక్యులర్ శక్తులతో కలిసి పనిచేసేటప్పుడు కూడా వామపక్ష ఐక్యతను ప్రదర్శించాలన్నారు. సిపిఐ వందేళ్ల ప్రస్థానం ఈ దేశానికి ఒక దిక్సూచి అని, రైతులు, కూలీల దగ్గర నుంచి కార్మికుల వరకు అన్ని వర్గాల పక్షాన నిలిచిన చరిత్ర వామపక్షాదేనని అన్నారు.

**వామపక్షాలు కలిస్తే ప్రత్యామ్నాయ శక్తి : కూనంనేని**

కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వామపక్షాలన్నీ కలిసి ఒక ఎర్ర జెండా గా మారాలని, ఢిల్లీలో ని ఎర్రకోట పైన ఎర్ర జెండా ఎగురాలని అన్నారు. ఎర్ర జెండాలన్నీ ఒకటిగా ఉంటే, దేశంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఉంటామని అభిప్రాయపడ్డారు.



రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి రావాలో నిర్ణయించే శక్తి వామపక్షాలకు ఉందని ఆయన తెలిపారు. మావోయిస్టులు సిద్ధాంతం పరంగా వేరు అయినప్పటికి వారిని కూడా రక్షించుకోవాలని అన్నారు. ఎర్ర జెండాలన్నీ సురక్షితంగా ఉండాలని చెప్పారు. రావణాసురుడు సీతను తీసుకెళ్లినట్టుగా ట్రంప్ వెనిజుల లో అక్కడి అధ్యక్షుణ్ణి, ఆయన భార్యను తీసుకెళ్లారని అన్నారు.

**ఘనంగా శతాబ్ది ఉత్సవాలు : పల్లా వెంకట్ రెడ్డి**

పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సిపిఐ శతాబ్ది ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించామని వివరించారు.



సిపిఐ సభకు లక్షలాది మంది తరలి వచ్చారని తెలిపారు. కాగా పల్లా వెంకట రెడ్డి, ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా, సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్ జీత్ కౌర్, గిరీష్ శర్మ, రామకృష్ణపండా, సందోష్‌కుమార్, సంజయ్ కుమార్, కె.ప్రకాశ్ బాబు, పల్ల భోసేన్ గుప్తా, కె. రామకృష్ణ వేదికపై ఆసీనులయ్యారు.

## ఐక్యతపై వామపక్ష నేతలు..

(మొదటి పేజీ తరువాయి)

సామ్రాజ్యవాదం పొడసూపుతున్నాయని, వాటిపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ ప్రసంగిస్తూ వామపక్ష ఐక్యతను నినాదాలకే పరిమితం చేయకుండా రాజకీయ ఆచరణలో పెట్టాలని పేర్కొన్నారు. ప్రగతి శీల శక్తుల చీలికలు ప్రతీఘాత శక్తుల, రాజకీయాలకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. మామూలు సమయంలోనే వామపక్షాల ఐక్యత అనడమే కాకుండా, ఎన్నికల సమయంలో ఆచరణలో చూపాలని,వామపక్షాలు ఎవరికివారు ప్రాంతీయ పార్టీలతో పొత్తులకు పోకుండా, ఐక్యవామపక్ష సంఘటనగా ఉంటే ఇతర పార్టీలతో ఎక్కువ స్థానాలు పొందవచ్చని అన్నారు. కాగా, ఆర్‌ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య అనారోగ్య కారణాలతో సెమినార్‌కు హాజరుకాలేకపోతున్నానని, ఆయన కమ్యూనిస్టు పార్టీ శ్రేణులకు శతవసంతాల సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ పంపిన సందేశాన్ని డి.రాజా చదివి వినిపించారు.

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం**
**కొత్తకోట మున్సిపాలిటీ, వనపర్తి జిల్లా, (టిఎస్).**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన**
''ఇ''ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం కింద 04 పనుల కొరకు టెండర్లను ఆహ్వానించడమైనది. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 20.01.2026న ఉ.9.30గం.ల నుండి, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఆఖరి తేది:** 23.01.2026న ఉ.10.30గం.ల వరకు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు. బిడ్లను ఆహ్వానించు కార్యాలయం: కమిషనర్, కొత్తకోట మున్సిపాలిటీ, తెలంగాణ రాష్ట్రం. సెల్: 9440418505, 9440656778.
DIPR R.O. No. : 13988-PP/CL/ADVT/1/2025-26 Date: 20-01-2026 సం/- కమిషనర్, కొత్తకోట మున్సిపాలిటీ.

**శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానము**
**కొడవటంచ గ్రామము, రేగొండ మండలము, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.**
లేఖ నెం. ఎస్.ఎల్.ఎన్.ఎస్.డి/ప్రకటన /2026 తేది. 20.01.2026
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా! శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానము, కొడవటంచ గ్రామము, రేగొండ మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నందు పాత ఇనుప సామాగ్రి మరియు ఇత్తడి సామాగ్రి విక్రయించుటకు తేది: 02.02.2026 రోజున మ.3-00 గం.లకు సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలము నిర్వహించబడును. టెండర్ షెడ్యూల్ ధర 300/- మరియు రూ.10,000/-లు చెల్లించవలెను. ఈ టెండర్లలో హిందువులు మాత్రమే పాల్గొనవలెను. వివరములు కార్యాలయంలో నేరుగా కానీ లేదా సెల్ నెం. 9502825595 ద్వారా సంప్రదించగలరు.
DIPR R.O. No. : 14015-PP/CL/ADVT/1/2025-26 Date: 20-01-2026 సం/- కార్యనిర్వహణాధికారి

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
**సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్ : జిహెచ్ఎంసి.**
మెయిల్: sew.ghmc@gmail.com సెల్ నెం. 9154172331
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**
NIT No.42/SE/SLPZ/GHMC/2025-26 తేది: 20.01.2026
పని పేరు: (02 ఐటమ్స్) జిహెచ్ఎంసి, ఎస్ఎల్‌పిజెడ్, సర్కిల్-48లో సిసి రోడ్ వేయడం. **అంచనా మొత్తం / ఇసివి:** రూ.175.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 21.01.2026న మ.1.00గం.ల నుండి, 28.01.2026న మ.1.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎస్ఇ, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9154172331.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి జోన్ : జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 14029-PP/CL/ADVT/1/2025-26 Date: 20-01-2026

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం



రెండు అంగన్‌వాడీ భవనాలు ప్రారంభం, సబ్ స్టేషన్ నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలం సైదాపూర్ గ్రామంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలిసి ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో నూతనంగా నిర్మించిన రెండు అంగన్వాడీ భవనాలను వారు ప్రారంభించారు. అనంతరం గ్రామ శివారులో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. మంత్రి కోమటిరెడ్డి ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యవసాయ మోటార్లకు తక్కువ వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా, రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ అందించడమే ఈ సబ్‌స్టేషన్ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్, తాగునీరు, విద్యా సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. విద్యుత్ రంగ బలోపేతం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, సబ్‌స్టేషన్లు మరియు లైన్ల ఆధునీకరణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కన్నాయి రోజా, ఉప సర్పంచ్ దుంబాల వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ బీర్ల శంకర్, మాజీ ఎంపీపీ శ్రీశైలం, గ్రామ ప్రజలు వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి కోమటిరెడ్డి, విప్ బీర్ల అయిలయ్య**

తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మంగళవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలేరు పట్టణాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన వారు, ముందుగా క్షేత్రానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి, ప్రభుత్వ విప్‌కు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, లడ్డూ ప్రసాదం మరియు చిత్రపటాన్ని అందజేశారు.

## హరీష్‌రావు 'ట్యాపింగ్' నిందితుడు నీతులు చెబితే సహించం

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** మాజీ మంత్రి హరీష్ రావు తీరుపై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నిప్పులు చెరిగారు. హరీష్ రావు తానేదో పెద్ద పోరాట యోధుడిలా ఫీల్ అవుతున్నారని, కానీ ఆయన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ ఎదుర్కొంటున్న నిందితుడనే విషయాన్ని మర్చిపోకూడదని ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ హరీష్ రావుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి నీచాతి నీచంగా ఫోన్లను ట్యాప్ చేయించి, ఇప్పుడు బయటకి వచ్చి సత్యహరిశ్చంద్రుడిలా మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఐలయ్య విమర్శించారు. 'సొంత ఇంటి అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేశారని మీ కుటుంబ సభ్యురాలు కవిత స్వయంగా స్పష్టం చేశారు. ఇంతకంటే సిగ్గుచేటు మరొకటి ఉంటుందా?' అని ప్రశ్నించారు. భార్యాభర్తలు, అధికారులు, రాజకీయ నాయకుల వ్యక్తిగత సంభాషణలను ట్యాప్ చేయడం హరీష్ రావు నైజమని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పటిది కాదని, గత రెండేళ్లుగా విచారణ జరుగుతోందని గుర్తు చేశారు. పదేళ్ల పాటు తెలంగాణను అడ్డగోలుగా దోచుకున్న హరీష్ రావు ఒక 'చీటర్' అని ఐలయ్య దుయ్యబట్టారు.

## ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



**ప్రజా పక్షం/వేములపల్లి:** మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ వైద్య అధికారి డాక్టర్ దీపతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని ఔట్ పేషంట్స్ వివరాలు తెలుసుకుని ల్యాబ్, ఫార్మసీలను తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్‌సిడి యంసి యచ్, టీబి వివరాలపై సమగ్ర విచారణ నిర్వహించి రికార్డులు తనిఖీ చేశారు.యన్‌సి డి స్క్రీనింగ్ తక్కువగా ఉన్నదని త్వరగా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## అడ్మిషన్ల పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మైనారిటీ ప్రజలు తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం అందుబాటులో ఉన్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలను మైనారిటీ విద్యార్థులు ఉపయోగించుకొని తమ భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలని కోరారు. ఫిబ్రవరి 28లోపు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఐదో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌తో పాటు 6, 7, 8 తరగతుల్లో ఖాళీలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మొత్తం 4 గురుకులాల్లో 2 బాలురకు, 2 బాలికల కోసం ఉన్నాయని, వీటిలో 75 శాతం సీట్లు మైనార్టీలకు, 25 శాతం సీట్లు మైనార్టీయేతర విద్యార్థులకు రిజర్వు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి టి నర్సింహులు,ఆర్‌సిఓ శ్రీకాంత్,సంబంధితశాఖలఅధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పనులు సంతృప్తికరం



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల పరిధిలోని వెల్లంకి గ్రామాన్ని సందర్శించిన ఆదిత్య ప్రకాష్ అడిషనల్ సెక్రటరీ, పంచాయతీ రాజ్ బీహార్ రాష్ట్రం వారు, గ్రామ పంచాయతీ కార్యాలయం, రైతువేదిక, స్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనం, నర్సరీ తదితర పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పనులు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జాన్ వెస్లీ డిప్యూటీ కమీషనర్ పంచాయతీ రాజ్, విష్ణువర్ధన్ రెడ్డి జిల్లా పంచాయతీ అధికారి, సురేష్ అడిషనల్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, రావుఫ్ అలీ మండల పంచాయతీ అధికారి, ఇడెం రాధ సర్పంచ్, సందీప్ రెడ్డి (ఏఈపిఆర్), వెంకన్న (ఏపిఓ), ప్రవీణ్ (ఈసి), మోహన్ పంచాయతీ కార్యదర్శి, సుచరిత (టిఏ), వార్డ్ మెంబర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు రూ.43 కోట్ల 81 లక్షలు అందజేత




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో భువనగిరి నియోజకవర్గంలో స్త్రీ నిధి ద్వారా మహిళా సంఘాలకు 43 కోట్ల 81 లక్షలు అందజేశామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు సుమారు మూడు కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి ఉచిత బస్సు, ఉచిత కరెంట్ అందజేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, ఆర్డీవో కృష్ణ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జాంగిర్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్‌లను ఎఎస్‌ఒ తనిఖీ

**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు పట్టణంలోని చంద్రేశ్వర ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆలేరు ఏఎస్‌వో సురేష్ రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఫిల్లింగ్ స్టేషన్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించారు. పెట్రోల్ బంక్‌లో ఉన్న పెట్రోల్, డీజిల్ శాంపిల్స్‌ను సేకరించి ఎఫ్ఎస్ఎల్‌కు పంపిస్తామని తెలిపారు. అనంతరం బంక్‌లో మూత్ర శాలలు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయా లేదా వాహనాలకు గాలి పెట్టే యంత్రాలు అందుబాటులో ఉంచాలని, అందుకు సంబంధించి వ్యక్తిని పురమాయించాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. అంతేకాకుండా పెట్రోల్ డీజిల్‌లో నాణ్యతను పరిశీలించారు. అనంతరం స్టాక్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పెట్రోల్ బంకులను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. పెట్రోల్ బంకులలో కొన్ని పొరపాట్లను గుర్తించిన విషయాలపై సంబంధిత యజమానులకు సూచించినట్లు, భవిష్యత్తులో ఎటువంటి పొరపాట్లు చెసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలలో ఆర్ఐలు (సివిల్ సప్లై) విజయసింహ రెడ్డి, నరసింహ రెడ్డి పాల్గొన్నారు.

## జమ్ములు మృతి బాధాకరం



**ప్రజాపక్షం/డిండి :** సిపిఐ ఖానాపూరం గ్రామశాఖ సహాయ కార్యదర్శి కామ్రేడ్ తాటికొండ జమ్ములు మృతి బాధాకరం అని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డిలు అన్నారు. మంగళవారం ఖానాపూర్ గ్రామంలో జమ్ములు పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, సిపిఐ జిల్లా నాయకులు బొడ్డుపల్లి వెంకటరమణ, మైనోద్దీన్, విజేందర్‌రెడ్డి, సర్పంచ్ ప్రతిమతో పాటు సిపిఐ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలు అరికట్టేందుకు.. చదువే మార్గం

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బాలిక విద్యను ప్రోత్సహించడమే బాల్యవివాహాలను అరికట్టేందుకు పరిష్కారమని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ ప్రాంగణంలో ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ శాఖ సహకారంతో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో జాగ్రత్త పేరుతో రూపొందించిన బాల్య వివాహాల విముక్తి ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు.దేశంలో ఆదర్శ భావాలు, అభివృద్ధి చెందుతున్న సమయంలో బాల్యవివాహాలలాంటి సామాజిక రుగ్మతలు ఉండరాదని కలెక్టర్ అన్నారు.బాల్యవివాహాలు జరగకుండా ఉండాలంటే చదువు ఒకటే మార్గమని, విద్య పట్ల పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, తల్లిదండ్రులలో మార్పు రావాలన్నారు. బాల్యవివాహల నిర్మూలనకు రూపొందించిన ప్రచార రథం జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, మండలాల్లో తిరుగుతూ పాటలు, నినాదాలు, పోస్టర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తుందని, ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, సీడీపీవో హరిత, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫన్స్ కౌన్సిల్ నిమ్మల భీమార్జున్ రెడ్డి, ఆశ్రిత స్వచ్ఛంధ సంస్థ డైరెక్టర్ నాగరాజు, గణేష్, చింతకృష్ణ, నాగరాజా, జిల్లా కోఆర్డినేటర్ శోభారాణి పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత పోలీసులదే కాదు.. ప్రతి పౌరుడి బాధ్యత



జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ :** రోడ్డు భద్రత అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ అన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తే తాము సురక్షితంగా ఉండటమే కాకుండా, ఇతరుల ప్రాణాలను కూడా కాపాడిన వారవుతామని అన్నారు. పోలీసులు శిక్షించడానికి కాదు, ప్రజల ప్రాణాలను కాపాడేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించడమే లక్ష్యంగా నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు,యువత, ఆటో డ్రైవర్లు, ఆర్‌టిసి బస్ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహనా సదస్సుకు ఎస్‌పి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా అనేక మంది రోడ్డు ప్రమాదాల్లో గాయపడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా పరిధిలో గత సంవత్సరం నమోదైన గణాంకాల ప్రకారం జిల్లాలో సుమారు 900 నుంచి 950 వరకు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, అందులో దాదాపు 360 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ మరణాల్లో సుమారు 90 శాతం మంది ద్విచక్ర వాహనదారులే కాగా, వారిలో హెల్మెట్ ధరించకపోవడమే ప్రధాన కారణమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రమేష్, ఎస్‌బి డిఎస్‌పి మల్లారెడ్డి, నల్లగొండ డిఎస్‌పి శివారెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు, వన టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి,ఎస్‌బి సీఐ రాము, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య,టూ టౌన్ ఎస్ఐ సైదులు,రూరల్ ఎస్ఐ సైదాబాబు,ఆర్‌టిసి డియం డీటీఆర్‌బీ రిటైర్డ్ సీఐ అంజయ్య తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది,ఆటో డ్రైవర్లు, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

# కేసులు పెండింగ్ లేకుండా వేగవంతమైన దర్యాప్తు

నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** పోలీసు అధికారుల నెలవారి సమీక్షా సమావేశం మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పి కె.నరసింహ నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెలలో జరిగిన నేరాల స్థితిగతులను సమీక్షించారు. అనంతరం కేసు దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. నేర నిరూపణలో సిబ్బంది సాంకేతిక సామర్థ్యం కలిగి ఉండాలని, ఫిర్యాదులపై త్వరగా స్పందించి సంఘటనా స్థలానికి త్వరగా చేరుకోవాలన్నారు. రాత్రిళ్ళు పెట్రోలింగ్ పటిష్టంగా ఉండాలని, కేసులు పెండింగ్‌లో లేకుండా వేగంగా దర్యాప్తు చేయాలని సూచించారు. కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా పని చేయాలని తెలిపారు. ఫోక్సో కేసుల్లో, మహిళా సంబంధిత కేసుల్లో వేగంగా ధర్యాప్తు చేసి కోర్టులతో సమన్వయంగా పనిచేసి నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయాలన్నారు. పోలీసు పని విభాగాల్లో సమర్థవంతంగా సేవలు అందించినప్పుడే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల నివారణలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఎక్కువ మొత్తంలో సిసి టివి కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలను, వ్యాపారులను ప్రోత్సహించాలని తెలిపారు. రోడ్డు భద్రత పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడానికి అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ముందుకెళ్ళాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అడ్మిన్ అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ హరిబాబు, ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వరరావు, రాజశేఖర్, వెంకటయ్య, ఎస్ఐలు, ఐటి కోర్, డిసిఆర్‌బి సిబ్బంది ఉన్నారు.

# పత్రికలు ప్రజలను చైతన్యం చేయాలి



**ప్రజాపక్షం/చింతపల్లి :** ప్రభుత్వ విధానాలపైన, సామాజిక సమస్యలపైన పత్రికలు ప్రజలకు అవగహనపరిచి చైతన్య పరచాలని మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ప్రజాపక్షం జాతీయ దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను అలివేలు సంజీవరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాన్ని, సంస్కృతిని పరిరక్షించడానికి పత్రికలు తోడ్పడుతున్నాయన్నారు. ప్రజలకి ప్రభుత్వాలకు మధ్య పత్రికలు వారధిగా పని చేయాలన్నారు. ప్రజల గొంతుకగా ప్రజాపక్షం పత్రిక పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఘుడియగౌరారం సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేంద్రరావు, ఎం.మల్లేపల్లి సర్పంచ్ ముద్దం మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పుల డావలయ్య, వింజమూరు గ్రామ మాజీ సర్పంచ్ దండేటికర్ లలితాభాయ్ మోహన్, ప్రజాపక్షం చింతపల్లి మండల రిపోర్టర్ ఆరెకంటి రాధాకృష్ణ, ఆరెకంటి మైసయ్య, గజ్జ యాదయ్య, ఇరిగి శేఖర్, ఏర్పుల జంగయ్య, కోటిరెడ్డి, ఆరెకంటి జగన్, ఏర్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సిఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 65 మంది లబ్ధిదారులకు రూ.25లక్షల 39వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు రఘువీరా రెడ్డి, ఎంఎల్‌సి శంకర్ నాయక్‌ల సహకారంతో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న పేదలకు ప్రభుత్వం తరపు నుండి నిధులు మంజూరి చేయించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలీ, చివ్వెంల మండల అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్, శ్రీదండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ బైరు శైలేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి సహజ పద్ధతుల్లో పంటలు పండించాలి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రసాయన రహిత వ్యవసాయం పురుగుమందులు, రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి సహజ పద్ధతుల్లో పంటలు పండించాలని జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి అన్నారు. జాతీయ సహజ వ్యవసాయ మిషన్ పథకంలో భాగంగా డిఆర్‌పి/కృషి సఖిలకు 5 రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం భువనగిరిలోని వివేర హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సహజ వ్యవసాయ మిషన్ అనేది రసాయన రహిత పర్యావరణ అనుకూల సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఒక పథకం అని అన్నారు. ఈ పథకం ఉద్దేశం రైతుల సాగు ఖర్చును తగ్గించి, ఆదాయాన్ని పెంచడం, నేల సారాన్ని మెరుగుపరచడం జరుగుతుందన్నారు. ఈ పథకం సాంప్రదాయ వ్యవసాయ జ్ఞానం ఆధారంగా, సింథటిక్ రసాయనాలు, ఎరువులు లేకుండా ఆహార ఉత్పత్తులను ఉత్పత్తి చేయడాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బి.వెంకటేశ్వరరావు, వి.శాంతి నిర్మల, ఎస్.శ్రీనివాస్, మిత్ర ఫౌండేషన్(ఎన్‌జిఓ) ప్రెసిడెంట్ రామచంద్రయ్యా, ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ సందీప్, తెలంగాణ టి హబ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ కె.ఇందిరా రెడ్డి, రాజేష్, వ్యవసాయ అధికారి, సాంకేతిక విభాగం రావుల ప్రశాంతి పాల్గొన్నారు.



## కల్యాణ మహోత్సవ కరపత్రిక ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హాలియా:** హాలియాలోని శ్రీ పార్వతి సమేత జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం వార్షికోత్సవ కల్యాణ ఆహ్వాన పత్రికను సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం హాలియాలోని పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి మాట్లాడుతూ లోక కళ్యాణ కోసం నిర్మించిన శివాలయంలో నిర్వహించనున్న వార్షికోత్సవ ఉత్సవాలు, 25, 26 నిర్వహించనున్న పార్వతీ సమేత జడల రామలింగేశ్వర కళ్యాణ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, దేవస్థాన కమిటీ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, ఎడవల్లి నరేందర్ రెడ్డి, హాలియా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, పొదిలి కృష్ణ, పిల్లి ఆంజనేయులు, పుట్ట శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు, కర్ణ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార గొంతుక ప్రజాపక్షం



**ప్రజాపక్షం/డిండి :** ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కార గొంతుకగా ప్రజాపక్షం దినపత్రిక నిలుస్తుందని బిఆర్‌ఎస్ సినియర్ నాయకులు, తవక్లాపూర్ గ్రామ సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య అన్నారు. మంగళవారం తవక్లాపూర్ గ్రామంలో ప్రజాపక్షం తెలుగు జాతీయ దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను సర్పంచ్ కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న ప్రజాపక్షం అత్యంత ప్రజాధరణ పొంది ప్రజల మన్ననలు పొందుతూ తనదైన స్థానాన్ని సంపాదించుకొని ప్రజల చైతన్యం కోసం ప్రజాపక్షం నిబద్ధతతో కూడిన వార్తలను ప్రచురితం చేస్తూ విలువలతో కూడిన జర్నలిజానికి నిలువుటద్దంగా ప్రజాపక్షం వెలువడుతుందని అన్నారు. ఏడేళ్ల ప్రస్థానంలో ప్రజల్లో అత్యంత ప్రజాధరణ పొందిన ప్రజాపక్షం దినపత్రిక యజమాన్యానికి, విలేకరులకు పొన్నగంటి కృష్ణయ్య నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నల్లవెల్లి సీతారంరెడ్డి, బిఆర్‌ఎస్ గ్రామశాఖ యువజన ప్రధాన కార్యదర్శి మద్దెల వెంకటేష్, వార్డు సభ్యులు సంపంగి శ్రీను, మురళి, అలందర్, ప్రశాంత్ ఉన్నారు.

## రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట




**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు అన్నారు. ఏడీఏ సైదానాయక్ అధ్యక్షతన రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ యాంత్రీకరణ పథకం పరికరాలను రైతులకు పంపిణి చేసిన అనంతరం వారు మాట్లాడారు. సబ్సిడితో పొందిన యంత్రాలతో రైతులు నూతన పద్ధతులు అవలంభించి అధిక దిగుబడి సాధించాలని ఆకాంక్షించారు. దివంగత మాజీ సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 12 సంవత్సరాల క్రితం రైతుల సమగ్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. అదే తరహాలో సీఎం రేవంత్‌రెడ్డి అన్నదాతల సంక్షేమానికి అహర్నిషలు కృషి చేస్తున్నారని అన్నారు. ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నల్లగొండ జిల్లాలో రూ.2400 కోట్ల రైతు రుణమాఫీ జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏవోలు కిశోర్‌నాయక్, సరిత, శివరాం, ఏఈవోలు షఫి, రమేష్, ఆఫ్రీన్, శిరీష, ప్రియాంక, పార్వతి, నాయకులు, ముదిరెడ్డి నర్సిరెడ్డి, రవితేజ, సూర్యనాయక్, నర్సిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ‘విబి–జి రామ్ జి’ని రద్దుచేయాలి

### కేంద్ర సర్కార్‌కు తమిళనాడు ప్రభుత్వం విజ్ఞప్తి



**చెన్నై :** ఇటీవల పార్లమెంట్ ఆమోదించిన ‘విబి–జి రామ్ జి’ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, యుపిఎ కాలం నాటి గ్రామీణ ఉపాధి పథకం ‘ఎంజి నరేగా’ను పునరుద్ధరించాలని తమిళనాడు ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. తద్వారా రాష్ట్ర ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి నేరగా) నిలిపివేయడం గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి ఆటంకం కలిగించడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని కూడా పెంచిందని పేర్కొంది. ‘విక్షిత్ భారత్‌రోజ్‌గార్, అజీవిక మిషన్ (గ్రామీణ్) ‘విబి– జి రామ్ జి’ హామీ కారణంగా తమిళనాడుపై ఆర్థిక భారం సంవత్సరానికి సుమారు రూ. 5,000 కోట్లు పెరుగుతుందని తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ ఎం. అప్పావు గవర్నర్ ప్రసంగాన్ని అసెంబ్లీలో చదువుతూ అన్నారు. అయితే డిఎంకె ప్రభుత్వం తయారుచేసిన పాఠ్యాంశంలో ‘తప్పులు’ ఉన్నాయని పేర్కొంటూ గవర్నర్ ఈ సంవత్సరం తొలి సమావేశంలో రాష్ట్ర అసెంబ్లీ నుండి తన సాధారణ ప్రసంగం చేయకుండానే వాకౌట్ చేశారు. గవర్నర్ ప్రసంగం తమిళ వెర్షన్‌ను చదివిన అప్పావు, కొత్త పథకం ‘విబి– జి రామ్ జి’ గ్రామీణ ప్రాంతాల్లోని కోట్లాది మంది పేదలు, వెనుకబడిన వర్గాలకు, ముఖ్యంగా మహిళలు, ఆది ద్రావిడర్ వర్గాలకు వేతన ఉపాధిని నిర్ధారించడానికి రూపొందించిన ఎంజి నరేగా ప్రాథమిక లక్ష్యాన్ని దెబ్బతీసిందన్నారు. గ్రామీణ పేదలకు సామాజిక భద్రతను అందించే నరేగా ద్వారా, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సహజ వనరుల పరిరక్షణ, పచ్చదనం, వాటర్‌షెడ్ నిర్వహణ వంటి అనేక ప్రాజెక్టులు గ్రామీణ ప్రాంతాల్లో విజయవంతంగా అమలు అయినట్లు తాను గమనించానన్నారు. ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసినందుకు తమిళనాడు నిరంతరం అనేక జాతీయ అవార్డులను అందుకుంది. ‘వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్ర వాటా పెరిగినందున రాష్ట్ర ప్రభుత్వం తన సొంత పథకాలను అమలు చేయడంలో గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటుందని పరిగణనలోకి తీసుకుంటే, ఈ కొత్త పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని కేంద్రం ప్రతికూల ఉద్దేశ్యంలో భాగంగా పరిగణించాలి’ అని ఆయన అన్నారు. కొత్త పథకాన్ని ఉపసంహరించుకోవాలని, కేంద్ర ప్రభుత్వం నరేగాకు అదనపు ఆర్థిక వనరులను పునరుద్ధరించి కేటాయించాలని ఆయన అన్నారు. భాషా విధానాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడు రాష్ట్ర విద్యా విధానం 1968 నుండి కొనసాగించబడిన తమిళం, ఆంగ్లం అనే ద్విభాషా సూత్రాన్ని అనుసరిస్తుందని పునరుద్ఘాటించారు. ‘మాజీ ముఖ్యమంత్రి సి ఎన్ అన్నాదురై రూపొందించిన ద్విభాషా విద్యా విధానాన్ని మేము మా స్వంత కళ్ళలాగా కాపాడుకుంటున్నాము. మన జీవితం, భావోద్వేగాల నుండి విడదీయరాని తమిళ భాషను రక్షించే విషయానికి వస్తే, రాజీకి అవకాశం లేదు’ అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి ఎం కె స్టాలిన్ నాయకత్వంలో, ఈ విధానంలో ఎటువంటి మార్పును ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని ప్రభుత్వం పేర్కొంది.

## ఉపాధి హామీ పథకం రద్దు చేయాలనుకుంటున్న మోదీ

# ఈ చర్య ప్రజాస్వామ్య మూలాలపై దాడి

### రాయ్‌బరేలీలో రాహుల్‌గాంధీ విమర్శ




**రాయ్‌బరేలీ:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) పథకాన్ని రద్దు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరుకుంటున్నారని కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నాయకత్వానగల ప్రభుత్వం ఎంజిఎన్‌ఆర్ ఇజిఎ స్థానంలో మరో మరో చట్టం తెచ్చి మహాత్మా గాంధీని అవమానించిందని, ఈ పథకానికి విలువ లేకుండా చేస్తోందని విమర్శించారు. ఈ చర్య ప్రజాస్వామ్య మూలాలపై దాడిగా ఆయన పేర్కొన్నారు. కొత్తగా తెచ్చిన చట్టం కింద బిజెపి పాలిత రాష్ట్రాలు ఈ పథకానికి తమ వంతు వాటా కేటాయించడంలేదని విమర్శించారు.

రాయ్‌బరేలీ పార్లమెంటరీ నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా మంగళవారం కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి రాహుల్‌గాంధీ ప్రసంగిస్తూ, అధికార కేంద్రీకరణ వాంఛ, పేదలకు రక్షణగా ఉన్న సంక్షేమ పథకాలను బలహీన పరచాలన్న వాంఛతో ఉన్న మోదీ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేయాలనుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరీ ముఖ్యంగా సమాజంలో అణగారిన వర్గాల ప్రజలకు భద్రత చేకూర్చే పథకాన్ని ఉపసంహరించుకోవడం మహాత్మాగాంధీకి అవమానకరమన్నారు. బిజెపి ప్రభుత్వం 2025 డిసెంబరు 18వ తేదీన పార్లమెంటులో విబి–జి రామ్ జి (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్) బిల్లుకు ఆమోద ముద్ర వేసింది. యుపిఎ ప్రభుత్వ హయాంలో తెచ్చిన ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ స్థానంలో ఈ బిల్లును చట్టరూపంలో తెస్తారు. యుపిఎ హయాంలో 20 సంవత్సరాల క్రితం తెచ్చిన ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ చట్టం కింద గ్రామీణ పేద కార్మికులకు ప్రతి సంవత్సరం 125 రోజులు ఉపాధి హామీని ఇప్పటివరకూ అమలు చేశారు. ఈ పథకంలో మహాత్మాగాంధీ పేరు తొలగించి ‘విబి–జి రామ్ జి’ అనే పొడి అక్షరాలతో చట్టం చేయడాన్ని దేశంలోని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ‘ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ’ పథకాన్ని రద్దుచేయడాన్ని వ్యతిరేకిస్తూ, కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పెద్ద నిరసన ఉద్యమాన్ని కొనసాగిస్తోంది. జనవరి 10వ తేదీన ఈ ప్రచార ఉద్యమాన్ని కాంగ్రెస్ ప్రారంభించింది. ఫిబ్రవరి 25వ తేదీ వరకూ ఈ ప్రచార ఉద్యమం కొనసాగుతుంది.

**మా పార్టీ కార్మికపక్షాన నిలబడి పోరాటం** చేస్తోంది, కార్మికుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉంది’’ అని రాహుల్‌గాంధీ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఉద్ఘాటించారు. గౌతం అదానీ, ముకేష్ అంబానీ వంటి పారిశ్రామికవేత్తల చేతుల్లోకి దేశ సంపదను కేంద్రీకరించాలని ప్రధానమంత్రి మోదీ కోరుకుంటున్నారని విమర్శించారు. ‘‘మేం ఒక చేత్తో దేశ ప్రజలను రక్షిస్తూ ఉంటే, మోదీ మరో చేత్తో దేశ సంపదను ఎంపిక చేసిన కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించాలని కోరుకుంటున్నారు’’ అన్నారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన రోజువారీ వేతనాలకంటే తక్కువ వేతనాలకు ఈ దేశంలో ఏ ఒక్క కార్మికుడూ బలవంతంగా పని చేయకూడదనే లక్ష్యంతోనే యుపిఎ ప్రభుత్వం ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పథకాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. ఈ పథకాన్ని ఢిల్లీలో, లక్నోలో కూర్చున్న అధికారులు ఈ పథకాన్ని నడిపించాలనే ఉద్దేశంతో యుపిఎ ప్రభుత్వం ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ చట్టాన్ని తీసుకురాలేదని, ఈ పథకాన్ని గ్రామీణస్థాయిలో పంచాయతీరాజ్ ప్రభుత్వాలు అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ పథకం తీసుకువచ్చామని చెప్పారు. తద్వారా గ్రామ పంచాయతీ పెద్ద ఈ పథకానికి బాధ్యుడుగా వ్యవహరిస్తారన్నారు. ఈ పథకాన్ని సంబంధించిన ఆర్థిక వ్యవహారాలన్నీ గ్రామ పంచాయతీల ద్వారానే జరగాల్సి ఉందన్నారు. యుపిఎ ప్రభుత్వం తెచ్చిన ఈ ఉపాధి పథకం కార్మికులకు ప్రయోజనం లేదని కొద్ది సంవత్సరాల క్రితం మోదీ పార్లమెంటులో చెప్పారని, ఈ పథకాన్ని రద్దుచేసే ప్రయత్నం చేశారన్నారు. ఇప్పుడు ఈ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా రద్దుచేయాలని మోదీ కోరుకుంటున్నారని విమర్శించారు. విబి–జి రామ్ జి కొత్త చట్టం కింద రాష్ట్రాల ప్రభుత్వాలు 40 శాతం నిధులను కేటాయించవలసి ఉందని, గతంలో ఇలాంటి పరిస్థితి లేదని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలు ఈ పథకం కింద ఇవ్వాల్సిన వాటాను ఇప్పుడు ఇవ్వడంలేదని విమర్శించారు. కాగా, అంతకుముందు రాహుల్ గాంధీ రాయ్‌బరేలిలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. తన పార్లమెంటరీ నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటనలో ఉన్న కాంగ్రెస్ నాయకుడు పార్టీ ఆఫీస్ బేరర్లు, కార్యకర్తలను కూడా కలిశారు.

**రాయ్‌బరేలిలో క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయండి**

ఇదిలా ఉండగా, బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాతో మాట్లాడి రాయ్‌బరేలిలో క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయాలని అభ్యర్థించారని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మనీష్ చౌహాన్ తెలిపారు. రాయ్‌బరేలిలో ఒక క్రీడా కార్యక్రమానికి హాజరైన రాహుల్‌గాంధీ వేదికపై నుండి క్రీడా మైదానం పరిస్థితిని గమనించి, చౌహాన్, సునీల్ సింగ్ భదోరియా, వికాస్ సింగ్‌లతో కూడిన నిర్వాహక కమిటీ సభ్యుల నుండి స్థానిక క్రీడా సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారని చౌహాన్ తెలిపారు. ఆ ప్రాంతంలో సరైన క్రీడా మైదానం లేదని, ఇది ఆటగాళ్లకు గణనీయమైన సవాళ్లను కలిగిస్తుందని వారు అతనికి తెలియజేశారు. ఈ చర్చ తర్వాత, గాంధీ వేదికపై నుండి నేరుగా శుక్లాతో మాట్లాడి, ఆ ప్రాంతంలో క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయాలని అధికారికంగా అభ్యర్థించారని చౌహాన్ చెప్పారు

## ‘సర్’..

# సాఫ్ట్‌వేర్ ఇంటెన్సివ్ రిగ్గింగ్

### తృణమూల్ కాంగ్రెస్ ఆరోపణలు

### ఎన్నికల జాబితా సమీక్ష కోసం ప్రక్రియలో మరింత పారదర్శకత :డేరెక్ ఓబ్రెయిన్ డిమాండ్



**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) కొనసాగుతోంది. అయితే ఈ ‘సర్’ ప్రక్రియను ‘సాఫ్ట్‌వేర్ ఇంటెన్సివ్ రిగ్గింగ్’గా తృణమూల్ కాంగ్రెస్ అభివర్ణించింది. ఎన్నికల జాబితా సమీక్ష కోసం కొనసాగుతున్న ప్రక్రియలో మరింత పారదర్శకత అవసరమని రాష్ట్రంలోని అధికారక పార్టీ పేర్కొంది. మంగళవారం ఢిల్లీలో టిఎంసి రాజ్యసభ పక్షనేత డేరెక్ ఓ బ్రెయిన్, ఉపనేత సాగరికా ఘోష్, ఎంపి సాకేత్ గోఖలే విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పార్టీ ప్రతినిధి బృందం, పోల్ ప్యానెల్ పూర్తి బెంచ్ మధ్య జరిగిన సమావేశాలలో జరిగిన చర్చల ట్రాన్స్‌క్రిప్ట్‌లను ఎన్నికల సంఘం (ఇసి) విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ‘సర్’ వాస్తవానికి దేనిని సూచిస్తుందని ప్రశ్నిస్తూ.. ఇది ‘సాఫ్ట్‌వేర్ ఇంటెన్సివ్ రిగ్గింగ్’గా మారిందని మండిపడ్డారు. మన దేశంలోని గొప్ప సంస్థలలో ఇసి ఒకటని, ఇది చాలా దశాబ్దాలుగా ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ వచ్చిందని, కానీ ఇప్పుడు ఈ గొప్ప సంస్థను కూల్చివేస్తున్నారని ఓ బ్రెయిన్ విలేకరుల సమావేశంలో అన్నారు. గత సంవత్సరం నవంబర్ 28–డిసెంబర్ 31 తేదీలలో ఇసితో జరిగిన సమావేశాలలో టిఎంసి నాయకులు ‘సర్’ ప్రక్రియను సులభతరం చేయడానికి అనేక నిర్మాణాత్మక సూచనలు చేశారని ఓ బ్రియిన్ అన్నారు. సమావేశాల ట్రాన్స్‌క్రిప్ట్‌లను బయట పెట్టాలని పోల్ ప్యానల్‌ను డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు పోల్ ప్యానెల్‌ను పారదర్శకతతో పనిచేయాలని ఆదేశించిందని, ఎన్నికల కమిషన్ రాజకీయ ప్రయోజనాలతో పనిచేయకూడదని ఘోస్ ఎత్తి చూపారు. పౌరుడి ఓటు హక్కును కాపాడటం ఇసి రాజ్యాంగ విధి అని ఆమె అన్నారు. ఇసి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను సాఫ్ట్‌వేర్ ఇంటెన్సివ్ రివిజన్‌గా మార్చకూడదని సూచిస్తున్నామని, సుప్రీంకోర్టు సూచించినట్లుగా ఇసి పారదర్శకతతో పనిచేయాలన్నారు.

## ఆఫీసులో రాసలీలలు..

# డిజిపి స్థాయి అధికారి సస్పెన్షన్

**న్యూఢిల్లీ:** కర్ణాటక ప్రభుత్వం డిజిపి (సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్మెంట్)గా సేవలందిస్తున్న కె.రామచంద్ర రావును చివరికి సస్పెండ్ చేసింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న కొన్ని వీడియోల్లో రామచంద్ర రావు మహిళలతో అనుచితంగా ప్రవర్తిస్తున్నట్టు ఉండటంతో ఈ మేరకు చర్యలు చేపట్టింది. మంగళవారం ఈ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. రామచంద్ర రావు ప్రభుత్వ ఉద్యోగిగా నిబంధనలు ఉల్లంఘించారని ప్రభుత్వం జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇది ప్రభుత్వానికీ ఇబ్బందిగా మారిందని.. ఈ క్రమంలోనే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. సస్పెన్షన్ సమయంలో ప్రభుత్వ అనుమతి లేకుండా రామచంద్ర రావు హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లకూడదని కూడా ఆదేశించింది.

## కశ్మీర్‌లో శాంతి పునరుద్ధరణే

# పిడిపి ఏకైక ఎజెండా : ముఫ్తీ

**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లో చర్చల ద్వారా శాంతి, శ్రేయస్సును పునరుద్ధరించడం, ఇక్కడి ప్రాంతాలను ఐక్యంగా ఉంచి అభివృద్ధి పర్చాలనేదే తమ తమ పార్టీ ఏకైక ఎజెండా అని పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ పేర్కొన్నారు. పీర్ పంజాల్, చీనాబ్ లోయకు డివిజన్ హోదా కల్పించాలనే ప్రతిపాదనను డిక్సన్ ప్రణాళికతో అనుసంధానించినందుకు నేషనల్ కాన్ఫరెన్స్, బిజెపిలను మాజీ ముఖ్యమంత్రి విమర్శించారు. ఈ డిమాండ్ పూర్తిగా పరిపాలనాపరమైనదని, నిర్లక్ష్యం చేసిన ప్రాంతాల సమతుల్య అభివృద్ధి, మెరుగైన పాలనను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. ‘పిడిపికి ఒకే ఒక ఎజెండా ఉంది: జమ్ముకశ్మీర్‌లో గౌరవప్రదమైన శాంతి పునరుద్ధరణ’ అని మంగళవారం ఆమె విలేకరులతో సమావేశంలో అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా పిర్ పంజాల్ (రాజౌరి, పూంచ్), చీనాబ్ లోయ (రాంబన్, దోడా, కిష్టావర్)లకు డివిజనల్ హోదా మంజూరు చేయాలనే తన ప్రతిపాదనను డిక్సన్ ప్రణాళికతో అనుసంధానించడంపై, ముఫ్తీ తనను గౌరవిస్తానని, జమ్ముకశ్మీర్‌లో ఆయనను ప్రముఖ నాయకుడిగా భావిస్తానని చెప్పారు, కానీ ‘తన తండ్రి షేక్ మొహమ్మద్ అబ్దుల్లాను అదే ఫార్ములా కోసం అరెస్టు చేసిన విషయాన్ని అతను మర్చిపోయినట్లు తాను భావిస్తున్నానన్నారు. ‘ఇది నేషనల్ కాన్ఫరెన్స్, దాని వ్యవస్థాపకుడి ఎజెండా కావచ్చు, దీని కోసం ఆయనను తొలగించి జైలులో పెట్టారు. ఇది మా పార్టీ ఎజెండా ఎప్పటికీ కాదు’ అని ఆమె అన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై పిసి యాక్ట్ కింద

# చార్జిషీట్లు సమ్మతమే

### ‘సుప్రీం’ తీర్పు

### రాజస్థాన్ హైకోర్ట్ ఉత్తర్వులను సమర్థించిన ‘అపెక్స్ కోర్టు’




**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై లంచం, అవినీతి నేరాలకు సంబంధించి రాష్ట్ర పోలీస్ అధికారులు అవినీతి నిరోధక (పిసి) చట్టం కింద దరాప్తు చేసి అభియోగపత్రం (చార్జిషీట్) దాఖలు చేయవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిపై రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేయడానికి ముందు సిబిఐ ముందస్తు అనుమతి అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టీకరించింది. జస్టిస్ జె.బి.పార్థివాలా, జస్టిస్ సతీష్ చంద్రశర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం మాట్లాడుతూ పిసి చట్టం కింద జరిగే నేరాలను రాష్ట్ర సంస్థ లేదా కేంద్ర సంస్థ లేదా ఏదైనా పోలీస్ సంస్థ దర్యాప్తు చేయవచ్చని, చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం పోలీస్ అధికారి ఒక నిర్దిష్ట హోదాను కలిగి ఉండాలనే అర్హత ఉందని పేర్కొంది. సెక్షన్ 17 కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై లంచం, అవినీతి, దుష్ప్రవర్తనకు సంబంధించిన నేరం నమోదు చేయకుండా లేదా దర్యాప్తు కేసు నుండి రాష్ట్ర పోలీసులను లేదా రాష్ట్రంలోని ప్రత్యేక సంస్థను మినహాయించడం లేదా నిరోధించదని వివరించింది. ‘సౌలభ్యం కోసం పనిలో నకిలీని నివారించడానికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు దాని సంస్థలపై అవినీతి, లంచం కేసుల దర్యాప్తు బాధ్యతను ప్రత్యేక పోలీస్ సంస్థ అయిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ)కు అప్పగించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు దాని సంస్థలపై అవినీతి, లంచం కేసుల దర్యాప్తు బాధ్యతను రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు సంస్థ అయిన యాంటీ కరప్షన్ బ్యూరో (ఎసిబి)కి అప్పగించారు’ అని ధర్మాసనం చెప్పింది. పిసి చట్టం కింద నేరాల కూడా శిక్షార్హమైనవి. అందువల్ల రాష్ట్ర పోలీస్ అధికారులు దర్యాప్తు చేయవచ్చని ధర్మాసనం జోడించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిపై ఉన్న అవినీతి కేసును కొట్టివేయడానికి నిరాకరించిన రాజస్థాన్ హైకోర్టు ఉత్తర్వులను సమర్థిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఈ ఉత్తర్వులు జారీ చేసింది.నిందితుడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయినప్పటికీ అవినీతి నిరోధక చట్టంలోని నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసే అధికార పరిధి రాజస్థాన్ ఎసిబికి ఉందని హైకోర్టు తీర్పు ఇచ్చింది.‘హైకోర్టు సరైన అభిప్రాయం తీసుకుంది. కానీ సిబిఐ మాత్రమే ఈ కేసును ప్రాసిక్యూషన్ చేయగలదని చెప్పడం తప్పు’ అని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది.

# బిజెపి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నబీన్



**న్యూఢిల్లీ:** భారతీయ జనతా పార్టీ నూతన సారథిగా నితిన్ నబీన్ మంగళవారం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. న్యూఢిల్లీలోని బిజెపి కేంద్ర కార్యాలయంలో అత్యంత వైభవంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడిగా పగ్గాలు స్వీకరించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మాజీ అధ్యక్షుడు జెపి నడ్డా సహా పలువురు కేంద్ర మంత్రులు, బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం వేద మంత్రోచ్ఛారణల మధ్య బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఇప్పటివరకు అధ్యక్షుడిగా ఉన్న జెపి నడ్డా, నూతన అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. నబీన్‌ను అధ్యక్ష కుర్చీలో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీ నూతన అధ్యక్షుడిని ఆలింగనం చేసుకుని అభినందించారు. పార్టీ అగ్రనేతలంతా వేదికపై నిలిచి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. పార్టీకి సంబంధించిన విషయాలలో యువ నాయకుడు తన బాస్ అని ప్రకటించారు. మంగళవారం ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయంలో జరిగిన సభలో మోదీ ప్రసంగిస్తూ, యువ శక్తి, సంస్థాగతంగా అపారమైన అనుభవం కలిగిన 45 ఏళ్ల నబిన్‌ను ‘మిలీనియల్’గా అభివర్ణించారు. ప్రధాని తన ప్రసంగంలో పదే పదే నబీన్‌ను ‘మననియా’గా ప్రస్తావించారు. గత 11 సంవత్సరాలుగా తన ప్రభుత్వం సాధించిన విజయాలను పేర్కొంటూ, తన పనితీరుని పార్టీ కొత్త అధ్యక్షుడికి వివరిస్తున్నానని చెప్పుకొచ్చారు. ‘ఆయన చెప్పే ప్రతి మాట మనకు కొత్త దిశానిర్దేశం చేస్తుంది. ఆయన మార్గదర్శకత్వం మన భవిష్యత్ కార్యాచరణను నిర్దేశించే అమూల్యమైన ఆస్తిగా ఉంటుంది’ అని ప్రధాని రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, అమిత్ షా, జె పి నడ్డా వంటి సీనియర్ నాయకులతో పాటు కేంద్ర మంత్రులు, బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అనేక మంది పార్టీ కార్యకర్తలు హాజరైన సభలో ప్రసంగించారు. ‘నేను కూడా ఒక పార్టీ కార్యకర్తగా, నా పని గురించి కొత్త అధ్యక్షుడికి వివరిస్తున్నాను. నా పని గురించి ఇప్పుడు ఆయనే రాస్తారు. ఆయన మార్గదర్శకత్వం కోసం ఎదురు చూస్తున్నాను’ అని మోదీ అన్నారు. సంఘతన్ పర్వ్ ముగింపు సందర్భంగా పార్టీ ప్రధాన కార్యాలయంలో నబిన్‌ను బిజెపి జాతీయ అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సమావేశంలో బూత్ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు వివిధ పార్టీ పదవులకు ఎన్నికలు జరిగాయి. ‘పార్టీ విషయాల విషయానికి వస్తే, మనానియా (గౌరవనీయ) నితిన్ నబిన్ జీ... నేను ఒక కార్యకర్తను, మీరే నా బాస్’ అని మోదీ పేర్కొన్నారు. ‘ఇప్పుడు, గౌరవనీయులైన నితిన్ నబిన్ జీ మనందరికీ అధ్యక్షుడు, ఆయన బాధ్యత కేవలం బిజెపిని నిర్వహించడం మాత్రమే కాదు, అన్ని ఎన్‌డిఎ మిత్ర దేశాల మధ్య సమన్వయాన్ని నిర్ధారించడం కూడా’ అని ప్రధానమంత్రి అన్నారు.

## భారత్‌కోసం తూటాలను సైతం

# ఎదుర్కొనేందుకు సిద్ధం

### నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా

**జమ్ము:** తమ పార్టీ భారతదేశం కోసం బుల్లెట్లను ఎదుర్కొందని, అవసరమైతే మళ్ళీ అలా చేయడానికి సిద్ధంగా ఉందని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) అధ్య క్షుడు ఫరూఖ్ అబ్దుల్లా అన్నారు. ఎన్‌సి ఈ ప్రాంతంలో రాళ్ల దాడి, ఉగ్రవాదాన్ని పునరుద్ధరించాలని ప్రయత్నిస్తుందనే బిజెపి వాదనను తోసిపుచ్చారు. జమ్ములో ఎన్‌సి రెండు రోజుల బ్లాక్ అధ్యక్షులు, కార్యదర్శుల సమావేశం సందర్భంగా మంగళవారం ఫరూక్ అబ్దుల్లా విలేకరులతో మాట్లాడారు. జమ్ముకశ్మీర్‌ను కొత్తగా విభజించాలనే డిమాండ్లను మాజీ ముఖ్యమంత్రి తిరస్కరించారు. అలాంటి డిమాండ్లను మూర్ఖత్వం, అవివేకం అని అభివర్ణించారు. 2019లో ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటైన లద్దాఖ్ చివరికి పూర్వ రాష్ట్రంతో తిరిగి కలుస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. జమ్ముకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలో అదనపు జిల్లాల ఏర్పాటును కూడా అబ్దుల్లా తోసిపుచ్చారు. పిర్ పంజాల్, చీనాబ్ లోయలకు ప్రత్యేక విభజనల డిమాండ్‌ను ఆయన విమర్శించారు. ఇది భారతదేశం, పాకిస్తాన్ మధ్య జమ్ముకశ్మీర్ వివాదాన్ని పరిష్కరించే లక్ష్యంతో 1950 సెప్టెంబర్‌లో యుఎన్ ప్రతినిధి, ఆస్ట్రేలియా మాజీ ప్రధాన న్యాయమూర్తి సర్ ఓవెన్ డిక్సన్ చేసిన ప్రతిపాదన ‘డిక్సన్ ప్లాన్’లో భాగంగా అభివర్ణించారు. ఎన్‌సి, పిడిపి అశాంతిని పెంచుకుంటాయని, ఈ ప్రాంతంలో రాళ్ల దాడి, ఉగ్రవాదాన్ని పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని బిజెపి సీనియర్ నాయకుడు చేసిన వ్యాఖ్యలపై అబ్దుల్లా నవ్వుకున్నారు.

# తమిళనాడులో మళ్లీ గవర్నర్ వర్సెస్ సర్కార్

### అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్



**చెన్నై:** అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన వేళ తమిళనాడులో గవర్నర్ వర్సెస్ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహారం మళ్లీ మొదలైంది. తాజాగా మంగళవారం ఉదయం అసెంబ్లీ సెషన్ ప్రారంభం కాగానే రాజకీయ రగడ రాచుకుంది. శాసన సభను ఉద్దేశించి ప్రసంగించడానికి గవర్నర్ ఆర్‌ఎన్ రవి అసెంబ్లీకి చేరుకున్నారు. తొలుత తమిళనాడు రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం జాతీయ గీతాన్ని ప్లే చేసి, అందరూ ఆలపించాలని అసెంబ్లీ స్పీకర్ ఎం అప్పావుకు గవర్నర్ సూచించారు. అయితే అందుకు స్పీకర్ నిరాకరించారు. సభ సాంప్రదాయల ప్రకారం గవర్నర్ ప్రసంగం ముగిసాక జాతీయగీతాలాపన జరుగుతుందన్నారు. దీంతో అసెంబ్లీలో ప్రసంగించకుండానే గవర్నర్ ఆర్‌ఎన్ రవి వాకౌట్ చేశారు. అలా అసెంబ్లీ ప్రసంగించకుండా గవర్నర్ వాకౌట్ చేయండి ఇది మూడోసారి.

**మైక్‌ను స్విచ్ఛాఫ్ చేశారు, మాట్లాడనివ్వ-లేదు : గవర్నర్ కార్యాలయం**

అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్ చేసిన వెంటనే, సభలో జరిగిన పరిణామాల వివరాలతో తమిళనాడు గవర్నర్ కార్యాలయం లోక్ భవన్ ఓ మీడియా ప్రకటన విడుదల చేసింది. ‘సభలో పదేపదే గవర్నర్ ఆర్‌ఎన్ రవి మైక్‌ను స్విచ్ఛాఫ్ చేశారు. ఆయనను మాట్లాడనివ్వలేదు. దళితులపై దాడులు, దళిత మహిళలపై లైంగిక హింసాకాండ వంటి వ్యవహారాలను గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేర్చలేదు’ అని గవర్నర్ కార్యాలయం విమర్శించింది. రాష్ట్ర ప్రభుత్వం తప్పులతడకగా ఉన్న ప్రసంగాన్ని తయారుచేసి గవర్నర్‌కు ఇచ్చిందని, అందుకే ఆయన ప్రసంగించేందుకు నిరాకరించారని స్పష్టం చేసింది. తమిళనాడుకు రూ.12 లక్షల కోట్లు విలువైన పెట్టుబడులు వచ్చాయనే అంశాన్ని ప్రసంగంలో రాశారని, అది వాస్తవదూరమైన అంశమని పేర్కొంది. మరోసారి తమిళనాడు అసెంబ్లీలో జాతీయ గీతం అవమానాన్ని ఎ దుర్కోవాల్సి వచ్చిందని లోక్‌భవన్ పేర్కొంది. ప్రా థమిక రాజ్యాంగ విధిని అసెంబ్లీ స్పీకర్ అమ లు చేయలేదని తెలిపింది. ఈ కారణాల వల్లే అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్ చేశారని వెల్లడించింది.

**మేం ఇచ్చిన ప్రసంగాన్నే చదవాలి : సిఎం స్టాలిన్**

రాష్ట్ర అసెంబ్లీ సంస్కృతి, సంప్రదాయాలకు తిలోదకాలిస్తూ గవర్నర్ ఆర్‌ఎన్ రవి వాకౌట్ చేశారని తమిళనాడు సిఎం ఎంకే స్టాలిన్ ఆరోపించారు. అసెంబ్లీ సెషన్ ప్రారంభంలో గవర్నర్ ప్రసంగించాలనే సంప్రదాయానికి తూట్లు పొడిచారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తయారుచేసి ఇచ్చిన ప్రసంగాన్నే గవర్నర్ చదవాల్సి ఉంటుందని, అందులో ఆయన అభిప్రాయాలను చేర్చే అవకాశమే ఉండదని సిఎం స్టాలిన్ తేల్చి చెప్పారు. ప్రసంగంలోకి గవర్నర్ అభిప్రాయాన్ని చేర్చేలా అసెంబ్లీ రూల్స్ ఏవీ లేవన్నారు. ఆర్‌ఎన్ రవి ఉద్దేశపూర్వకంగానే గత కొన్నేళ్లుగా ఇలా చేస్తున్నారని సిఎం ఆరోపించారు. ఈ విధంగా చేయడం రాష్ట్ర అసెంబ్లీని అవమానించడమే అవుతుందన్నారు. అందుకే రాష్ట్రానికి గవర్నర్ అక్కరలేదనే వైఖరికి డిఎంకె కట్టుబడి ఉందని స్టాలిన్ చెప్పారు. గత సిఎంలు అన్నాదురై, కరుణానిధి కూడా ఇదే విధమైన వైఖరితో పనిచేశారన్నారు. తాను కూడా వారి బాటలోనే నడుస్తున్నట్లు పేర్కొన్నారు.

**గవర్నర్ ప్రసంగించినట్టుగానే నమోదు చేయిస్తాం**

‘తమిళనాడు ప్రజల ఓట్లతో ఎన్నికైన మెజారిటీ ప్రభుత్వాన్ని గవర్నర్ గౌరవించి తీరాలి. ఆర్‌ఎన్ రవి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా వేదికల్లో విష ప్రచారం చేస్తున్నారు. అసెంబ్లీలోనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా గవర్నర్ మాట్లాడుతానంటే ఒప్పుకోం. గవర్నర్ వాకౌట్ చేసి వెళ్లిపోయినా ఆయన ప్రసంగం ఇంగ్లిష్ కాపీని అందరు ఎమ్మెల్యేల సిస్టమ్‌లలోకి అప్‌లోడ్ చేశాం. వారంతా దాన్ని చదువుకుంటారు. అందువల్ల గవర్నర్ ప్రసంగించినట్టుగానే అసెంబ్లీ ప్రొసీడింగ్స్‌లో వివరాలను నమోదు చేయిస్తాం. దీనిపై అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించాం అని సిఎం స్టాలిన్ వెల్లడించారు.

# కొన్ని అంశాలను గవర్నర్ చదవలే

### అసెంబ్లీలో కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్

**తిరువనంతపురం:** కేరళలో మంగళవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగ కాపీలో కొన్ని అంశాలను చదవలేదని ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. అర్లేకర్ సభ నుంచి నిష్క్రమించిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రసంగంలో 12వ పేరా నుంచి 15 పేరా వరకు చదవలేదని స్పీకర్‌కు వెల్లడించారు. గవర్నర్ చేసిన పని రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. గవర్నర్ ప్రసంగించని పేరాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే కొన్ని ముఖ్యమైన అంశాలున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక సంక్షోభం, పెండింగ్ బిల్లులు వంటి అంశాలను గవర్నర్ విస్మరించినట్లు తెలిపారు. 12వ పేరాలో సమాఖ్య విధానం, కేంద్రం తీసుకుంటున్న చర్యల గురించి, 15వ పేరాలో రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం వంటి విషయాలున్నట్లు ఆయన చెప్పారు. అయితే, వాటి గురించి గవర్నర్ ప్రసంగించకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి, సభా పద్ధతులకు విరుద్ధమని అన్నారు. గవర్నర్ విస్మరించిన అంశాలను జోడించి మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగాన్ని ప్రామాణిక ప త్రంగా అంగీకరించాలని స్పీకర్‌ను అభ్యర్థించారు.




**కేంద్రంపై విమర్శలు గుప్పించిన విజయన్**

మరోవైపు, కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి విజయన్ విమర్శలు గుప్పించారు. ఆర్థిక సమాఖ్య విధానం, రాజ్యాంగ విలువలను కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఫలితంగా కేరళ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటోందన్నారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిందని తెలిపారు. అయితే అందుకు సంబంధించిన విషయాలు 12, 15వ పేరాలో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే సభా నిబంధనల ప్రకారం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగాన్నే అధికారికంగా భావిస్తామని స్పీకర్ తెలిపారు. కొన్ని అంశాలను వదిలేస్తూ గవర్నర్ చేసిన ప్రసంగాన్ని అధికారికంగా గుర్తించబోమన్నారు. మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగం కాపీలను మీడియాకు అందజేయాలని స్పీకర్ ఆదేశించారు.

# ట్రంప్ వివాదాల ఏడాది!

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండవ పదవీకాలం ప్రారంభమై ఏడాది గడిచిన వేళ, దేశ, విదేశీ రాజకీయాలు సుడిగుండంలా తిరుగుతున్నాయి. 'అమెరికా ఫస్ట్' నినాదాన్ని మరింత దూకుడుగా అమలు చేస్తూ, ఆయన తన మద్దతుదారులకు ఇచ్చిన వాగ్దానాలను వేగంగా నెరవేర్చే ప్రయత్నంలో పడ్డారు. కానీ ఈ వేగం, ఈ దూకుడు ఏకపక్షంగా మారడంతో, ఆశించిన ఫలితాలకు విభిన్నమైన, లోతైన ప్రతికూల ప్రభావాలను చూపుతున్నాయి. ట్రంప్ పాలన అమెరికా శక్తిని బలోపేతం చేస్తోందా? లేక అనుకోకుండా అమెరికా ఆధిపత్యానికే గండికొడుతోందా? ప్రపంచ వ్యాప్తంగా ఇదే చర్చ. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలపై అమెరికన్ల నుంచి సామూహిక అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఆయన అనుసరిస్తున్న విదేశాంగ విధానాలు అమెరికాను ఒంటరిని చేసే దిశగా సాగుతున్నాయి. ఇంటాబయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ట్రంప్ తన పంథాను మార్చుకుంటారా? లేక మరింత మొండిగా ముందుకెళ్లి మరిన్ని వివాదాలను, విధ్వంసాలను సృష్టిస్తారా? అన్నది ఆందోళన రేపుతున్న ప్రశ్న. ట్రంప్ తీసుకున్న అత్యంత కఠినమైన నిర్ణయాల్లో ఒకటి వలసలు.. మరొకటి సరిహద్దు భద్రత. ఏడాది కాలంలోనే 6 లక్షలకుపైగా బహిష్కరణలు, 10 లక్షలకుపైగా స్వచ్ఛంద నిష్క్రమణలు నమోదయ్యాయి. నికర వలస ప్రవాహం ప్రతికూలంగా మారింది.

> ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునెస్కో, పారిస్ ఒప్పందం నుంచి వైదొలగడం, వెనెజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను బందీగా పట్టుకోవడం, పనామా కాలువపై దూకుడు, గ్రీన్‌ల్యాండ్‌ను సొంతం చేసుకోవాలన్న బెదిరింపులు వంటి చర్యలు 1823లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జేమ్స్ మన్రో అమలు చేసిన సిద్ధాంతాన్ని పునరుద్ధరించే ప్రయత్నాలుగా కనిపిస్తున్నాయి. ట్రంప్ విదేశాంగ విధానాలు, తొందరపాటు నిర్ణయాల కారణంగా కెనడా వంటి మిత్ర దేశాలకు అమెరికా దూరమవుతున్నది.

లేకెన్ రిలే చట్టం పునరుద్ధరణ, జాతీయ ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటన, గ్వాంటనామో సహా నిర్బంధ కేంద్రాల విస్తరణ వంటి వివాదాస్పద నిర్ణయాలు చట్టపరంగా, పరిపాలనా పరంగా వేగంగా అమలయ్యాయి. ట్రంప్ మద్దతుదారుల దృష్టిలో ఈ చర్యల వల్ల సరిహద్దు దాటే ప్రయత్నాలు తగ్గాయి. ఆశ్రయం కోరే అభ్యర్థనలు క్షీణించాయి. కఠినతే పరిష్కారం అన్న నమ్మకం ఓటర్లలో బలపడింది. కానీ ఈ వాదన వెనుక దాగి ఉన్న మానవ కథలు భయానకమైనవి. కుటుంబాల విభజన, పౌరుల తప్పుడు నిర్బంధాలు, చట్టవిరుద్ధ చర్యల పేరిట విచారణలు సహజంగానే దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని ప్రజ్వలింపచేశాయి. లాస్ ఏంజిల్స్, మిన్నియాపొలిస్ వంటి నగరాల్లో జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. నేషనల్ గార్డ్ మోహరింపులు ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు సంధిస్తున్నాయి. జన్మతః పౌరసత్వాన్ని పరిమితం చేసే ప్రయత్నాలను కోర్టులు అడ్డుకోవడం, ఈ విధానాల చట్టపరమైన బలహీనతను స్పష్టం చేస్తున్నది.

గత ఏడాది జులైలో ట్రంప్ సంతకం చేసిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్' ఆయన ఆర్థిక దృక్పథానికి ప్రతిరూపం. ఇక, సుంకాల విధానం మరింత వివాదాస్పదం. సార్వత్రికంగా 10 శాతం, చైనా, భారత్, మెక్సికో వంటి దేశాలపై 25–50 శాతం సుంకాలు విధించడం ద్వారా, 'స్వదేశీ పరిశ్రమల రక్షణ' అనే వాదనను ట్రంప్ తెరపైకి తెచ్చారు. కానీ, ప్రతీకార సుంకాలు ఎగుమతులను దెబ్బతీశాయి. స్టాక్ మార్కెట్లు అస్థిరంగా మారాయి. మరోవైపు, ట్రంప్ ప్రకటించిన రాయితీలు, మినహాయింపులు ఆయన రాజకీయ మద్దతుదారులకు అనుకూలంగా ఉన్నాయన్న ఆరోపణలు. ఆరోగ్య శాఖలో 'మేక్ అమెరికా హెల్తీ ఎగైన్' నినాదం కింద తీసుకున్న నిర్ణయాలు శాస్త్రీయ సమ్మతిని ప్రశ్నిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునెస్కో, పారిస్ ఒప్పందం నుంచి వైదొలగడం, వెనెజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను బందీగా పట్టుకోవడం, పనామా కాలువపై దూకుడు, గ్రీన్‌ల్యాండ్‌ను సొంతం చేసుకోవాలన్న బెదిరింపులు వంటి చర్యలు 1823లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జేమ్స్ మన్రో అమలు చేసిన సిద్ధాంతాన్ని పునరుద్ధరించే ప్రయత్నాలుగా కనిపిస్తున్నాయి. ట్రంప్ విదేశాంగ విధానాలు, తొందరపాటు నిర్ణయాల కారణంగా కెనడా వంటి మిత్ర దేశాలకు అమెరికా దూరమవుతున్నది. ఐరోపా దేశాల్లో అమెరికాపై నమ్మకం కనిష్టానికి పతనమైంది. ఈ ఖాళీని చైనా, బ్రిక్స్ వంటి కూటమి భర్తీ చేస్తున్నాయి. అమెరికా ఆధిపత్య ధోరణికి, సామ్రాజ్యవాద విధానాలకు కళ్లెం వేస్తున్నాయి. అమెరికా ఆధిపత్యాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రారంభమైన ట్రంప్ చర్యలు, అదే ఆధిపత్యం క్షీణించడానికి కారణమవుతున్నాయి. చైనా 'వన్ బెల్ట్.. వన్ రోడ్' నినాదంతో, ప్రపంచ దేశాలను ఏకం చేస్తున్నది. బ్రిక్స్‌లో కొత్త సభ్యులు చేరుతున్నారు. పాలస్తీనాపై కక్షకట్టిన ఇజ్రాయెల్‌ను వెనకేసుకొస్తున్నందుకు ప్రపంచవ్యాప్తంగా అత్యధిక దేశాలు అమెరికాను దుయ్యబడుతున్నాయి. స్వదేశంలో నిరసనలు...ప్రపంచవ్యాప్తంగా విమర్శలు... ట్రంప్ రెండవ పదవీకాలంలో ఏడాది వివాదాలతోనే గడిచిపోయింది. మరో మూడేళ్లలో ఏం జరుగుతుందనేది ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్న. అయితే, కొన్నిసార్లు విధ్వంసమే పరివర్తనకు మార్గాన్ని సుగమమం చేస్తుందని చరిత్ర నిరూపిస్తున్నది. ట్రంప్ అతిగా వ్యవహరించడం, అమెరికన్ ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరిచేందుకు ప్రజలను కార్యోన్ముఖులు చేసే అవకాశం లేకపోలేదు. 'ట్రంపిజం' తుపాను భూమిని కుదిపేస్తోంది. ట్రంప్ విధానాల పట్ల వ్యక్తమవుతున్న నిరసనలు అమెరికాలో ఏ కొత్త విధానాలకు బీజాలు వేస్తాయో? ఏ కొత్త వెలుగులకు బాటలు సిద్ధం చేస్తాయో చూడాలి.



## 100 రోజుల క్యాలెండర్‌ను అనుసరించాలి

**పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాల వ్యవధి ఏమిటి? సంవత్సరానికి కనీసం 100 రోజుల క్యాలెండర్‌ను అనుసరించాలి. ప్రభుత్వం, ప్రతిపక్షాలు రెండూ ఈ విషయాన్ని చాలా తీవ్రంగా పరిగణించి, దానిపై చర్య తీసుకోవాలి. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు దేశ రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన స్తంభాలు. ప్రభుత్వం/కార్యనిర్వాహక వ్యవస్థను దేశానికి, ప్రజలకు జవాబుదారీగా ఉంచడానికి శక్తివంతమైన సాధనంగా పనిచేస్తాయి. పార్లమెంటు, శాసనసభల కార్యకలాపాలు శాంతియుతంగా, సరైన నియమాలకు అనుగుణంగా, సంవత్సరానికి కనీసం 100 రోజుల క్యాలెండర్‌ను అనుసరించడం చాలా అవసరం.**

బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి



## బంగారు భవిష్యత్తుపై కల్తీ విషం!

### ఔషధ మాఫియా అరాచకాలపై పటిష్టమైన నిఘా ఏదీ?

పసిపిల్లల ఆరోగ్యం నేడు కల్తీ మందుల కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. ప్రాణాలను కాపాడాల్సిన ఔషధాలే మృత్యుపాశాలుగా మారుతున్న ఉదంతాలు వరుసగా వెలుగులోకి వస్తుండటం పౌర సమాజాన్ని ఉలిక్కిపడేలా చేస్తోంది. ఇటీవల బయటపడిన ప్రాణాంతక మందుల వ్యవహారం కేవలం ఒక సంస్థ చేసిన పొరపాటుగా చూడలేం; ఇది వ్యవస్థీకృత వైఫల్యంగా, పాలకుల ఉదాసీనతకు నిదర్శనంగా కనిపిస్తోంది. ఒక మందు విపణిలోకి వచ్చి వేలాది మంది పిల్లల శరీరాల్లోకి ప్రవేశించిన తర్వాత, అది విషపూరితమని అధికారులు గుర్తించడం వల్ల ప్రయోజనం ఏమిటనే నిలదీతలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఈ ప్రాణాంతక పరిస్థితులకు తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (DCA), సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (CDSCO)ల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. మందుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాల్సిన ఈ సంస్థలు, కేవలం కార్యాలయాలకే పరిమితమవ్వడం వల్ల కల్తీ మాఫియా చెలరేగిపోతోంది. క్షేత్రస్థాయిలో తయారీ కేంద్రాలను తనిఖీ చేయడంలో, ముడి పదార్థాల నాణ్యతను పరీక్షించడంలో ఈ రెండు కీలక సంస్థలు ఘోరంగా విఫలమయ్యాయి. అనుమతులు ఇచ్చే సమయంలో చూపించే అత్యుత్సాహం, నాణ్యతను పరీక్షించే సమయంలో మృగ్యమవుతోంది. అధికారుల పర్యవేక్షణా లోపం వల్లే విషపూరిత రసాయనాలు మందుల్లోకి చేరుతున్నాయని నిపుణులు మండిపడుతున్నారు.

సాధారణంగా ఏదైనా ఒక ఔషధం తయారీ కేంద్రం నుంచి బయటకు రావడానికి ముందే దాని నాణ్యతను ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లో శాస్త్రీయంగా పరీక్షించాల్సిన అవసరం ఉంది. అయితే, ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనలు కంపెనీలకు మితిమీరిన వెసులుబాటును కల్పిస్తున్నాయి. 'స్వీయ ధృవీకరణ' పేరుతో కంపెనీలే తమ మందుల నాణ్యతను తామే నిర్ధారించుకుని విక్రయాలకు విడుదల చేసే అవకాశం ఉండటం పెను ప్రమాదానికి దారితీస్తోంది. ఈ వెసులుబాటునే పెట్టుబడిగా మార్చుకున్న కొన్ని స్వార్థపూరిత కంపెనీలు, లాభాల వేటలో ముడి పదార్థాల నాణ్యతను పూర్తిగా పక్కన పెడుతున్నాయి. ముఖ్యంగా ద్రవ రూప మందుల తయారీలో వాడే ఖరీదైన రసాయనాలకు బదులుగా, పారిశ్రామిక అవసరాల కోసం వాడే అత్యంత విషపూరితమైన పదార్థాలను వాడుతున్నాయి. ఔషధ అనుమతుల ప్రక్రియలో ఉన్న లొసుగులు కల్తీ ముఠాలకు వరంగా మారుతున్నాయి. ఒక రాష్ట్రంలో తయారీ అనుమతి పొందిన కంపెనీ తన ఉత్పత్తులను దేశ వ్యాప్తంగా ఎక్కడైనా విక్రయించవచ్చు. దీనివల్ల ఒక రాష్ట్రంలోని ఔషధ నియంత్రణ అధికారులకు మరో రాష్ట్రంలోని తయారీ కేంద్రాలను నేరుగా తనిఖీ చేసే అధికారం ఉండదు. కేవలం మందుల దుకాణాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న నమూనాలను మాత్రమే వారు సేకరించగలరు. ఈ నమూనాలు సేకరించి, వాటిని ప్రయోగశాలకు పంపి నివేదిక వచ్చేసరికి నెలల సమయం పడుతోంది. ఈ లోపు ఆ విడతకు సంబంధించిన వేలాది సీసాల మందు అప్పటికే ప్రజల శరీరాల్లోకి చేరుతున్నది. ప్రాణాలు పోయాక 'వాడకం నిలిపివేయండి' అని నోటీసులు ఇవ్వడం అనేది యుద్ధం ముగిశాక ఆయుధాలు తీయడం వంటిదని విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ (CDSCO) మరియు రాష్ట్రాల విభాగాలు మేల్కోవాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. పత్రాల మీద సంతకాలు చేసి అనుమతులు ఇవ్వడమే కాకుండా, ప్రతి తయారీ దశలోనూ నిశితమైన నిఘా ఉంచాలి. మందు విపణిలోకి విడుదల కావడానికి ముందే ప్రతి విడతను స్వతంత్ర ప్రయోగశాలల ద్వారా పరీక్షించి, 'నాణ్యత ధృవీకరణ' పత్రం ఉంటేనే విక్రయాలకు అనుమతించాలనే నిబంధనను తక్షణమే అమల్లోకి తీసుకురావాలి. వ్యవస్థలలో కఠినమైన ప్రక్షాళన జరగాలి.

**వెంకగారి భూమయ్య,**
**9848559863**

# విపరీతంగా పెరుగుతున్న అసమానతలు: మంచిరోజులేవి మోదీజీ?



ఎం.కోటేశ్వరరావు

సంపదల అసమానత విపరీతంగా పెరుగుతున్నదని, సంపదల పున:పంపిణీ జరగకపోతే సామాజిక సంక్షోభానికి దారితీస్తుందని అనేక మంది చెబుతున్నారు. అయితే ఈ మాటలు చెప్పేవారిలో సంపన్నుల బాగు కోరుకొనే వారే ఎక్కువగా ఉన్నారు. వారి ఉద్దేశ్యం ఏమిటంటే కొంత మంది దగ్గరే అపార సంపద పోగుపడితే మొదటికే మోసం వస్తుందన్నదివారిఉద్దేశ్యం. అయితే నిజంగా మంచి కోరుకుంటున్నవారు లేరా అంటే ఉన్నారు.

''2026 ప్రపంచ అసమానతల నివేదిక'' డిసెంబరులో విడుదలైంది. 2018, 22 తరువాత ఇది మూడవది.ప్రపంచంలో, మనదేశంలో కూడా అసమానత తీవ్ర స్థాయిలో ఉందని హెచ్చరించింది. ఈ నివేదికను రూపొందించిన వారు ల్యూకాస్ ఛాన్సెల్, రికార్డో గోమెజ్ కరేరా, రొవాయిడా మోషిరిఫ్, థామస్ పికెటి. ఆ నివేదికకు మన దేశానికి చెందిన జయతి ఘోష్,జోసెఫ్ స్టిగ్లిజ్ ముందు మాటరాశారు. సంపాదకుల్లో చివరి వ్యక్తి ఫ్రెంచి ఆర్థికవేత్త థామస్ పికెటి గురించి తెలుగువారికి కొంతమేరకు తెలుసు,ఎందుకంటే ఆర్థిక అసమానతల గురించి ఆయన హెచ్చరించిన అంశాలు గతంలో చర్చనీయాంశమయ్యాయి. అసమానతలు అంటే కేవలం సంపదకే పరిమితం కాదు, వాతావరణ, లింగపరమైన, అవకాశాలు లభ్యత, చివరికి ఎన్నికల కోసం నియోజకవర్గాల విభజనలో వివక్షతో సహా ఇతర అంశాలు ఉన్నాయి. ప్రపంచ అసమానతల సమాచార సంస్థకు అనుబంధంగా ఉన్న రెండువందల మందికి పైగా పరిశోధకులు అనేక కోణాల్లో చేసిన విశ్లేషణల సారమే ప్రపంచ అసమానతల నివేదిక. అన్ని అంశాలను ఇక్కడ సృజించటం సాధ్యం కాదు గనుక సంపదల పున:పంపిణీ గురించి చర్చిద్దాం. ప్రపంచాన్ని '' కమ్యూనిస్టు భూతం '' ఆవహించకుండా, జనం దానివైపు మరలకుండా చూసేందుకు పెట్టుబడిదారీ ఆర్థిక, సామాజికవేత్తలు అనేక అంశాలను ముందుకు తెచ్చారు. వాటిలో ఊట సిద్దాంతం ఒకటి.

ప్రభుత్వాలు కేవలం పాలనకే పరిమితమై అన్ని రంగాలను ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకే అప్పగిస్తే వారు సృష్టించే సంపదల మూట నుంచి ఊట యావత్ సమాజానికి దిగుతుందన్నది ఊట(tricle down) సిద్ధాంతం. దానికి సంస్కరణలు, నూతన ఆర్థిక విధానాల వంటి ముద్దుపేర్లు పెట్టారు, జనం కూడా నిజమే అని నమ్మారు, తమకూ సంపదల ఊట దిగుతుందేమోనని పోరాటాలు మాని ఆశతో చెంబులు పట్టుకు ఎదురు చూశారు, ధారలేమీ కారలేదు, కేవలం కొన్ని చుక్కలు మాత్రమే పడ్డాయి. దాంతో ఫలితం లేదని అసంతృప్తి చెందటం ప్రారంభించారు. సోషలిస్టు సమాజాల కోసం జనం చూడకుండా కొన్ని తాయిలాలు అందించి సంతృప్తిపరచేందుకు ఐరోపాలో అనేక ప్రయోగాలు చేశారు. సంక్షేమ పథకాలు అమలు జరిపి సోషలిజంలో ఇంత కంటే పెద్దగా ఒరిగేదేమిటని జనాన్ని కొంతకాలం మభ్యపెట్టారు. ప్రధమ సోషలిస్టు రాజ్యం సోవియట్ యూనియన్ కూలిపోవటంతో కమ్యూనిజం, సోషలిజాలపై విజయం సాధించామని, ఆ ప్రయోగం విఫలమైందని ప్రచారం చేశారు. అంతేనా పోటీ లేకపోవటంతో అప్పటి వరకు అమలు జరిపిన అనేక సంక్షేమాలకు కోత పెట్టటం ప్రారంభించారు. అసమానతలు అప్పటి నుంచి మరింత పెరగటంతో జనాన్ని తప్పుదారి పట్టించేందుకు సంపదల పున:పంపిణీ అవసరమంటూ మరో పల్లవి అందుకున్నారు.సూత్రరీత్యా దీన్ని ఎవరూ వ్యతిరేకించరు, అయితే అది ఎలా అన్న అంశంమీదే తేడా వస్తున్నది. సంపదలు పంచినంత మాత్రాన వేగంగా దారిద్ర్యం తగ్గుతుంది తప్ప ఆర్థిక వృద్ధి జరగదని, జనాలను సోమరులుగా మారుస్తాయని కొందరు చెబుతున్నారు. కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు ఈ మంచి సంస్కరణ అంశాన్ని ప్రచారం చేసి జనాన్ని సమీకరించేందుకు చూస్తున్నాయి. అసలేమీ లేనిదాని కంటే ఏదో ఒకటి మంచిదే.అయితే భ్రమలు పెట్టుకోనవసరం లేదని చెప్పక తప్పదు.

అసమానతల గురించి తాజా నివేదికలో పేర్కొన్న అంశాలను క్లుప్తంగా చూద్దాం.మచ్చుకు ఒకటి, సబ్ సహారా ప్రాంతంలో ఒక బిడ్డ మీద పిపిపి పద్ధతిలో 200యూరోలు ఖర్చు చేస్తుండగా ఐరోపాలో 7,400, ఉత్తర అమెరికా, ఓషియానా దేశాల్లో 9,000 యూరోలు వెచ్చిస్తున్నారు. ప్రపంచంలో 0.001శాతం అంటే అరవైవేల మంది కంటే తక్కువ ఉన్న కోటీశ్వరులు దిగువన ఉన్న 50శాతం జనాభా మొత్తం సంపదల కంటే మూడు రెట్లు ఎక్కువ కలిగి ఉన్నారు. ప్రతి ఏటా ప్రపంచ జిడిపిలో ఒకశాతం ధనికదేశాలకు తరలుతున్నది.ఇది ప్రపంచ వృద్ధికి ఇస్తున్నట్లు చెబుతున్న సాయానికి మూడు రెట్లు ఎక్కు వ. స్త్రీ, పురుష వేతన తేడా అన్ని చోట్లా ఉంది. గంటకు ఒక పురుషుడు పొందే వేతనంలో మహిళకు వస్తున్నది 61శాతమే, వేతన చెల్లింపులేని పనిగంటలను కూడా లెక్కిస్తే ఈ తేడా 32శాతానికి దిగజారుతుంది.

ప్రపంచ అసమానతల సమాచార కేంద్ర వివరాల ప్రకారం దిగువ విధంగా మనదేశంలో అసమానత పెరిగింది.దీన్ని రెండుగా విభజించి చూడాలి.1990 దశకంలో నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టక ముందు, తరువాత సమాజంలోని మూడు తరగతుల సంపదలు ఎలా పెరిగాయో చూడవచ్చు.

| సంవత్సరాలు | దిగువ 50శాతం | ఎగువ 10శాతం | ఎగువ ఒక శాతం |
|---|---|---|---|
| 1961–1970 | 12.29 | 43.18 | 11.87 |
| 1971–1980 | 11.75 | 42.25 | 11.23 |
| 1981–1990 | 10.91 | 45.00 | 12.50 |
| 1991–2000 | 8.36 | 54.57 | 23.31 |
| 2001–2010 | 8.10 | 56.60 | 25.70 |
| 2010–2020 | 6.12 | 63.68 | 31.55 |

దీన్ని ముందే చెప్పుకున్నట్లుగా రెండు భాగాలుగా చేస్తే 1961 నుంచి 1990 వరకు సగటు దిగువ 50శాతం జనాభా వాటా 11.65శాతం కాగా ఎగువ పదిశాతం 43.47,ఎగువ ఒకశాతం 11.86శాతం కలిగి ఉన్నారు. ఇదే 1990 నుంచి 2020 వరకు వరుసగా 7.5258, 2826.85శాతం ఉన్నారు. నూతన ఆర్థిక విధానాలు అమలు జరిగిన మూడుదశాబ్దాలలో ఎగువ ఒకశాతం వాటా 226, పదిశాతం మంది వాటా 134శాతం పెరగ్గా దిగువ 50శాతం వాటా 63శాతం తగ్గింది.తాజా అంచనా ప్రకారం ఒకశాతం ధనికుల సంపద 40శాతానికి చేరింది. మంచి రోజులు తీసుకువస్తానని చెప్పిన నరేంద్ర మోడీ సంస్కరణలను మరింత వేగంగా అమలు జరుపుతానని కూడా చెప్పారు. దాని ఫలితం ఏమిటో చూశాము. కార్పొరేట్ పన్ను గణనీయంగా తగ్గించిన కారణంగా ఏటా లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖజానా కోల్పోతున్నది. పోనీ ఆ మేరకు ఆయా సంస్థలు పెట్టుబడులు పెట్టి ఉపాధి కల్పిస్తున్నాయా అంటే అదీ లేదు. పర్మనెంటు ఉద్యోగుల సంఖ్య నానాటికీ తగ్గుతున్నది.మన దేశ కార్పొరేట్ సంస్థలకు పన్ను తగ్గించిన కారణంగా వాటిలో పెట్టుబడులు పెడితే లాభసాటిగా ఉండటంతో విదేశీ కంపెనీలు నేరుగా పరిశ్రమల స్థాపనకు బదులు ఉన్న కంపెనీల వాటాలను స్టాక్‌మార్కెట్‌లో కొనుగోలు, విక్రయాలు చేస్తూ లాభాలను తమ దేశాలకు తరలించుకుపోతున్నాయి.

ఆదాయాన్ని బట్టి పన్ను విధించి, ఆ మేరకు అల్పాదాయవర్గాలకు రాయితీల రూపంలో సంపదల పంపిణీ ఒక పద్ధతి. లాటిన్ అమెరికాలోని బ్రెజిల్‌లో అసమానతలు, దారిద్ర్య నిర్మూలన పథకాల్లో భాగంగా షరతులతో కూడిన నగదు బదిలీ పథకాలను అమలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు జరుగుతున్న అమ్మఒడి, తల్లిదీవెన పథకాలు వాటికి నకలే. తమ బుర్రలో పుట్టినవే అని ఎవరైనా చెప్పుకుంటే బడాయి తప్ప మరొకటి కాదు. 2003లో వామపక్ష నేత లూలా డ సిల్వా అధికారానికి వచ్చినపుడు అంతకు ముందున్న కొన్ని పథకాల అనుభవాలను చూసి మరింత లబ్ది చేకూరేవిధంగా అల్పాదాయ వర్గాలకు ఈ పథకాన్ని అమలు చేశారు. పిల్లలను బడికి పంపటం, టీకాలు వేయించిన వారికి నగదు బదిలీ జరిగింది.దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు దీనికి అర్హులు. అంతర్జాతీయంగా అది ప్రశంసలు పొందింది. అది ఇప్పటికీ కొనసాగుతోంది,సంపదల పంపిణీ వలన దారిద్ర్య తీవ్రత తగ్గుతుంది తప్ప అసమానత తొలగదు. గమనించాల్సిందేమంటే రెండు దశాబ్దాల తరువాత చూస్తే అసమానతలు ఎక్కువగా ఉన్న పది ప్రపంచ దేశాల్లో బ్రెజిల్ ఒకటిగా ఉంది. అందువలన సంపదల పంపిణీ గురించి మరింత నిర్దిష్టంగా మథనం జరగాల్సి ఉంది. తమ ప్రత్యేక లక్షణాలతో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం చేస్తున్నట్లు ప్రకటించిన చైనాలో కూడా ఆర్థిక అసమానతలు ఉన్నాయి, అయితే వాటిని తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది.

ఈ నివేదిక ప్రకారం సమాజంలో ప్రపంచంలో ఎగువన ఉన్న పది శాతం మంది వద్ద సంపద 58శాతం ఉంది (2022లో 57శాతం) దిగువన ఉన్న 50శాతం మందికి 15శాతం(2022లో 13శాతం). ఇంతకు ముందు పట్టికలో సంపదల పెరుగుదల రేటు చూశాము, ఉన్న సంపదల మొత్తం వేరు,పెరుగుదల రేటు వేరు. భారత్ మరియు చైనా గురించి చెప్పిందేమంటే ప్రపంచ మధ్యతరగతిలోకి చైనా జనాభా ఎక్కువ మంది చేరారని, అదే భారత్‌లో 1980లో మధ్య తరగతిలో ఉన్న 40శాతంలో ఎక్కువ మంది ఇప్పుడు దిగువ 50శాతంలోకి దిగజారినట్లు పేర్కొన్నది. కార్పొరేట్లకు పన్ను తగ్గించిన కారణంగా సంపదలు పోగుపడటం ఒకటైతే రాష్ట్రాలకు రావాల్సిన పన్ను రాబడి తగ్గుతున్నది, అది సంక్షేమ పథకాల మీద ప్రతికూల ప్రభావం చూపుతున్నది. ఉదాహరణకు వెనుకబడిన తరగతుల వారికి 50 ఏండ్లకే పెన్షన్ ఇస్తామని చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ మాదిరి సామాజిక పెన్షన్లు నాలుగువేలకు పెంచుతామని చెప్పిన తెలంగాణా కాంగ్రెస్ వాగ్దానం అమలుకు నిధులు లేవు, బిజెపి పాలిత రాష్ట్రాలలో పరిస్థితి మరీ అధ్వానం, వారికి అసలు ఆ ఉద్దేశ్యమే లేదు అని వేరే చెప్పనవసరం లేదు. యుపిఏ ప్రభుత్వ హయాంలో నిర్ణయించిన పెన్షన్ మొత్తాలనే మోడీ సర్కార్ ఇప్పటికీ అందిస్తున్నది తప్ప పైసా పెంచలేదు. దాని మానవత్వ ముఖం అలా ఉంది. అందువలన మరో విధంగా చెప్పాలంటే సంపదల పున:పంపిణీని దెబ్బతీస్తున్నది.

'' చెడుగా మారేంత వరకు అసమానత మౌనంగానే ఉంటుంది.ఈ నివేదిక అసమానతకు మరియు నేటి అసమాన సామాజిక, ఆర్థిక నిర్మాణాలతో అవకాశాల నిరాకరణకు గురైన వందల కోట్ల మందికి గళాన్ని ఇస్తుంది'' అని ప్రపంచ అసమానతల నివేదిక సంపాదకుల్లో ఒకరైన రికార్డో గోమెజ్ కరేరా వ్యాఖ్యానించాడు. ముందుమాట రాసిన వారిలో ఒకరైన జోసెఫ్ స్టిగ్లిజ్ ఇలా చెప్పారు.'' నేటి విపరీత అసమానత అనివార్యమైనదేమీ కాదని చరిత్ర, అన్ని దేశాల అనుభవాలు, సిద్ధాంతం కూడా చెబుతున్నది.పురోగామి పన్ను విధానం( సంపద పెరిగే కొద్దీ పన్నుల పెంపు), పెద్దమొత్తంలో సామాజిక పెట్టుబడి,న్యాయమైన కార్మిక ప్రమాణాలు, ప్రజాస్వామిక వ్యవస్థలు గతంలో తేడాలను తగ్గించాయి. ఇదే మరోసారి చేయగలవు ''. సంపదల పున:పంపిణీ జరగాలని కోరుకొనే వారు ప్రచారానికి మాత్రమే పరిమితం కారాదు, కార్యాచరణకూ పూనుకోవాలి !

# ముంబయిలో రాజకీయంగా స్తంభించిన బిజెపి

**డాక్టర్ గ్యాన్ పాథక్**

మహారాష్ట్రలో 29 మున్సిపల్ కార్పొరేషన్‌ల ఎన్నికల్లో బిజెపి అద్భుత విజయాలు సాధించి రాజకీయంగా స్థిరపడినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది, అది వాస్తవమా? ముంబయిలో రాజకీయంగా బిజెపి ఎదుగుదల స్తంభించినట్లు బిఎంసి ఫలితాల విశ్లేషణ తెలుపుతున్నది. 2017 ఎన్నికల్లో తారాజువ్వలా 51 సీట్లు పెంచుకుని 82 సీట్లకు చేరుకున్న బిజెపికి తాజా ఎన్నికల స్థితి ఏమిటి? ఈ పర్యాయం దాని సీట్లు 7 మాత్రమే పెరిగాయి. కాంగ్రెస్ కోల్పోయిన సీట్లు 7. థాకరేలు దాదాపు మూడు దశాబ్దాల తదుపరి బ్రిహ న్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ కోల్పోవటం మీడియా పతాక శీర్షికల కెక్కింది. అయితే 227 సీట్లలో 65 గెలుపొంది వారు ఇప్పటికీ బలమైన శక్తిగానే ఉన్నారు. 89 సీట్లు గెలిచిన బిజెపి తర్వాత రెండవ స్థానం వారిదే. మిగతా రాష్ట్రంలో కాంగ్రెస్ స్థూలంగా ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించింది.

జనవరి 15న ఎన్నికలు జరిగిన 2869 డివిజన్‌లలో బిజెపి 1425 దక్కించుకుంది. ఫిబ్రవరి 2015 – డిసెంబర్ 2018 మధ్యకాలంలో జరిగిన ఇంతకు మునుపు రౌండ్‌లో బిజెపి గెలుపొందిన 1099 సీట్లను ఇప్పుడు పెంచుకోగలిగింది. అయితే వారికి సొంతంగా మెజారిటీ 13 కార్పొరేషన్‌లకే పరిమితమైంది. శివసేన, ఎన్‌సిపిల్లో చీలిక నుంచి అది లబ్దిపొందిందని దీని అర్థం. దీనికి తోడు ఎంవిఎ భాగస్వాములైన కాంగ్రెస్, శివసేన(యుబిటి), ఎన్‌సిపి(ఎస్‌పి) విడిపోయి, వేర్వేరు గ్రూపులుగా పోటీ చేశాయి. అందువల్ల బిజెపి విజయాలను దాని బలం మరింత పెరిగినట్లు, అది విస్తరించినట్లు భాష్యం చెప్పటానికి వీల్లేదు. ప్రతిపక్షం దురదృష్టం, వ్యూహాత్మక తప్పిదాలు బిజెపికి వరప్రసాదంగా రుజువైంది. బిజెపికి 13 కార్పొరేషన్‌లలో పూర్తి మెజారిటీ లభించగా, మరో 6 కార్పొరేషన్‌సలో అది పెద్ద స్థానం పొందింది.

2017 బ్రిహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఐక్య శివసేన 84 సీట్లు గెలుపొందగా, బిజెపి 82 సీట్లు గెలుచుకుంది. 2022లో శివసేన చీలిపోయింది. శివసేన చీలిక గ్రూపులు శివసేన(షిండె), శివసేన(యుబిటి) ఈ సంవత్సరం ఎన్నికల్లో విడివిడిగా పోటీచేశాయి. బిజెపి మహాయుతిలో భాగంగా పోటీచేసిన షిండె సేన 29 సీట్లు గెలుచుకుంది. శివసేన (యుబిటి) 65 సీట్లు గెలుపొందింది. రెండు శివసేన గ్రూపులను కలిపితే మొత్తం 90 సీట్లు – 2017 కన్నా 10 సీట్లు ఎక్కువ గెలుచుకున్నాయి. దీని ప్రాధాన్యత ఏమిటి? సీట్ల రీత్యా వారు బలపడ్డారు. ఉద్ధవ్ థాకరే శివసేన (యుబిటి)తో పొత్తుతో పోటీ చేసిన రాజ్ థాకరే ఎంఎన్ఎస్ 6 సీట్లు (2017 కన్నా ఒక సీటు కోల్పోయింది). ఎన్‌సిపి (శరద్ పవార్) కేవలం ఒక సీటు గెలుపొందాయి. కాగా ఈ పర్యాయం ఒంటరిగా పోటీచేసిన కాంగ్రెస్ 7 సీట్లు కోల్పోయి 24 సీట్లకు పరిమితమైంది. ఎన్‌సిపికి సంబంధించి అదీ రెండుగా చీలింది. 2017లో 9 గెలిచిన ఎన్‌సిపి, ఈ పర్యాయం శరద్ పవార్ ఎన్‌సిపి 1 సీటు, అజిత్ పవార్ ఎన్‌సిపి 3 సీట్లు మాత్రమే గెలిచాయి. ఇద్దరూ సమష్టిగా 5 సీట్లు కోల్పోయారు. దీన్నిబట్టి తేలేదేమంటే ముంబయిలో బిజెపికి పెరిగిన 7 సీట్లు రాజకీయబలం పెరుగుదల కాదని, ప్రతిపక్షాల చీలిక నుంచి సంపాదించినవని అర్థమవుతున్నది. అంతేగాక ముంబయిలో అసలు శివసేన ఉద్ధవ్ థాకరే అధ్యక్షునిగా ఉన్న శివసేన (యుబిటి) అని నిర్ధారణ అయింది.



బిఎంసి తర్వాత దృష్టి సారించాల్సింది పూణె కార్పొరేషన్. ఇక్కడ పవార్‌లు ఒక్కటైనారు. రాష్ట్ర స్థాయిలో వారి పార్టీ లు ప్రత్యర్ధి కూటముల్లో భాగస్వాములు. ఈ అపవిత్ర అలయెన్స్‌లను, అపవిత్ర చీలికను ప్రజలు హర్షించలేదు. వారి ఓటర్లు బిజెపి వైపు మరలినారు. దీంతో బిజెపి 165 సీట్లలో 119 గెలుచుకుని పవార్‌లను దిమ్మతిరిగే దెబ్బ కొట్టింది.

ఎన్‌సిపి(అజిత్) 27, ఎన్‌సిపి (శరద్‌పవార్) 3 సీట్లకు పరిమితమైనాయి. కాగా కాంగ్రెస్ 15, శివసేన (యుబిటి) 1 సీటు దక్కించుకున్నాయి. శివసేన (షిండె) అడ్రసు దొరకలేదు.

కాగా రాష్ట్ర స్థాయిలో శివసేన (షిండె) 399, శివసేన (యుబిటి) 155 కార్పొరేటర్లను గెలిపించుకున్నాయి. కాబట్టి రాష్ట్రం మొత్తంమీద (ముంబయి మినహా) అసలు శివసేన అంటే షిండే శివసేనగా నిర్ధారణ అయింది. రాష్ట్రం మొత్తంమీద ఉమ్మడి శివసేనకు 489 సీట్లు ఉండగా, ఇప్పుడు 554 సీట్లు గెలుపొందాయి. శివసేన బలం పెరుగుదల బిజెపికి ఆందోళన కలిగించే విషయం. బిజెపి బలం పెరుగుదలకు షిండె శివసేనతో పొత్తు ప్రధాన కారణం. అందువల్ల అది షిండెను మంచిగా చూసుకోవాల్సి ఉంటుంది.

ముంబయి కార్పొరేషన్‌లోని సున్నితమైన స్థితి దృష్ట్యా బిజెపి తమ కార్పొరేటర్లను ఎత్తుకుపోకుండా షిండె తమ కార్పొరేటర్లతో ఒక హోటల్‌లో క్యాంపు పెట్టారు. బిజెపి కూడా తమ వారితో మరో చోట శిబిరం పెట్టింది. రెండు పార్టీల మధ్య పదవుల పంపిణీకి కనీసం మరో వారం పట్టవచ్చు. అసెంబ్లీ ఎన్నికల అనంతర అనుభవం రీత్యా షిండె బిఎంసి అధికారంలో బలమైన వాటా కోరుకున్నట్లు సమాచారం.

మొత్తంమీద బిజెపికి 19, శివసేన (షిండె)కు 3, ఎన్‌సిపి (అజిత్ పవార్)కి1, కాంగ్రెస్‌కు 3, శివసేన(యుబిటి)కి 1 మేయర్ పదవులు దక్కుతాయి.




## యువతలో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే సిఎం కప్ పోటీలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సిఎం కప్ పోటీలు గ్రామీణ, పట్టణ ప్రాంత యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడతాయని, ఆత్మవి శ్వాసం, శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి పట్టణంలోని జయశంకర్ సార్ విగ్రహం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు జిల్లా యువజన, క్రీడల శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సిఎం కప్ టార్చ్ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్‌లతో కలిసి పాల్గొన్నారు. అనంతరం టార్చ్ ను వెలిగించి, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సింగరేణి జిఎం ఏ.రాజేశ్వర్ రెడ్డి, క్రీడల శాఖ అధికారి రఘు, డీఈవో రాజేందర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, నాయకులు బుర్ర కొమురయ్య, సాంబమూర్తి, దాట్ల శ్రీనివాస్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళినాయక్

**ప్రజాపక్షం/గూడూరు :** గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళినాయక్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూటియు జిల్లా అధ్యక్షుడు గుగులోతు శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మురళినాయక్ మాట్లాడుతూ సమస్యలపై పరిష్కారం చూపే విధంగా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశీరామ్‌నాయక్, జిల్లా బాధ్యులు శంకర్, హరినాయక్, సదర్ సమ్మయ్య, స్వామి, రాష్ట్ర బాధ్యులు కిషన్, పూల్‌సింగ్, రమేశ్, వెంకన్న, గూడూరు మండల బాధ్యులు కృష్ణ, కిషన్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



## మెరుగైన శిక్షణతో విధుల్లో మరింత రాణించగలం

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పోలీస్ అధికారులు, సిబ్బంది మెరుగైన శిక్షణపూర్తి చేయడం ద్వారా అప్పగించిన పనుల్లో మరింత రాణించగలమని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మూడ్ రిజర్వ్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శివకుమార్ హైదరాబాద్ యూసుఫ్‌గూడలో నిర్వహించిన ఆరునెలల ఆయుధ మరమ్మత్తుల శిక్షణ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేయడంతో శిక్షణా కేంద్రం నుండి జారీచేసిన ధృవీకరణ పత్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా కానిస్టేబుల్ శివకుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శిక్షణ నిర్వహించిన తీరుపై పోలీస్ కమిషనర్ కానిస్టేబుల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమములో అదనపు డిసిపిలు రవి,సురేష్‌కుమార్, శ్రీనివాస్, స్పర్జన్‌రాజ్ పాల్గొన్నారు.

## శాస్త్రీయ పద్ధతిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు

**ప్రజాపక్షం/హనుమకొండ :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నాణ్యమైన ప్రమాణాలతో, శాస్త్రీయ పద్ధతిలో ఇళ్లను నిర్మించుకోవాలని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇంటి నిర్మాణ విధానంపై అవగాహన కల్పించారు. పునాది నుండి స్లాబ్ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తక్కువ స్థలంలో గాలి–వెలుతురు సమృద్ధిగా వచ్చేలా ఉత్తమమైన హౌస్ ప్లాన్‌లను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు.ప్రభుత్వం అందిస్తున్న నిధులను దుర్వినియోగం చేయకుండా, దశలవారీగా పనులు పూర్తి చేస్తూ ప్రతి పేద కుటుంబానికి పటిష్టమైన, దీర్ఘకాలిక సొంతింటిని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే నాగరాజు గారు ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నేనీ రవీందర్ రావు, టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, టౌన్ అధ్యక్షుడు మైస సురేష్, అనిమిరెడ్డి కృష్ణారెడ్డి తో పాటు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్, నాయకులు

**ప్రజాపక్షం/నర్సంపేట :** నర్సంపేట పట్టణంలోని మాజీ కౌన్సిలర్, బిజెపి పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, నాయకులతో కలిసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి బిఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సంపేట మున్సిపాలిటీలోని అభివృద్ధి, శాంతి సంక్షేమం కోసం అన్ని వర్గాల ప్రజలు పార్టీలకతీతంగా ఏకమై ఐక్యమత్యంతో గులాబీ జెండా ఎగరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పట్టణ పార్టీ అధ్యక్షులు నాగెల్లి వెంకటనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి, వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### వెయ్యి సంవత్సరాల పాటు నిలిచిపోయేలా...

## గద్దెల పునర్నిర్మాణం చేపట్టడం హర్షణీయం

వరంగల్ ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి

మేడారం జాతరపై కేంద్ర ప్రభుత్వ వివక్ష



**ప్రజాపక్షం/హనుమకొండ :** వెయ్యి సంవత్సరాల పాటు నిలిచిపోయేలా గద్దెల పునర్నిర్మాణం చేపట్టడం హర్షణీయమని వరంగల్ ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ములుగు జిల్లా తడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క–సారలమ్మ వనదేవతలను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి దంపతులు అమ్మవార్లకు ఎత్తు బంగారం మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఎంపి, ఎమ్మెల్యేకు ఆలయ పూజారులు అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర నూతన వైభవాన్ని సంతరించుకుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. వెయ్యి సంవత్సరాల పాటు నిలిచిపోయేలా గద్దెల ప్రాంగణాన్ని ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా పునర్నిర్మాణం చేయడం మహాఅద్భుతంగా ఉందని కొనియాడారు. మేడారం మహా జాతరను ఇంత గొప్పగా అభివృద్ధి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్ర ప్రజలపక్షాన, ముఖ్యంగా ఆదివాసీ, గిరిజన బిడ్డల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

**మేడారం జాతరపై కేంద్ర ప్రభుత్వ వివక్ష**

ఆసియాలోనే అతిపెద్ద జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర పట్ల కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కోట్లాది ఆదివాసీల మనోభావాలను గౌరవిస్తూ తక్షణమే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## జనగామ, చేర్యాలలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలి

పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/జనగామ :** జనగామ, చేర్యాల మున్సిపాల్టీలో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా ఉన్న సీతక్కను కలిసి ఇక్కడి పరిస్థితుల్ని క్షుణంగా వివరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మున్సిపాల్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా నిధుల కేటాయింపులు జరిగాయని, గతంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాల అమలు జరుగుతుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచించాలని, అందరినీ ఒక్క తాటిపై నడిపించి, విస్తృత ప్రచారం చేయాలన్నారు. కాటం సంజీవ్, ముస్త్యాల తేజ అనే ఇద్దరు నాయకులు మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సీతక్కకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ జనగామ, చేర్యాల మున్సిపాల్టీపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని హామీ ఇచ్చారు.

## ధన్ ధాన్య యోజన లక్ష్యాలను సాధించాలి

కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ రిషికాంత్




**ప్రజాపక్షం/జనగామ :** ప్రధాన్‌మంత్రి ధన్ ధాన్య యోజన లక్ష్యాలను సాధించాలని కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ పథకం టెక్నికల్ ఆఫీసర్ రిషికాంత్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తోకలిసి కలెక్టరేట్‌లో ధన్‌ధాన్య యోజనపై సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా రిషికాంత్ మాట్లాడుతూ ధన్‌ధాన్య యోజనలో ఆరు సంవత్సరాల కార్యాచరణపై గ్రామీణ స్థాయిలో వివరించాలన్నారు. లక్ష్యాల సాధన కోసం సమీక్షలు చేయాలని, పథకంలో నిర్దేశించిన లక్ష్యాలు పంటల ఉత్పాదకత, సుస్థిర వ్యవసాయం, రైతులకు సులభ రుణాలు, నీటి యాజమాన్యం, వ్యవసాయ రంగంలోకి సాంకేతికత వంటి వాటిపై వివరించారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత అభివృద్ధి గురించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పశు సంవర్ధక శాఖ, మత్స్య, మార్కెటింగ్, సహకార విభాగం, భూగర్భ జలాలు, నాబార్డు ఎజిఎం, లీడ్ బ్యాంక్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు మండలాల్లో క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా నర్మెట మండలంలో ఆయిల్‌ఫామ్ సందర్శించారు. పంట సాగు తీరు, ఉత్పత్తి, మార్కెటింగ్, సౌకర్యాల గురించి రైతుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు మల్లయ్య అయిల్ ఫామ్ క్షేత్రంలో రైతులతో ముఖాముఖి చర్చలు జరిపారు.



## అగ్రంపహాడ్ జాతర ప్రాధాన్యత పెంచే విధంగా చర్యలు చేపట్టాలి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి,జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** మినీ మేడారంగా ప్రసిద్ధి చెందిన అగ్రంపహాడ్ జాతర ప్రాధాన్యతను పెంచే విధంగా ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు పూర్తిచేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రం పహాడ్ జాతర ప్రాంగణంలో అగ్రంపహాడ్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ లు సమీక్షించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఇప్పటివరకు చేపట్టిన పలు అభివృద్ధి పనులు, ఏర్పాట్లను ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ తో కలిసి దేవాదాయ, రెవెన్యూ, విద్యుత్తు, వైద్య పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, పోలీస్ శాఖల తోపాటు ఎక్సైజ్, అగ్నిమాపక, సాగునీటిపారుదల, మత్స్యశాఖ అధికారులతో శాఖల వారీగా పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగేశ్వర రావు, పరకాల ఆర్డిఓ డాక్టర్ కన్నం నారాయణ, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, పరకాల ఎసిపి సతీష్ బాబు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈ ఆత్మారాం, సాగునీటిపారుదల శాఖ ఈఈ సునీత, ఆత్మకూర్ తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, అగ్రం పహాడ్, అక్కంపేట సర్పంచులు మహేందర్, సాంబయ్య, ఇతర శాఖల శాఖ అధికారులు, సమ్మక్క సారలమ్మ పూజారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## సర్పంచ్‌లు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ :** పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచులు తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలోని టిటిడిసిలో ఉన్న విస్తరణ శిక్షణ కేంద్రం (ఎక్స్టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ ఈటి సి)లో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు అధికారాలు, విధులు, బాధ్యతలు, పరిమితులపై ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈనెల 19 నుండి 23వ తేదీ వరకు జిల్లాలోని ఐదు మండలాలైన భీమదేవరపల్లి, కమలాపూర్, నడికూడ, ఆత్మకూరు, శాయంపేట మండలాలకు చెందిన 103 మంది సర్పంచులకు గ్రామ పంచాయతీల నిర్వహణలో సర్పంచుల విధులు, బాధ్యతలు, తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం రెండో రోజు కొనసాగగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్న సర్పంచ్ లతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, ఈటీసీ ప్రిన్సిపల్ కౌసల్య దేవి, డిఎల్పీవోలు రవిబాబు, గంగా భవాని, ఎంపిడిఒలు రామకృష్ణ, అనిల్ కుమార్, ఎంపిఒలు రంగా చారి,చేతన్ కుమార్, రంజిత్, యోగితా, మార్గవి, ఐఇసి కో ఆర్డినేటర్ సంపత్ కుమార్, తదితరులతో పాటు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట సమగ్రాభివృద్ధే ప్రధాన లక్ష్యం

రూ.15 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్య శారదా దేవి



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** వర్ధన్నపేట పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు తెలిపారు. పట్టణంలోని సి.సి. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా వంటి ప్రాథమిక సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు.వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు రూ.15 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సి.సి. రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులకు మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు అన్ని విధాలా మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన జీవిత లక్ష్యమని తెలిపారు. పట్టణ పరిధిలో సి.సి. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, విద్యుత్ సదుపాయాలు వంటి ప్రాథమిక అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15 కోట్ల నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో వినియోగిస్తామని స్పష్టం చేశారు. చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే, పనుల్లో నిర్లక్ష్యం, అవకతవకలు సహించబోమని హెచ్చరించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి ప్రజలకు త్వరగా ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి వర్ధన్నపేటను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నేనీ రవీందర్ రావు, టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, టౌన్ అధ్యక్షుడు మైస సురేష్, అనిమిరెడ్డి కృష్ణారెడ్డి తో పాటు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుకు 100 పడకల ఆసుపత్రి సాధన సమితి ఘన సన్మానం**

వర్ధన్నపేట పట్టణంలో 100 పడకల ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కె.ఆర్. నాగరాజును 'వంద పడకల ఆసుపత్రి సాధన సమితి' సభ్యులు గజమాలతో ఘనంగా సన్మానించారు.తొలుత ఎమ్మెల్యే నాగరాజు సాధన సమితి సభ్యులతో కలిసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన ఆశయ సాధనతో ముందుకు వెళ్లాలన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం భవిష్యత్తులో కూడా తాము ఎల్లప్పుడూ సహకరిస్తూ ముందుంటామని 'వంద పడకల ఆసుపత్రి సాధన సమితి' సభ్యులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.




## ప్లాస్టిక్ వాడకం తగ్గించి.. ప్రకృతిని రక్షించాలి

ఎమ్మెల్యే మాధవరెడ్డి

**ప్రజాపక్షం/నర్సంపేట :** ఆసియా ఖండంలో అతిపెద్ద గిరిజన జాతరైనా మేడారం జాతరలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి.. ప్రకృతిని రక్షించాలి. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్‌కార్యాలయంలో ఏఎస్ఆర్ సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్, ఎమ్మెల్యే మాధవరెడ్డిలు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే మేడారం జాతర లో ప్లాస్టిక్ వస్తువులను వాడకుండా, మీ ఆరోగ్యాన్ని రక్షించుకుంటూ గాలి, నీరు, భూమిని కలుషితం చేయకుండా పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత మేడారం జాతరకు వెళ్ళే ప్రతి భక్తుడిపై ఉందన్నారు. జాతరకు వెళ్లే భక్తులు ప్లాస్టిక్ రహిత వస్తువులు స్టీల్ ప్లేట్స్, గ్లాస్, బాటిల్స్, మట్టి పాత్రలు, గుడ్డ సంచులు వాడుతూ పర్యావరణ పరిరక్షించాలన్నారు. ఈకార్యక్రమంలో స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, గండి గిరి, సంస్థ సభ్యులు తంగెళ్ల రవికాంత్, రాముసేవక్, నాగుర్లపల్లె మాజీ సర్పంచ్ రాజహంస, లక్షణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలపై అండగా ఉంటా

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/కాజీపేట :** పెన్షనర్ల సమస్యలపై అండగా ఉంటానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.కాజీపేట రైల్వే సంఘ్ కార్యాలయంలో పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కాజీపేట సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే నాయిని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం సంఘం తరపున విడుదల చేసిన పాకెట్ డైరీలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, పెన్షనర్లు సమాజానికి అందించిన సేవలు ఎనలేనివని, వారి సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా విశ్రాంత ఉద్యోగుల యోగక్షేమాల కోసం మాట్లాడుకునేందుకు భవన ఏర్పాటుకు సంబంధించి జిల్లా కలెక్టర్ గారి తో మాట్లాడి తప్పకుండా స్థల కేటాయింపు చేయిస్తానని తెలిపారు.భవిష్యత్తులో కూడా పెన్షనర్లకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

**కేసముద్రం/ప్రజాపక్షం :** కేసముద్రం మున్సిపల్ పరిధిలోని కేసముద్రం విలేజ్‌కు వచ్చిన 5 వార్డులకు కౌన్సిలర్‌గా పోటీ చేయనున్న కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకోరుతూ మంగళవారం కేసముద్రం విలేజ్ గ్రామంలో కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు పోలేపల్లి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ ఓబిసి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మేకల వీరన్న యాదవ్‌ల అధ్యక్షతన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనాన్ని వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ బిఫారం ఇచ్చిన అభ్యర్థులను తప్పకుండా గెలిపించుకోవాలని, మున్సిపల్ కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించాలని ప్రజలను కోరారు. సంకెపల్లి నారాయణ రెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, నీలం దుర్గేష్, కీర్తి సురేందర్, తోట వెంకన్న, చిట్ల రవి, చిట్ల సంపత్, చిల్లంచర్ల సతీష్, బైరు వెంకన్న గౌడ్, మాసాడి శ్రీనువాస్, కత్తెరసాల శ్రీనివాస్, సుభాష్‌రెడ్డి, అధిక సంఖ్యలలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 'యూత్ ఐడియాథాన్'లో..

## డిపిఎస్ వరంగల్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/కాజీపేట :** పెండ్యాలలోని డిపిఎస్ వరంగల్ సిబిఎస్‌ఇ పాఠశాల విద్యార్థులు ఢిల్లీ ఐఐటిలో థింక్ స్టార్టప్, సిబిఎస్ఇలు సంయుక్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక యూత్ ఐడియాథాన్ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించి, పాఠశాలకు గర్వకారణంగా నిలిచారని పాఠశాల చైర్మన్ రవి కిరణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి.పి.ఎస్ వరంగల్ విద్యార్థులు మేధా పెండ్యాల, జోయా తహ్మీనాలు పాల్గొన్నారు. అధ్యాపకుడు కాసిపేట మనోజ్ రాజ్ సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో విద్యార్థులు, రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 'ఫామ్ లింక్' అనే యాప్‌ను అభివృద్ధి చేశారు. కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత ఈ యాప్ ద్వారా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సులభంగా మార్కెటింగ్ చేసుకునే అవకాశం లభిస్తుంది. రైతులు నేరుగా మార్కెట్లతో అనుసంధానం కావడం, సరైన ధరలు పొందడం వంటి అంశాల్లో ఈ యాప్ కీలకపాత్ర పోషిస్తుందని విద్యార్థులు వివరించారు. విద్యార్థులు తమ వినూత్న ఆలోచనతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు. ఈ ఆలోచన దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు, నిపుణుల నుంచి విశేష ప్రశంసలు అందుకుంది. ఆధునిక సాంకేతికతను వ్యవసాయరంగ అభివృద్ధికి వినియోగించే దిశగా ఈ ప్రాజెక్ట్ ఆదర్శంగా నిలిచిందని వారు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వి.రవి కిరణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఇన్నారెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులోనూ సమాజానికి ఉపయోగపడే మరిన్ని వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని ఆకాంక్షించారు.



## సిపిఐలో పలువురి చేరిక

కండువాలు కప్పిన రావులపల్లి రవి

ప్రజాపక్షం/భద్రాచలం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)లో పలువురు చేరారు. ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్ మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారికి కండువాలు కప్పి సిపిఐ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వందేళ్ల సిపిఐలో చేరేందుకు యువత ఉత్సాహం చూపుడటం అభినందనీయం అన్నారు. పార్టీలో చేరిన వారు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని, ఉద్యమాల నిర్వహించేందుకు ముందుకు వచ్చే వారికి పార్టీ అండదండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదల దరిచేరేందుకు కమ్యూనిస్టులు పాటుపడాలని, అప్పుడే ఎర్రజెండా కింద పనిచేసిన సంతృప్తి దక్కుతుందని చెప్పారు. ఏఐటియుసి పట్టణ కార్యదర్శి కంభంపాటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో కాటా సత్యం, మడూర్, సిహెచ్ రిషి, భీమల నరేష్, పిడియాల మధు, రేసు సబిత, రాగుల జ్యోతి పార్టీలో చేరగా సిపిఐ పట్టణ కన్వీనర్ మారెడ్డి శివాజీ, ఏపూరి వెంకటేశ్వరరావు, ఎస్ఎస్ నాయుడు, కిలారు కొండబాబు, వంక మహేష్, త్రిమూర్తులు, రామారావు, వెంకన్న, మహేష్, బాలరాజు, ఉమాదేవి పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి : ఉపాధికల్పనాధికారి



ప్రజాపక్షం/ కొత్తగూడెం : త్వరలో జరగనున్న రెండవ సాధారణ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ అన్నారు. ఎన్నికల సజావుగా,పారదర్శకంగా నిర్వహించేందుకు గాను ఆర్ఓలు, ఏఆర్ఓలకు మంగళవారం ఐడిఓసిలో కార్యాలయ సమావేశ మందిరంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నోటీసులు జారీ నుంచి ప్రారంభించి నామినేషన్ల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, పోటీ చేసే అభ్యర్థుల తుదిజాబితా ప్రకటించడం, ఎన్నికల గుర్తుల కేటాయింపు విధానం, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ, పోలింగ్ స్టేషన్ల పరిశీలన, పోలింగ్ మెటీరియల్ పంపిణీ, ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించడం, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. ఎన్నికల నిర్వహణలో పూర్తి అవగాహన కలిగి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఉపయోగించే ఫారాలు పూర్తి, జాగ్రత్తలు తదితర అంశాలపై ఏఎండిఓ శ్రీనివాస్ వివరించారు. బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ బాక్సుల ద్వారా జరిగే ఈ ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాతతో పాటు సుమారు 200 మంది ఆర్ఓలు, ఏఆర్ఓలు పాల్గొన్నారు.

## గిరిజన పిల్లల భవిష్యత్‌కు విద్య ఏకైక సాధనం : కలెక్టర్



ప్రజాపక్షం/కొత్తగూడెం: విద్య గిరిజన పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దే ఏకైక సాధనమని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం జిల్లాలోని రామవరం మండలంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో సౌకర్యాలను పరిశీలించారు, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల పోటీ ప్రపంచంలో ముందుకు సాగేందుకు అవసరమైన అవకాశాలను అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పాఠశాల క్రీడామైదానం అభివృద్ధి, క్రీడా పరికరాల లభ్యత, విద్యార్థుల శారీరక ఆరోగ్యం, క్రీడల ద్వారా క్రమశిక్షణ పెంపొందించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో మౌళిక సదుపాయాల కల్పన, మరమ్మతులకు కావాల్సిన పనులు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, బోధన, బోధనేతర సిబ్బంది, సంబంధిత అధికారులు ఉన్నారు.

## దివ్యాంగులను అక్కున చేర్చుకుని అంగవైకల్యాన్ని దూరం చేయాలి



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం: మనిషిజీవితంలో అంగవైకల్యం కేవలం శరీరానికి తప్పా వారి జీవన విధానానికి అడ్డం కాదని ప్రతి మనిషి దివ్యాంగులను అక్కున చేర్చుకుని వారి అంగవైకల్యాన్ని దూరం చేయాలని ఏకలవ్య వెల్ఫేర్ డెవలప్మెంట్ సొసైటీ కామల్ల సునీల్ అన్నారు. మండల పరిధిలోని పిండిప్రోలు స్కూల్‌లో జరిగిన దివ్యాంగుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల జీవన విధానంపై ప్రతిఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని, వారిని బాల్య వయస్సులోనే గుర్తించి తగిన మానసిక చికిత్స అందించినట్లయితే మంచిగా ఉన్న పిల్లలు లాగానే అంగవైకల్యం దూరం అవుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నాయని, ప్రభుత్వాల ద్వారా అందించే వారి రోజువారీ జీవనం కోసం అందించే యంత్రాలను సద్వినియోగం చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కామల్ల సువర్ణ, పంచాయతీ కార్యదర్శి టి.రాజు, మానసిక వికలాంగుల స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ప్రేమ్‌కుమార్, ఇందిరా దేవి కాంతి ప్రీ ప్రైమరి స్కూల్ ఇన్స్పెక్టర్ మేకల భద్రకాళి, అంగన్వాడీ కార్యకర్తలు శేకమ్మ, విజయరాణి, మాధురి, కవిత, ఆశావర్కర్లు జ్యోతి, సుజాత, మానసిక పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## టెట్ పరీక్ష ప్రశాంతం

ప్రజాపక్షం/కొత్తగూడెం: టిజి టెట్ 2026 పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని వేపలగడ్డలో గల అబ్దుల్ కలామ్ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ఈ పరీక్షకు మొత్తం 100 మంది హాజరు కావాల్సి ఉండగా 91 మంది మాత్రమే పరీక్ష రాశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో చోటు చేసుకోకుండా పరీక్ష ప్రశాంతమైన వాతావరణంలో సాగిందని పాటిల్ చెప్పారు.

# ఏడాదిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి

మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు పంపిణీ

డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క



ప్రజాపక్షం/మధిర : స్వయం సహాయక సంఘాల మహిళలకే కాకుండా అర్హులైన మహిళలందరికీ ఇందిరమ్మ చీరల పంపిణీ జరుగుతుందని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క అన్నారు. మధిర మున్సిపాల్టీ పరిధిలోని జిలుగుమాడు డివిజన్‌లో చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఒక్క రోజే మధిర మున్సిపాల్టీ పరిధిలో 10,277 చీరల పంపిణీ జరుగుతుందని తెలిపారు మధిర మున్సిపాల్టీ పరిధిలో ఐదు వేల మంది స్వయం సహాయక సభ్యులు ఉన్నారని, మరో 5వేల మంది చేరాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్వయం సహాయ సంఘాల్లో సభ్యులుగా చేరితే వడ్డీ లేని రుణాలతో పాటు అనేక ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు ఏడాది కాలంలో పూర్తి అవుతుందని, శుభ్రతతో కూడిన నగరంగా మధిరను మార్చడమే తన లక్ష్యమన్నారు. కొత్త ఇల్లు కట్టుకునేటప్పుడు ఇసుక, కంకర సిమెంట్ వస్తువులు పనులతో వాతావరణం గందరగోళంగా ఉంటుందని, ఇల్లు పూర్తయిన తర్వాత హాయిగా ఆందంగా అనిపిస్తుందని, అదేవిధంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు క్రమంలో కొంత ఇబ్బంది కలుగుతుందని అందరూ గుర్తించాలని తెలిపారు. ఇళ్లలోని మరుగుదొడ్ల నుంచి వచ్చే కలుషిత నీరు పైపుల ద్వారా బయటికి పంపించి ట్రీట్మెంట్ చేస్తారని, ఈ క్రమంలో రోడ్లు పగలగొట్టి మధ్యలో పైపులు వేయడం తప్పదని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు పూర్తయిన తర్వాత మధిర పట్టణం మొత్తం సిసి రోడ్లు నిర్మాణం చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

### యూకే నుంచి వచ్చి సేవలందించడం గొప్ప విషయం: భట్టి

లండన్ నుంచి ప్రత్యేక వైద్యులు వచ్చి ఉచితంగా వైద్యం అందించడం హర్షించదగ్గ విషయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం మధిరలో యూకే స్వచ్ఛంద సంస్థ, కృష్ణంరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కృష్ణంరాజు పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉచిత మెడికల్ క్యాంపు ద్వారా షుగర్ వ్యాధిగ్రస్థులు ముందే జాగ్రత్త పడే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రముఖ కథానాయకుడు కృష్ణంరాజు జన్మదినం సందర్భంగా ఉమ్మడి రాష్ట్రంలో వారి కుటుంబ సభ్యులు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. 'కృష్ణంరాజు కుమార్తె ప్రసీద చిన్ననాటి నుంచి సేవాభావంతో సేవలు అందిస్తున్నారు. అందుకు ఆమెను అభినందించాలి. సినీ నటుడు కృష్ణంరాజు కుటుంబంతో మా కుటుంబానికి మంచి స్నేహబంధం ఉంది. మధిర నియోజకవర్గంలో పేదల కోసం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని కోరగా వారు వెంటనే అంగీకరించి ఇక్కడికి వచ్చి సేవలు అందించడం అభినందనీయం' అని భట్టి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, అమ్మా ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని, కృష్ణంరాజు భార్య శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.





## అదనపు గదుల కోసం రూ.3కోట్లు నిధులు

నిధుల మంజూరి పత్రాన్ని అందించిన ఉప ముఖ్యమంత్రి

కృతజ్ఞతలు తెలిపిన కళాశాల యాజమాన్యం

ప్రజాపక్షం/వైరా: వైరాలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 18 అదనపు తరగతులు గదుల నిర్మాణానికి కావాల్సిన రూ.3కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యోగితే రానా ఉత్తర్వులను విడుదల చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వైరాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశబూల ప్రిన్సిపాల్ ఎల్.నవీన జ్యోతి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల తరపు నుండి ఉప ముఖ్యమంత్రి, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్కి, ఇతర పెద్దలకు కళాశాల నుంచి ధన్యవాదాలు తెలియజేశారు.

## యువకుడిపై ఎస్ఐ దాష్టీకం

విచక్షణారహితంగా కొట్టడంతో

మూర్చతో కుప్ప కూలిన యువకుడు

ఆసుపత్రికి వచ్చి పరామర్శించిన సిపిఐ నేతలు

చేయి చేసుకోవడం అవాస్తవం: ఎస్ఐ హరికృష్ణ



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఓ కాంగ్రెస్ నేత ప్రోద్బలంతో ఓ ఎస్ఐ విచక్షణారహితంగా చేయి చేసుకోవడంతో యువకుడు మూర్చతో ఆసుపత్రి పాలైన ఘటన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మంరూరల్ మండలం దారేడు గ్రామానికి చెందిన సిపిఐ మాజీ సర్పంచ్ బత్తిని సీతారాములు, కుమారుడు కిరణ్‌కు ఇంటి పక్కన ఉన్న కుటుంబంతో ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఆ కుటుంబం వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చిన ఎస్ఐ హరికృష్ణ, మరి కొంతమంది కానిస్టేబుల్స్‌తో కలిసి విచక్షణారహితంగా చేయి చేసుకున్నారు. దీంతో భయపడిపోయిన సదరు యువకుడు మూర్చ(ఫిడ్స్) వచ్చి కింద పడిపోయాడు. స్టేషన్ బైట ఉన్న తల్లిదండ్రులకు విషయం తెలియజేయడంతో వారు హుటాహూటిన ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. కాగా సదరు యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఐసియులో పర్యవేక్షణలో ఉంచడం జరిగిందన్నారు. నా కుమారుడిపై పోలీసులు దాడి చేయడంలో మా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వెంకట్‌రెడ్డి ప్రమేయం ఉన్నట్లు బత్తిని సీతారాములు ఆరోపిస్తున్నాడు.

**సిపిఐ నేతల పరామర్శ...**

విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుచ్చకాయల కమలాకర్ సిపిఐ వందేళ్ల వేడుకలోని సెమినార్ నుంచి ఆసుపత్రికి వెళ్లి యువకుడిని పరామర్శించారు. అధైర్యపడవద్దని యువకుడికి ధైర్యం చెప్పారు. అలాగే సీతారాములును ధైర్యంగా ఉండాలంటూ ఓదార్చారు. యువకుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. న్యాయం జరిగిలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని భరోసాను కల్పించారు.

**చేయిచేసుకోలేదు : ఎస్ఐ హరికృష్ణ**

తమ ఇంటి పక్కన చుట్టమైన యువకుడిపై కిరణ్ గొడవ పెట్టుకుని, దాడి చేసి గాయపరిచాడు. ఈ నేపథ్యంలో అతనిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చాము. గొడవలేందుకు అని కౌన్సిలింగ్ ఇస్తుండగా.. ఫిడ్స్ వచ్చి పడిపోవడంతో ఆసుపత్రిలో చేర్పించాము. అతనికి అనారోగ్య సమస్య ఉన్నట్లు తండ్రే తమతో స్వయంగా తెలిపాడు. సదరు యువకుడు గతంలోనూ ఇటువంటి ఘర్షణలలో కేసుల్లో ఉన్నట్లు ఎస్ఐ తెలిపాడు.



## అఖిల భారత పులుల అంచనా ప్రారంభం

జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మంజిల్లాలో అఖిల భారత పులుల అంచనా (సర్వే) ప్రారంభించినట్లు జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ తెలిపారు. భారత ప్రభుత్వ ఆదేశాలు, జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా ఖమ్మంజిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో అఖిల భారత పులుల అంచనా (సర్వే) మంగళవారం జిల్లాలో ప్రారంభమైందని సిద్దార్థ్ విక్రమ్ సింగ్ తెలిపారు. అటవీ సిబ్బంది, వాలంటీర్ల ఆధ్వర్యంలో నిర్దారిత ట్రాన్సెక్ట్ లైన్ల ద్వారా అడవుల్లో సంచరిస్తూ సర్వే నిర్వహిస్తారని ఆయన తెలిపారు. పులుల పాద ముద్రలు, విసర్జితాలు, చెట్లపై ఉండే గోళ్ల గుర్తులు వంటి సంకేతాలను శాస్త్రీయ పద్దతుల్లో సేకరిస్తారని ఆయన తెలిపారు. గణనలో పారదర్శకత, ఖచ్చితత్వం కోసం ఎం స్ట్రైప్స్ మొబైల్ యాప్‌ను ఉపయోగిస్తూ దీని ద్వారా జియో ట్యాంగింగ్‌తో కూడిన సమాచారాన్ని రియల్ టైమ్‌లో కేంద్ర సర్వర్‌కు అనుసంధానించడం జరుగుతుందన్నారు. ఈ సర్వే కేవలం పులులకు మాత్రమే పరిమితం కాకుండా అడవిలోని ఎర జీవుల సాంద్రత, పర్యావరణ స్థితిగతులు ఇతర వన్యప్రాణుల జీవ వైవిధ్య గణాంకాలను కూడా క్రోడీకరిస్తుందన్నారు. వన్య ప్రాణుల సంరక్షణ వ్యూహాల రూపకల్పనకు ఈ సర్వే డేటా అత్యంత కీలకమన్నారు. జిల్లాలో వన్య ప్రాణుల కదలికలు, వాటి ఆవాసాల భద్రతను బలోపేతం చేయడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సర్వేలో పాల్గొంటున్న సిబ్బందికి, స్వచ్ఛంద సేవకులకు అవసరమైన అన్ని రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ తెలిపారు.

# రోడ్డు భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ప్రజాపక్షం/వైరా: వైరా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రారంభించారు. వైరా ఎస్సై పుప్పాల రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని ప్రయాణించండి జీవించండి అని నినాదంతో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ అందరూ పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు జరగవని ఆయన అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఆయన తెలిపారు. ప్రమాదాలు నివారిస్తే ప్రతి కుటుంబం ఆనందంగా ఉంటుందని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పుప్పాల రామారావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి కార్యదర్శి కట్ల రంగన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, మాజీ మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, రాంపూడి రోశయ్య, పొదిల హరినాథ్, పాలేటి నర్సింహారావు, కన్నెగంటి నగేష్, డాక్టర్ కాపా మురళీకృష్ణ, గరిడేపల్లి కిషోర్, పమ్మి అశోక్, దార్న రాజశేఖర్, చెరుకూరి కిరణ్, దాసరి దానియేలు, మిట్టపల్లి నాగి, బిడికె.రత్నం, పెద్దప్రోలు లక్ష్మయ్య, మాజీ కౌన్సిలర్ బత్తులగీత, గుడిపూడిసురేష్, వీరంశెట్టి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.



## రీ సర్వేకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్‌కుమార్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాలలో రీ సర్వేకు ఏర్పాట్లు పూర్తి చేయాలని సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిసిఎల్ఎ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), సర్వే ల్యాండ్ అధికారులతో భూ భారతి గ్రామాల రీ సర్వేపై సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్‌కుమార్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లాల వారీగా రీ సర్వేకు ఎంపికైన గ్రామాల్లో ప్రక్రియ చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. లైసెన్స్డ్ సర్వేయర్లను ఆయా మండలాలకు కేటాయించాలని, రెండవ గెజిట్ నోటిఫికేషన్ జారీ అనంతరం పూర్తి శాస్త్రీయ పద్దతిలో సర్వే చేపట్టాలని, 22ఎ జాబితాను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలకు ఇప్పటి వరకు 3,500 మంది లైసెన్స్డ్ సర్వేయర్లను కేటాయించినట్లు ఈనెలలో మరో 2వేల మందిని కేటాయించనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని జిల్లా కలెక్టర్ చాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఎడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎం.రాజేందర్, ఖమ్మం ఆర్డివో జి.నర్సింహారావు, కలెక్టరేట్ ఎవో కె.శ్రీనివాసరావు, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం తహసీల్దార్లు సైదులు, శ్వేతలు పాల్గొన్నారు.

## మేడారం జాతరకు ఖమ్మం రీజియన్‌లో 244 బస్సులు

ఆర్టిసి రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : అతిపెద్ద గిరిజన జాతరైన సమ్మక్క సారలమ్మ (మేడారం) జాతరకు ప్రయాణికులకు ఎటువంటి రవాణా ఇబ్బందులు కలుగకుండా ఖమ్మం రీజియన్ పరిధిలో 244 బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్ మంగళవారం తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు తగిన ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. 2024 సంవత్సరంలో జరిగిన మేడారం జాతర అనుభవాలను పరిగణలోకి తీసుకుని ఈ ఏడాది జాతరకు అవసరమైన ప్రణాళికలు రూపొందించామని ఆర్ఎం తెలిపారు. 2024 మేడారం జాతరలో మొత్తం 2,36,909 మంది భక్తులు ఆర్టిసి సేవలను సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని దృష్టిలో ఉంచుకుని అధిక సంఖ్యలో భక్తులు ఆర్టిసి సేవలను ఉపయోగించుకునే అవకాశం ఉన్నందున ఈ ఏడాది జాతరకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తగు చర్యలు తీసుకోనున్నట్లు అందుకు అవసరమైన ఆదేశాలను డిపో మేనేజర్లకు, సిబ్బందికి అందించడం జరిగిందన్నారు. ఈ ఏడాది మేడారం జాతరకు ఖమ్మం రీజినల్ పరిధిలో 10 జాతర పాయింట్ల నుండి 244 బస్సులను నడపనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు ఈ నెల 25 నుంచి అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈనెల 27 మంగళవారం నుంచి ఈనెల 31 శనివారం వరకు పూర్తి స్థాయిలో బస్సులు నడుస్తాయని తెలిపారు. ఖమ్మం డిపో తరుపున ఖమ్మం పాయింట్ నుంచి 10 బస్సులు, ఇల్లందు పాయింట్ నుంచి 40 బస్సులు, సత్తుపల్లి డిపో తరుపున ఏటూరు నాగారం పాయింట్ నుంచి 17 బస్సులు, చర్ల పాయింట్ నుంచి మూడు బస్సులు, వెంకటాపురం పాయింట్ నుంచి ఆరు బస్సులను నడపనున్నట్లు తెలిపారు. భద్రాచలం డిపో తరుపున భద్రాచలం పాయింట్ నుంచి 21 బస్సులు, పాల్వంచ పాయింట్ నుంచి 15 బస్సులు, కొత్తగూడెం డిపో తరుపున కొత్తగూడెం పాయింట్ నుంచి 110 బస్సులు, మణుగూరు డిపో తరుపున మణుగూరు పాయింట్ నుంచి 16 బస్సులు, మంగపేట పాయింట్ నుంచి ఐదు బస్సులు మొత్తం 244 బస్సులు మేడారం జాతరకు నడపబడతాయన్నారు.

# మానవుల ఆలోచన చెడితే... జీవితమంతా విషమే

రైతులకు, భూమికి, సమాజం క్షేమం కోసమే యాత్ర సిద్ధార్థ యోగ విద్యాలయం వద్ద యాత్ర ప్రారంభించిన చిన్నజీయర్



ప్రజాపక్షం/నేలకొండపల్లి : అందరికి ఆరోగ్యం.. భూమికి, రైతులకు, సమాజం కోసమే సుఫలా యాత్ర ను చేపట్టినట్లు చిన్నజీయర్ పేర్కొన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలోని సిద్దార్థ యోగ విద్యాలయంలో మంగళవారం పాదయాత్రను ప్రారంభించారు. తొలుత జరిగిన సభలో ఆయన మాట్లాడారు.. రామచంద్రుడు అనుగ్రహంతోనే నేలకొండపల్లి నుంచే సఫలా యాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో ఎలాంటి రాజకీయాలు, స్వప్రయోజనాలు లేవన్నారు. సుఫలాఅయినా భూమిని నిస్ఫలంగా చేసే ప్రయత్నాన్ని మనమే మార్చుకోవాలని అన్నారు. మనందరిని పోషించే భూమి నిరెండు, మూడు పంటలు పండిస్తే తాగటానికి కూడ నీరు దొరకని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అత్యాస ఉంటే సమూల నాశనమే అన్నారు. మానవులు ఆలోచన చెడితే జీవితమంతా విషమే అన్నారు. మనిషికి కావాల్సిన వాటిని అందిస్తున్న ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గాలిని, నీటిని, నేలను మనిషి పాడుచేస్తున్నాడన్నారు. యోగ విద్యాలయం నుంచి రామదాసు మందిరం వరకు పాదయాత్ర సిద్ధార యోగ విద్యాలయం నుంచి రామదాసు ధ్యాన మందిరం వరకుపాదయాత్ర, సిద్ధార యోగ విద్యాలయం నుంచి రామదాసు ధ్యాన మందిరం వరకు సుఫలా యాత్రను నిర్వహించారు. ఆయన వెంట పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. రామదాసు మందిరంలో ఘనంగా స్వాగతం పలికారు. మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామదాసు జయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. రామదాసు కాంస్య విగ్రహాంకు నివాళులర్పించారు. అనంతరం ఆడిటోరియంలో ప్రసంగించారు. 100 ధాన్య రకాలను ప్రదర్శించారు. సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, పండ్ల ను ప్రదర్శించారు. గోవుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ కె.నారాయణ, ఆర్టీఐ కమీషనర్ పీ.వీ.శ్రీనివాస్ నల్లమల్ల వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.వై.రామచంద్రరావు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, వ్యవసాయ ప్రేమికులు తదితరులు పాల్గొన్నారు.

స్వదేశంలో పొట్టి ప్రపంచకప్ ముందు భారత జట్టు చిట్టచివరి సిరీస్ ఆడనుంది. వరుసగా రెండోసారి విజేతగా నిలవాలనుకుంటున్న టీమిండియా అన్ని అస్త్రాలను సరి చూసుకోనుంది. న్యూజిలాండ్‌తో ఐదు టి–20ల సిరీస్ ఆత్మవిశ్వాసాన్ని పెంచుకునేందుకు చాలామంచి అవకాశం. అయితే.. ప్రతిభావంతులకు కొదవలేకున్నా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్ గురించే అందరి ఆందోళనంతా. ఇటీవల వరుసగా తేలిపోతున్న మిస్టర్ 360 మెగాటోర్నీ ముందు టచ్‌లోకి వస్తాడా? తిలక్ వర్మ స్థానంలో ఎవరు ఆడుతారు? అనేది ఉత్కంఠ రేపుతోంది. పొట్టి క్రికెట్లో వరుస సిరీస్ విజయాలతో భారత జట్టు తిరుగులేని శక్తిగా అవతరించింది. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియా

## కెప్టెన్ ఫామ్ అందుకునేనా..
## తిలక్‌వర్మ స్థానంలో ఆడేది ఎవరు?




గడ్డపై, స్వదేశంలో దక్షిణాఫ్రికాపై జయభేరి మోగించిన టీమిండియా ఈసారి న్యూజిలాండ్ చెక్ పెట్టాలనుకుంటోంది. వన్డే సిరీస్‌లో సంచలన ఆటతో విజేతగా నిలిచిన బ్లాక్యాప్స్ను పొట్టి ఫార్మాట్లో చావుదెబ్బ కొట్టాలని సూర్యకుమార్ సేన పట్టుదలతో ఉంది. జనవరి 21న బుధవారం నాగపూర్లో టి–20 సిరీస్ షురూ కానుంది. స్క్వాడ్లో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ , హార్దిక్ పాండ్యా.. రింకూ సింగ్ వంటి బిగ్ హిట్టర్లు, మ్యాచ్ విన్నర్లు చాలామందే. కానీ, సారథి సూర్య ఆటపైనే సందేహాలున్నాయి. రెండేళ్లక్రితం టి–20 ప్రపంచకప్ తర్వాత నుంచి అతడి గణాంకాలు దారుణంగా పడిపోయాయి. 22 ఇన్నింగ్స్‌లో 12.84 సగటుతో 244 రన్స్ చేశాడతే. శాంసన్ మూడు సెంచరీలతో.. తానెంత ప్రమాదకరమో ఇప్పటికే చాటుకున్నాడు.

**ఇషాన్‌కే ఛాన్స్?...** గాయంతో సిరీస్‌కు దూరమైన తిలక్ వర్మ స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌ను ఆడిస్తారా? ఇషాన్ కిషన్‌ను తీసుకుంటారా? అనేది ఆసక్తి రేపుతోంది. మూడేళ్ల క్రితం డిసెంబర్‌లో చివరి అంతర్జాతీయ టి–20 మ్యాచ్ ఆడిన అయ్యర్‌కు ఐపిఎల్ ఫైనలే ఫ్రాంచైజీ క్రికెట్‌లో ఆఖరిది.

**అదే ఇషాన్ కిషన్ విషయానికొస్తే..** ఇటీవలే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ సారథిగా ఇరగదీశాడు. సంచలన ఇన్నింగ్స్‌తో జట్టును విజేతగా నిలిపిన ఈ చిచ్చరపిడుగు.. సెలెక్టర్ల దృష్టిలో పడి ప్రపంచకప్ బెర్తు సైతం దక్కించుకున్నాడు. కాబట్టి.. ఈ లెఫ్ట్ హ్యాండర్‌కే తొలి టి–20లో అవకాశం దక్కుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఇద్దరు యువకెరటాల అరంగేట్రం..!

## టాస్ గెలిచిన ఢిల్లీ..




మహిళల ప్రీమియర్ లీగ్‌లో మరో బిగ్ ఫైట్‌కు వేళైంది. ప్లే ఆఫ్ రేసులో వెనకబడిన ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్‌తో తలపడుతోంది. గత మ్యాచ్‌లో ముంబై ధాటికి చేతులెత్తేసిన ఢిల్లీ బ్యాటర్లు ఈసారి పంజా విసరాలనుకుంటున్నారు. ఐదు విజయాలతో ఆర్‌సిబి ప్లేఆఫ్‌కు దూసుకెళ్లినందున ముంబైకి కూడా ఈ మ్యాచ్ చాలా కీలకం. టాస్ గెలిచిన ఢిల్లీ సారథి జెమీమా రోడ్రిగ్స్ బౌలింగ్ తీసుకుంది. ఒకేఒక విజయంతో అట్టడుగున నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ కచ్చితంగా గెలిస్తేనే రేసులో ఉంటుంది. కాబట్టి.. జెమీమా రోడ్రిగ్స్ బృందం సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమవుతోంది. ముంబై జట్టు ఓపెనర్ జి.కమలిని సేవల్ని కోల్పోనుంది. గాయం కారణంగా ఈ యువ ఓపెనర్ డబ్ల్యుపిఎల్ నుంచి వైదొలిగింది. ఆమె స్థానంలో స్పిన్ సంచలనం వైష్ణవీ శర్మ స్క్వాడ్లోకి వచ్చింది. ఢిల్లీ తరఫున 16ఏళ్ల దీయాయాదవ్ ఈ మ్యాచ్‌లో డబ్ల్యుపిఎల్లో అరంగేట్రం చేస్తోంది. మంబై ఇండియన్స్ వికెట్ కీపర్గా రహిలా ఫిర్దౌస్ జట్టులోకి రాగా.. వైష్ణవీ డెబ్యూట్ క్యాప్ అందుకుంది.

**ముంబై ఇండియన్స్ తుది జట్టు :** హీలీ మాథ్యూస్, సంజీవన్ సంజన, నాట్ సీవర్ బ్రంట్, అమేలియా కేర్, రహిలా ఫిర్దౌస్(వికెట్ కీపర్), హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), నికోలా కారీ, అమన్జోత్ కౌర్, పూనమ్ ఖెమ్నర్, వైష్ణవీ శర్మ, షబ్నం ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా.

**ఢిల్లీ క్యాపిటల్స్ తుది జట్టు :** షఫాలీవర్మ, లిజెల్లె లీ(వికెట్ కీపర్), లారావొల్వార్డ్ట్, జెమీమా రోడ్రిగ్స్(కెప్టెన్),దీయాయాదవ్, మరినే కాప్, నిక్కీ ప్రసాద్, లూసీహామిల్టన్, స్నేహ్‌రానా, శ్రీచరణి, నందిని శర్మ.

బంగ్లాకు మద్దతుగా టి– 20 వరల్ కప్ బహిష్కరణ..?

## పాక్ వైఖరి ఇదే




బంగ్లాదేశ్‌కు మద్దతుగా తమ జట్టు టి–20 వరల్ కప్ టోర్నీలో పాల్గొనబోదని జరుగుతున్న ప్రచారాన్ని పాకిస్తాన్ ఖండించింది. ఇదంతా అసత్య ప్రచారమేనని పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ (పీసీబీ) తేల్చిచెప్పింది. భారత్‌బంగ్లాదేశ్ మధ్య టీ20 వరల్ కప్ అంశంలో వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఇండియాలో జరగబోయే ఈ టోర్నీలో తాము పాల్గొనబోమని బంగ్లా హెచ్చరించింది. భద్రతా కారణాల రీత్యా ఇండియాకు రాలేమని, మ్యాచ్ జరిగే వేదికల్ని మరో చోటుకు మార్చాలని ఐసీసీని బంగ్లా కోరింది. దీనిపై ఇంకా నిర్ణయం వెలువడాల్సి ఉంది. ఇదే సమయంలో బంగ్లాదేశ్ కు మద్దతుగా పాకిస్తాన్ కూడా టీ20 వరల్ కప్ బహిష్కరించినట్లు కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా దీనిపై పీసీబీ స్పందించింది. తాము టోర్నీని బహిష్కరిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని పీసీబీ సభ్యులు తెలిపారు. ఈ టోర్నీకి సంబంధించి గత ఏడాది ప్రారంభంలోనే ఒప్పందం కుదిరిందని చెప్పారు. అప్పటికి ఇండియా.. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాక్ రాలేనని చెప్పిందని, దీంతో తాము కూడా టీ20 వరల్ కప్ కోసం ఇండియాలో కాకుండా శ్రీలంకలో మ్యాచులు ఆడతామని చెప్పినట్లు తెలిపారు. ముందే ఇండియాలో కాకుండా, శ్రీలంకలో మ్యాచులు నిర్వహించాలని నిర్ణయించినందున ఈ టోర్నీని తాము బహిష్కరించడం లేదన్నారు. దీంతో ఈ టోర్నీలో పాక్ పాల్గొంటుందని స్పష్టమైంది. అయితే, బంగ్లాదేశ్ పాల్గొనే విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. బంగ్లా ఆడేందుకు నిరాకరిస్తే ఆ స్థానంలో మరో జట్టును రంగంలోకి దించాలని ఐసీసీ భావిస్తోంది. ఇదే జరిగితే బంగ్లాదేశ్ కు పెద్ద ఎదురుదెబ్బే.

మహిళ

# నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు

అన్నిరంగాల్లోనూ అత్యంత వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్న నేటి ప్రపంచంలో, గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలపడాలంటే కేవలం కష్టపడటంతోనే సరిపోదు.. తమకు ఉన్న నైపుణ్యాలను గుర్తించి, వాటిని మెరుగుపరుచుకొని, కొత్త అవసరాలకు అనుగుణంగా మార్చుకోవడం అత్యంత అవసరం. వ్యవసాయం, పశుపోషణ, వంట, చేతిపనులు వంటి సంప్రదాయంగా మహిళలకు తెలిసిన పనులు. వీటిని కూడా ఆధునిక శిక్షణతో, సాంకేతిక అవగాహనతో కలిపితే లాభదాయకమైన ఉపాధులుగా మారగలవు. గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణా కేంద్రాలు, ప్రభుత్వపథకాలు, స్వచ్ఛంద సంస్థలు అందించే స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను మహిళలు సద్వినియోగం చేసుకుంటే వారి జీవితాల్లో స్థిరమైన మార్పు రావచ్చు.

వ్యవసాయం గ్రామీణ మహిళలకు ప్రధాన ఆధారం. కానీ సంప్రదాయ పద్ధతులతో సాగు చేయడం వల్ల లాభాలు తక్కువగా ఉంటాయి. విత్తనాల సరైన ఎంపిక, నేల ఆరోగ్యం, నీటి వినియోగం, పంటల వైవిధ్యీకరణ వంటి అంశాలపై శిక్షణ పొందితే దిగుబడులు పెరుగుతాయి. ఒకే పంట మీద ఆధారపడకుండా కూరగాయలు, పప్పులు, నూనెగింజలు వంటి పంటలను కలిపి సాగు చేయడం వల్ల ఆదాయం స్థిరపడుతుంది. సేంద్రియ సాగు, సహజ ఎరువులు, జీవసారాల వినియోగం నేర్చుకున్న మహిళలు తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు పొందగలుగుతారు. దీనితో పాటు పంటల నిల్వ, ప్యాకేజింగ్, ప్రాసెసింగ్ వంటి అంశాలు తెలిసినప్పుడు విలువ పెరిగిన ఉత్పత్తులను మార్కెట్‌కు అందించవచ్చు. పశుపోషణ గ్రామీణ మహిళలకు ఎంతో అనుకూలమైన ఉపాధి. ఆవులు, గేదెలు, మేకలు, కోళ్లు పెంచడం ద్వారా రోజువారీగా లేదా నెలవారీగా ఆదాయం పొందవచ్చు. పాలఉత్పత్తుల తయారీ, పెరుగు, వెన్న, నెయ్యి వంటి ఉత్పత్తులు తయారు చేయడం ద్వారా లాభం మరింత పెరుగుతుంది. సరైన మేత, జంతు ఆరోగ్యం, టీకాలు, శుభ్రత వంటి విషయాలపై శిక్షణ ఉంటే నష్టాలు తగ్గి లాభాలు పెరుగుతాయి. కోళ్ల పెంపకం, గుడ్ల ఉత్పత్తి కూడా తక్కువ పెట్టుబడితో మొదలయ్యే మంచివ్యాపారం. ఈరంగాల్లో మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా సమూహం గా పని చేస్తే పెద్ద స్థాయిలో మార్కెట్‌ను చేరుకోవచ్చు.

గ్రామీణ మహిళలకు చేతిపనులు, చేనేత, హస్తకళలు కూడా గొప్ప అవకాశాలను ఇస్తాయి. పల్లెల్లో తయారయ్యే వస్త్రాలు, అలంకరణ వస్తువులు, సంప్రదాయ కళాకృతులకు పట్టణాల్లో, విదేశాల్లో కూడా మంచి డిమాండ్ ఉంటుంది. కానీ



నాణ్యత, డిజైన్, ట్రెండ్‌లకు అనుగుణంగా ఉత్పత్తులు తయారు చేయడం నేర్చుకోవాలి. ఆధునిక డిజైన్ శిక్షణ, రంగుల వినియోగం, ఫినిషింగ్ వంటి అంశాలపై అవగాహన పెరిగితే వారి ఉత్పత్తులకు విలువ పెరుగుతుంది. చేనేత, హస్తకళల ద్వారా మహిళలు తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూనే ఆదాయం పొందగలుగుతారు. ఆహార ప్రాసెసింగ్ గ్రామీణ మహిళలకు మరొక పెద్ద అవకాశం. ఊర్లో లభించే పండ్లు, కూరగాయలు, ధాన్యాలను ఉపయోగించి జామ్‌లు, పికిల్స్, పాపడ్లు, మసాలాలు, స్నాక్స్ వంటి ఉత్పత్తులు తయారు చేయవచ్చు. ఇవి ఇంటి వద్దే ప్రారంభించగలిగే చిన్న పరిశ్రమలు. సరైన పరిశుభ్రత, ప్యాకేజింగ్, నిల్వ విధానాలు తెలిసినప్పుడు ఈ ఉత్పత్తులు ఎక్కువ కాలం నిల్వ ఉండి మార్కెట్‌లో మంచి ధరకు అమ్ముకోవచ్చు. అగరబత్తీలు, సబ్బులు, డిటర్జెంట్లు వంటి రోజువారీ వినియోగ వస్తువుల తయారీ కూడా గ్రామీణ మహిళలకు స్థిర ఆదాయాన్ని ఇస్తుంది. ఈ అన్ని నైపుణ్యాలకు శిక్షణ ఎంత ముఖ్యమో, మార్కెటింగ్ అవగాహన కూడా అంతే ముఖ్యం. మంచి ఉత్పత్తి ఉన్నా దాన్ని సరైన చోటుకు తీసుకెళ్లలేకపోతే లాభం రాదు. స్థానిక మార్కెట్లు, వారపు హాట్లు, పట్టణాల బజార్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌ల గురించి తెలుసుకోవాలి. ప్యాకేజింగ్ ఆకర్షణీయంగా ఉంటే వినియోగదారుల దృష్టి ఆకర్షించవచ్చు. నాణ్యత ప్రమాణాలు పాటించినప్పుడు గ్రామీణ ఉత్పత్తులు పట్టణ మార్కెట్లలోనూ నిలదొక్కుకుంటాయి. అంతిమంగా, నైపుణ్యాభివృద్ధి అనేది గ్రామీణ మహిళలకు కేవలం ఉద్యోగం లేదా వ్యాపారం మాత్రమే కాదు; అది ఆత్మవిశ్వాసం, స్వతంత్రత, గౌరవాన్ని ఇస్తుంది. ఒక మహిళ తన శ్రమతో సంపాదించిన ఆదాయం ఆమెను కుటుంబంలో, సమాజంలో బలమైన స్థానానికి తీసుకెళ్తుంది. ఈ విధంగా నైపుణ్యాలు గ్రామీణ మహిళలను పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చి స్వావలంబన దిశగా నడిపిస్తాయి.

## పురుషాధిక్యానికి 'బాస్సీ' సవాలు!

ఇటలీలోని బొలోన్యా విశ్వవిద్యాలయం వేదికగా 1732లో చోటు చేసుకున్న ఒక అద్భుత ఘటన మహిళా లోకాన్ని గర్వంతో తలెత్తుకునేలా చేసింది. తర్వాతి కాలంలో లారా బాస్సీగా సుప్రసిద్ధురాలైన లారా మరియా కాథరీన బాస్సీ వెరాటీ తన అసామాన్యమైన మేధస్సుతో, ప్రొఫెసర్లు, పండితులు, ఉన్నతాధికారులతో నిండిన సభ ముందు తన డాక్టరల్ థీసిస్‌ను సమర్థించేందుకు నిలిచింది. అప్పుడు ఆమె వయసు కేవలం 21సంవత్సరాలు. ఆమెకు తత్వశాస్త్రంలో ప్రావీణ్యం ఉంది. భౌతికశాస్త్రం, గణితశాస్త్రంలో అసాధారణ పట్టు ఉంది. అందుకే, అప్పటి వరకూ ఇటలీలో ఎవరూ చేయని రీతిలో డాక్టరేట్ కోసం ప్రయత్నించింది. పురుషాధిక్యాన్ని సవాలు చేస్తూ, అద్వితీయ ప్రతిభాపాటవాలు కనబరచింది. డాక్టరేట్ సంపాదించడమే కాదు... ఐరోపాలోనే తొలి మహిళా విశ్వవిద్యాలయ ఉపాధ్యాయురాలిగా నియామకం పొందింది. అప్పట్లో ఇదో విప్లవాత్మక పరిణామం. బాస్సీ యూరప్‌లో అధికారిక విశ్వవిద్యాలయ బోధనా హోదా పొందిన తొలి మహిళగా చరిత్ర సృష్టించింది. తనను తాను నిరూపించుకోవడంలో ఆమె ప్రస్థానం సులభంగా సాగలేదు. పురుషులకు ఒక మహిళ బోధించడం విశ్వవిద్యాలయాధికారులకు నచ్చేది కాదు. అందుకే ఆమె బోధించే సమయాలను, ప్రదేశాలను పరిమితం చేశారు. అయినప్పటికీ బాస్సీ తన కాలపు రాజకీయ పరిస్థితులను అద్భుతంగా ఎదుర్కొంది. 1778లో మరణించే నాటికి, బాస్సీ దాదాపు యాభై సంవత్సరాలపాటు బోధించింది. అనేకతరాలను ప్రేరేపించిచింది. ఆమె తెరిచిన తలుపు పూర్తిగా విప్పబడటానికి శతాబ్దాలు పట్టినా, యూరప్ శాస్త్ర చరిత్రలో ఆమె పోషించిన పాత్ర శాశ్వతమైనది.



దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న

# సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

## ఆర్‌టిసి కార్మికుల డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్‌టిసి కార్మికులు ముక్త కంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్‌టిసి జెఎసి పిలుపు మేరకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసి కార్మికులు ఎర్రబ్యాడ్జీలతో డిపోల ఎదుట నిరసన వ్యక్తంచేశారు. జెఎసి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాట దినం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన డిపో, యూనిట్, రీజనల్, జోనల్, రాష్ట్ర నాయకులకు , యూనియన్లకు అతీతంగా ఈ ఉద్యమంలో పెద్దయెత్తున పాల్గొన్న కార్మికులు, ఉద్యోగులందరికీ జెఎసి నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు. మునుముందు జెఎసి చేపట్టే ప్రత్యక్ష పోరాట కార్యక్రమాలల్లో కార్మికులందరూ ఇదేవిధంగా పాల్గొనాలని జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్‌చైర్మన్, ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కోకన్వీనర్ కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరిలు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందపర్చిన ఆర్‌టిసి, ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ ఆర్‌టిసి, రైల్వే శాఖ తరహాలో టికెట్ తీసుకుని ప్రయాణించే బాధ్యత ప్రయాణికులదే బాధ్యతగా ప్రకటించి ఆర్టీసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆదేవిధంగా 2021 వేతన సవరణ 30 శాతం అమలు చేయాలని, పైసా ఖర్చు లేని ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమేకొని ఆర్‌టిసికి ఇవ్వాలని, రిటైర్ అయిన ఉద్యోగుల బకాయిలన్నిటిని వెంటనే చెల్లించడం తదితర పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకాన్ని ఆర్‌టిసి కార్మికులు అష్టకష్టాలు పడుతూ, ఉద్యోగాలు కోల్పోతూ, భౌతిక దాడులకు గురవుతూ ఆర్‌టిసిలో అమలు చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి కార్మికులను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని అన్నారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించి జీరో టికెట్ డబ్బులు ఆర్‌టిసి రూ.2,072 కోట్లు ప్రభుత్వం బకాయి ఉందని, వీటిని ప్రభుత్వం తక్షణమే చెల్లించి చిత్తశుద్ధిని చాటుకోవాలని వారు కోరారు.

కాంట్రాక్టు కార్మికులకు

# వేతనాలు చెల్లించే వరకూ ఆందోళనలు

## ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నెలల తరబడి చెల్లించని వేతనాలు వెంటనే చెల్లించకపోతే తమ ఆందోళన ఇక ఉధృతంగా కొనసాగిస్తామని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి ఎం.నరసింహ హెచ్చరించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని నాచారం ఇఎస్‌ఐ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలంటూ కొనసాగుతున్న నిరవధిక ఆందోళనలో భాగంగా మంగళవారం జరిగిన ధర్నాలో కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ అక్టివిటీ సంస్థ పేరిట నాచారం ఇఎస్‌ఐ ఆస్పత్రిలో పని చేస్తున్న సెక్యూరిటీ, శానిటరీ సిబ్బందికి గత ఐదు మాసాలుగా వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు పలుసార్లు చెప్పినా, వినతిపత్రాలు అందజేసిన ఫలితం లేకపోవటంతో కార్మికులు చివరికి ఆందోళనబాట పట్టాల్సి వచ్చిందన్నారు. కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిలో అత్యధికంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే ఉంటారన్నారు. వారు తమ కుటుంబ అవసరాల కోసం చాలీచాలని జీతాలతో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నా వారికి నెల నెలా వేతనాలు చెల్లించక పోవటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యం ఆస్పత్రి రోగులకు పలురకాల సేవలందిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం అమానుషమన్నారు. వేతనాలతో పాటు వారికి నిబంధనల మేరకు చెల్లించాల్సిన ఇఎస్‌ఐ, పిఎఫ్ డబ్బులు సైతం ఆయా సంస్థలకు చెల్లించటం లేదన్నారు. వేతనాల బకాయిలు చెల్లించాలన్న డిమాండ్‌తో ఈ నెల 22 వరకు ఆస్పత్రి ప్రాంగణంలో ప్రతిరోజు 2 గంటల పాటు ధర్నా నిర్వహిస్తామని, అప్పటికీ సమస్య పరిష్కారం కాని పక్షంలో ఆస్పత్రి విధులు బహిష్కరించటం ద్వారా ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్మికుల ఆందోళన వల్ల రోగులకు కలిగే ఇబ్బందులకు ఆస్పత్రి అధికారులే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ వేణుకుమార్, యూనియన్ నాయకులు క్రాంతికుమార్, నర్సింహ, అశోక్, భాస్కర్, రాములు, రాజేష్, నిరంకర్, సిస్టర్ లింగమ్మ, సిస్టర్ సుధ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ ఎన్నికల బరిలో ఉంటాం



## సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం వెల్లడి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం కార్పొరేషన్ ఎన్నికలో బరిలో ఉంటామని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం వెల్లడించారు. మంగళవారం సిపిఐ రామగుండం నగర కార్యవర్గ సమావేశం శనిగారపు చంద్రశేఖర్ అధ్యక్షతన స్థానిక భాస్కరరావు భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి సదానందం హాజరై మాట్లాడుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధం అవ్వాలని పార్టీ నాయకత్వానికి పిలుపునిచ్చారు. సిపిఐగా అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూ కార్మిక హక్కుల సాధనలో పోరాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న సిపిఐని రామగుండం కార్పొరేషన్‌లో ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. రామగుండం నగరంలో భారత కమ్యూనిస్టు పార్టీ దాదాపు 3,000 పైచిలుకు సభ్యత్వంతో అన్ని డివిజన్‌లలో పార్టీ నాయకత్వాన్ని కలిగి బలంగా ఉందన్నారు. కేవలం సిపి ప్రజాప్రతినిధులతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఆర్థిక పెట్టుబడిదారులు ఓట్లు కొంటె రేపు అంతకు రెండింతలు సంపాదించే విధంగా అవినీతికి పాల్పడతారే తప్పా అభివృద్ధి కోసం ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధి చూపించరని వివరించారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల రణరంగంలో సిపిఐ తన సత్తా చాటుతుందని తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కె.కనకరాజ్, పార్టీ, ప్రజాసంఘాల నాయకులు తాళ్ళ పెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, తోడుపునూరి రమేష్‌కుమార్, మడికొండ ఓదెమ్మ, ఆసాల రమ, ఆరేల్లి పోషం, సిరిసిల్ల మల్లేష్ పడాల కనకరాజ్, రేణుకుంట్ల ప్రీతం రంగు శీను, ఎంఎ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాఉద్యమాల సిపిఐని

# నగర ఎన్నికల్లో ఆదరించాలి

## సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్




**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ నగర కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ 9 స్థానాల్లో పోటీ చేయనుందని, ఈ ఎన్నికల్లో ప్రజా ఉద్యమాల సిపిఐ అభ్యర్థులను ప్రజలు ఆదరించి గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు. కరీంనగర్ నగర కార్పొరేషన్ సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం న్యాలపట్ల రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో అనేక డివిజన్లలో పార్టీ నిరంతరం స్థానిక సమస్యలపై ఉద్యమాలు నిర్వహించిందని, నగరంలో పేద ప్రజలకు డబుల్ బెడ్రూం ఇండ్లు, అర్హులైన పేదలకు రేషన్ కార్డులు పింఛన్లు ఇవ్వాలని పోరాటాలు చేసింది సిపిఐ అన్నారు, గత పాలకవర్గంలో అనేక అవినీతి అక్రమాలు జరిగాయని, బిజెపి, బిఆర్‌ఎస్ రెండు కార్పొరేషన్ ఎన్నికల్లో దొంగే దొంగ అన్నట్లుగా మాట్లాడుతున్నాయని, స్మార్ట్ సిటీ పేరిట నిధులు వృధా చేశారని, డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించలేదని ఆరోపించారు. ప్రశ్నించే గొంతుగా ప్రజల పక్షాన నిలబడానికి సిపిఐ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గణేష్ నగర్ 57, హనుమాన్ నగర్ 40, కట్టారంపూర్ 11, మారుతీనగర్ 36, బోయవాడ 46, రాంనగర్ 47, కోతి రాంపూర్ 9, కాపువాడ 58,16 డివిజన్లలో పోటీచేస్తామని షెడ్యూల్ విడుదల అయ్యాక అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తామన్నారు. ప్రజా ఉద్యమాల రథసారధి సిపిఐ అభ్యర్థులను ప్రజలు ఆదరించి గెలిపించాలని పంజాల శ్రీనివాస్ కోరారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, నగర కార్యవర్గ సభ్యులు బీర్ల పద్మ, కొట్టే అంజలి, భారతి, బాకమ్ అంజయ్య, కసిబోజుల సంతోష్ చారి,గామినేని సత్తయ్య, కూన రవికుమార్, అరవింద్, నాగునూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ ఉద్యమానికి

# కమ్యూనిస్టుల మద్దతు

## సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సేంద్రియ వ్యవసాయంతోనే ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారని... అందు కోసం జరిగే ఉద్యమానికి కమ్యూనిస్టుల మద్దతు ఉంటుందని సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ కె.నారాయణ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో సిద్ధార్థ యోగ విద్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయంలో మార్పులు రావాలని కోరారు. గత వ్యవసాయం వైభవం రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత వ్యవసాయం కార్పోరేట్ కంపెనీలకు, హాస్పిటల్స్‌కు ఉపయోగపడుతుందన్నారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న ఎరువులను నిరోధించాలని సూచించారు. చిన్నజీయర్ లౌకిక ఆలోచనలు వున్న వ్యక్తి అన్నారు. తాను ఈ కార్యక్రమానికి వచ్చినందుకు విమర్శలు చేయవచ్చునని... కానీ వాటిని నేను లెక్క చేయనన్నారు. తాను చివర వరకు కమ్యూనిస్టుగానే ఉంటానన్నారు. సేంద్రియ వ్యవసాయం బలోపేతానికి సుఫలా యాత్రకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు నారాయణ తెలిపారు. సమావేశంలో ఆర్‌టిఐ కమిషనర్ పివి.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, నల్లమల్ల వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్, మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, సహాయకార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, కనకబండి సీతారాములు, బాలిన కృష్ణంరాజు, పోలంపల్లి నారాయణ, ఆలేటి ఉమామహేష్, ఎస్‌కె.సత్తార్, మూడు శీను తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రజా సమస్యలను వెలికి తీసి ప్రజాస్వామ్య విలువలను కాపాడే ప్రజాపక్షం దినపత్రిక అని ముత్తారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాపక్షం దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను తహసీల్దార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగాతహసీల్దార్ మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా ప్రత్యేక వార్త కథనాలను ప్రచురిస్తున్న ప్రజా గొంతుక ప్రజాపక్షం దినపత్రిక అని అన్నారు ప్రజాపక్షం క్యాలెండర్ లో వేస్తున్న సీనరీలు, డిజైన్లు చాలా చక్కగా ఉంటాయని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం రిపోర్టర్ పాలం చిరంజీవి,డిప్యూటీ తాసిల్దార్ తో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## ప్రతీ రైతూ సభ్యత్వం తీసుకోవాలి



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండలంలోని ఓబులాపూర్, ఓబులాపూర్ తండా గ్రామపంచాయతీలలో మల్లాపూర్ పిఏసిఎస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పిఒ) స్కీం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎఫ్‌పిఒ స్కీమ్ లో అర్హత సాధించేందుకు ప్రత్యేక షేర్ క్యాపిటల్ కలెక్షన్ ప్రోగ్రాం చేపట్టి స్కీం వల్ల రైతులకు కలిగే లాభాలను పిఏసిఎస్ సీఈవో పాదం భూమేష్ రైతులకువివరించారు. ప్రతి రైతు సభ్యత్వం తీసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డి ఈ సిహెచ్ శ్రీనివాస్, ఇరు గ్రామాల సర్పంచులు తోట మాధురి రాజారెడ్డి, లకావత్ కాంతి జవహర్లాల్, ఉపసర్పంచ్ లు వార్డు సభ్యులు సొసైటీ సిబ్బంది తదితరులున్నారు.

## 23న జాబ్ మేళా

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలోని నిరుద్యోగ యువకులకు కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు జనవరి 23 శుక్రవారం రోజున రూమ్ నెంబర్ 233 నూతన కలెక్టర్ భవన సముదాయంలో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.కృషి విజ్ఞాన్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో మొత్తం 67 ఉద్యోగాల ఖాళీగా ఉన్నాయని, సేల్స్ ఎగ్జిక్యూటివ్ 60, ఫీల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్స్ 4, హెచ్ ఆర్ 2, ఆఫీస్ బాయ్ 1 పోస్ట్ లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.సేల్స్ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్, డిగ్రీ ,డిప్లమా, ఫీల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఉద్యోగాలకు అగ్రికల్చర్ బీఎస్సీ, హెచ్ఆర్ ఉద్యోగాలకు ఎంబీఏ ,ఆఫీస్ బాయ్ పోస్ట్ లకు పదవ తరగతి ,విద్య అర్హతలు కలిగిన వారు అర్హులని ,ఆసక్తి ఉన్నవారు జనవరి 23న ఉదయం 11 గంటల కు సర్టిఫికెట్స్ జిరాక్స్ లతో రూమ్‌నెం.233 నూతన కలెక్టర్ భవన సముదాయంలో, పెద్దకాల్వల పెద్దపల్లి మొదటి అంతస్తులో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 9908674056, 8985336947, 812 126 2441 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి రాజశేఖర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## ఆలస్య రుసుముతో పదవ తరగతి పరీక్ష ఫీజులు చెల్లించవచ్చు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జనవరి 27 లోపు ఆలస్య రుసుము తో పదవ తరగతి పరీక్ష ఫీజులు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి. శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2026 లో జరిగే పదవ తరగతి, ఓపెన్ పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, ఫెయిల్ అయిన అభ్యర్థుల కోసం పరీక్షా ఫీజ్ ఆలస్య రుసుము 1000 రూపాయలతో కలిపి చెల్లించేందుకు జనవరి 27 వరకు మాత్రమే అవకాశం ఉంటుందని అన్నారు .మార్చి 2026: హాల్ జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు నమోదు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే అడ్వాన్స్డ్ సప్లిమెంటరి పరీక్షలకు హాజరు కావడానికి అర్హులని, అందువల్ల పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కావాలనుకునే ఫెయిల్ అయిన అభ్యర్థులు రెగ్యులర్ స్ట్రీమ్ అభ్యర్థులు చివరి అవకాశాన్ని ఉపయోగించుకొని నిబంధనలు ప్రకారం అవసరమైన రసమును చెల్లించి మార్చిలో జరిగే పరీక్షకు హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు:ఎస్ఐ



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ఎంతటి వారైనా సరే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్ఐ జి. నవీన్ కుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నూతన ఎస్సైగా మంగళవారం స్టేషన్ లో నవీన్ కుమార్ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ అనిల్ కుమార్ బదిలీపై మల్లాపూర్ మండలానికి వెళ్లారు. కథలాపూర్ ఎస్సైగా విధులు నిర్వర్తించిన నవీన్ కుమార్ బదిలీలో భాగంగా ఇక్కడ బాధ్యతలను చేపట్టారు.

## ఇబ్రహీంపట్నం గ్రామంలో పిచ్చికుక్క హల్‌చల్

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మంగళవారం కొత్త బస్టాండ్ ప్రాంతంలో పిచ్చికుక్క నలుగురిని గాయపరిచి హల్చల్ సృష్టించింది. గ్రామానికి చెందిన నేమూరీ లక్ష్మణ్, ఏలేటి పెద్దారెడ్డి, పిట్టల చిన్న వెంకన్న, వీరితోపాటు మరో వ్యక్తి సొసైటీలో డ్రోన్ రిపేర్ చేయడానికి వచ్చిన వ్యక్తి వ్యక్తితో పాటు నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారు ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్ళగా రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో గాయపడిన కుక్క కాటు బాధితులను మెట్పల్లి ప్రభుత్వ హాస్పిటల్ కు వెళ్లవలసిందిగా వైద్యులు సూచించినట్లు బాధితులు తెలిపారు. దీనిపై ప్రభుత్వ వైద్యాధికారి రాజేందర్ రెడ్డిని ఫోను ద్వారా వివరణ కోరగా రేబిస్ వ్యాక్సిన్ అయిపోవడంతో మెట్పల్లి ప్రభుత్వాసుపత్రికి వెళ్ళవలసిందిగా సూచించనని, గాయపడిన వారికి సెకండ్ డోస్ కు వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని డాక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. కాగా పిచ్చికుక్కని గ్రామపంచాయతీ సిబ్బంది చంపి వేసినట్లు తెలిసింది.

## పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

**ప్రజాపక్షం / చందుర్తి :** తమ పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల పంచాయితీ కార్మికులు మంగళవారం స్థానిక ఎంపిడిఓ రాధకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పంచాయితీ కార్మికుల జిల్లా అధ్యక్షులు మల్యాల నర్సయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయితీ కార్మికుల రెండు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించడం తో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.విధుల్లో గాయపడిన కార్మికులకు వైద్య సదుపాయం,మరణించిన వారికి నష్టపరిహారం ప్రభుత్వం అందజేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ఉపముఖ్యమంత్రి , ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీ లో ప్రకటించిన విధంగా నెలకు రూ.15600 వేతనం చెల్లించాలని లేనియెడల విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో మండల పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులోకి

# అన్నిరకాల ఎమర్జెన్సీ వైద్యసేవలు

సిఎం, మంత్రి చొరవతో జగిత్యాల సమగ్రాభివృద్ధికి కృషి
మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో జగిత్యాల ఎమ్మెల్యే శంకుస్థాపన



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలో 235 కోట్లతో నిర్మించనున్న 650 పడకల ఆసుపత్రికిశంకుస్థాపన చేసి, 23.5 కోట్లతో క్రిటికల్ కేర్ బ్లాక్, 3 కోట్లతో సెంట్రల్ మెడిసిన్ స్టోర్, 1.5 కోట్లతో టి.ఆర్ నగర్ లో ప్రభుత్వ వయోవృద్ధుల సదనంను ప్రారంభించిన అనంతరం బైపాస్ రోడ్డులో వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్ ను మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఎస్‌సి ఎస్‌టిదివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు.

**వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి: జగిత్యాల ఎమ్మెల్యే**

నాలుగు వైపుల రహదారితో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా 650 పడకల ఆ సుపత్రి జగిత్యాలలో నిర్మాణం. 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభోత్సవం చేయటం జరిగిందని తద్వా రా రోడ్డు ప్రమాద, అత్యవసర ప్రసూతి బాధితులకు చా లా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ఎన్ఎమ్‌సి గైడ్ లైన్ ప్రకారం మెడికల్ కాలేజీకి 150 పడకల ఆసుపత్రి ఉండాలి కానీ 150 పడకల ఆ సుపత్రి ఉండడంతో 650 పడకల ఆసుపత్రి జగిత్యాలకు వచ్చింది అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. పేద వైద్య విద్యార్థులకు అన్యాయం జరగవద్దు అని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి, మంత్రులు కృషితో నేడు నూతన ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి చొరవతో 40 కోట్ల నిధులు మంజూరుతో మెడికల్ కాలేజీ పనులు త్వరిత గతిన జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. పక్క నియోజకవర్గం నుండి వచ్చి విమర్శిస్తున్న వారికి అభివృద్ధి పనులు చూసి జగిత్యాల ప్రజలే సమాధానం చెప్తారు అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ ను ఉద్దేశించి కౌంటర్ ఇచ్చారు. మెడికల్ కళాశాలకు అవసరమైన వైద్యులు నర్సింగ్ స్టాఫ్ కు ప్రభుత్వం ద్వారా గతంలోనే అనుమతులు పొందడం జరిగిందని గుండె నరాలు ప్లాస్టిక్ సర్జరీ ఇలా సూపర్ స్పెషాలిటీ వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నారనీ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మంత్రి చొరవ తీసుకుని జగిత్యాలకు అంబులెన్స్ , ఎంఆర్ఐ స్కాన్, వైద్య విద్యార్థులకు గ్రామాల్లో వైద్య సేవలకు గాను 3 బస్సులు అవసరం ఉంటుంది అని మార్చురి వ్యాన్ కూడా అవసరం ఉందని మంత్రికి వినతి పత్రాన్ని అందజేశామని వారు అన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 16 పల్లె దవాఖానలు జగిత్యాల నియోజకవర్గం కు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. 5 వేల ఇండ్లకు ఒక బస్తీ దవాఖాన అవసరం ఉందని మంజూరు చేయాలనీ వారు కోరారు. కరీంనగర్ కన్నా పెద్ద ఆసుపత్రి మనకు రావడం జరిగింది అని జగిత్యాల ప్రజలు దీనిని గమనించాలి అని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రి కలిసి జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అని అన్నారని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, ప్రిన్సిపాల్ సునీల్, సూపరింటెంట్ కృష్ణమూర్తి, జిల్లా సంక్షేమ అధికారి డా.నరేష్, నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంథని మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరాలే

బిఆర్‌ఎస్ శ్రేణులకు మధూకర్ పిలుపు



**ప్రజాపక్షం/ముత్తారం :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మంథని మున్సిపాలిటీపై గులాబీజెండా ఎగురాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంగళవారం మంథని పట్టణంలోని రాజగృహాలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆశావహులు,బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో ముందస్తు సన్నాహక సమావేశం నిర్వహించి దిశా నిర్ధేశం చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌లో మన అభ్యర్థుల గెలుపుకోసం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమిష్టిగా పని చేస్తేనే విజయం సాధించగలమనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. ఏ ఎన్నికలు జరిగినా తాను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటామని, ఎవరి గెలుపు కోసమైనా ఒకే రకంగా పనిచేస్తామని అన్నారు. తనతో పాటు అందరూ సమానంగా పైకి రావాలని ఆకాంక్షిస్తానని, తాను ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో అవకాశం ఉన్న ప్రతి ఒక్కరికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చామని, పలు ఎన్నికల్లో మన అభ్యర్థులకు గెలిపించుకుని వారి ఉన్నత పదవులు వచ్చేలా కృషి చేశామన్నారు. ఆనాడు ఎమ్మెల్యేగా మంథని మున్సిపాలిటీకి మానీఫెస్టో తీసుకువచ్చాడని, కానీ ఇప్పటి వరకు ఆ మానీఫెస్టో అమలు చేయలేదన్నారు. ఓట్లు వస్తేనే ఏ విధంగా వాడుకుంటారోననే విషయాన్ని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. మంథని రక్షించబడాలంటే ప్రజలు బాగుండాలంటే ప్రశాంతమైన వాతావరణం ఉండాలంటే మున్సిపల్ బిఆర్ఎస్ చేతుల్లో ఉండాలని ప్రజల్లో చర్చ జరుగుతోందని, ఆ దిశగానే ముందుకు సాగి విజయం సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆసుపత్రుల పట్ల విశ్వాసం కల్పించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలలో విశ్వాసం కల్పించేలా మన పనితీరు ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు .మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గోదావరిఖని జనరల్ ఆసుపత్రి పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో డ్యూటీ టైం లో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని ఫీడ్ బ్యాక్ అందుతుందని, ప్రతి డిపార్ట్మెంట్ పరిధిలో వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావడంతో పాటు డ్యూటీ టైం లో తప్పనిసరిగా డాక్టర్లు ఓపి సమయంలో పూర్తి స్థాయిలో రోగులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ సేవలు ఏ విభాగంలో తగ్గుతున్నాయో గమనించి రెగ్యులర్ గా రివ్యూ చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు బాగా చూస్తారు అనే నమ్మకం సాధించాలని అన్నారు. ఆసుపత్రి సిబ్బంది, వైద్యుల సెలవులను క్రమ పద్ధతులు వినియోగించుకోవాలని, అందరికి ఒకేసారి సెలవు మంజూరు చేయవద్దని అన్నారు.మన సిబ్బంది ప్రవర్తన తీరు రెగ్యులర్ గా ఫాలో అప్ చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మందులో కొరత ఉండటానికి వీలు లేదని, వైద్య సేవల నిమిత్తం ప్రభుత్వం నుంచి వచ్చే మందుల స్టాక్ కాకుండా ఇంకా ఏవైనా మందులు అవసరం ఉంటే ప్రతిపాదనలు అందిస్తే కలెక్టరేట్ నుంచి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.జిజిహెచ్ సిబ్బంది హాజరు బయోమెట్రిక్ విధానంలో నమోదు చేయాలని అన్నారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ గోదావరిఖని ఆసుపత్రి సూపరింటెండెంట్ దయాల్ సింగ్,ఆర్ఎంఓ ,డాక్టర్ రా జు,డాక్టర్అరుణసంబంధితఅధికారులు,పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారుల వివిధ రకాల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ద్వారా పలు సమస్యలకు పరిష్కారం లభించిందని టిజిఎస్‌పిడిసిఎల్ హైదరాబాద్ సిజిఎ మెం బర్ ఆఫ్ ఫైనాన్స్ రామానుజనాయక్, ఎన్‌కేకె ఇండిపెండెంట్ సభ్యుడు వెంకట్, విద్యుత్‌శాఖ ఎస్ఇ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఎస్ ఇ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకోవటానికి గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కువగా అధిక బిల్లులు. మిడిల్‌ఫోల్. లూజ్‌వైర్, పోల్ షిఫ్టింగ్, వైర్ సెట్టింగ్ సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని సంబంధిత అధికారులకు సూచించి సమస్యల పరిష్కారానికి సూచించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుండి రైతులు,వ్యాపారులు,గృహ వినియోగదారులు తమ సమస్యల విన్నవించటానికి వచ్చారన్నారు. ఇలాంటి వేదికల వల్ల ప్రజల సమస్యల పరిష్కారం వెంట,వెంటనే జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో విద్యుత్ డిఈ రామచంద్రయ్య, అధికారులు శ్రీనాథ్, ముత్తయ్య, గంగాధర్. శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీసు కవాతు మైదానంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకలకు స్టేజీ, పార్కింగ్, విద్యుత్, అలంకరణ, సౌండ్ తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్, ఫైర్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, చిన్నారులు ఎక్కువ సంఖ్యలో వేడుకలకు హాజరయ్యేలా చూడాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్టాళ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. 108, 102, బాల రక్షక్, సఖి వాహనాలను ప్రదర్శనలో ఉంచాలన్నారు. ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు ఉత్తమ సేవలు అందించిన సిబ్బంది పేర్లను పరిశీలించి నివేదికలు పంపాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవ వేడుకలకు పోలీస్ కవాతు మైదానంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని అన్నారు. పోలీస్ బందోబస్తు తో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు మంత్రి తుమ్మల రాక

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** నేడు మధ్యాహ్నం రెండు గంటలకు సిరిసిల్ల పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకి చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రానున్నారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్ పిలుపునిచ్చారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మంత్రి పర్యటనకు మార్కెట్ కమిటీ చైర్మన్ లు, దేవాలయాల చైర్మన్లు, ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ నాయకులు ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. 18 కోట్ల 70 లక్షల యుఐడిఎఫ్ ఫండ్స్ చే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారన్నారు. రెండు సంవత్సరాల ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నో ఒడుదొడుగులను ఎదుర్కొంటూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఇచ్చిన మాటలను ఒక్కొక్కటి నెరవేరుస్తూ వస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వైద్య శివప్రసాద్, పోచమ్మ గుడి చైర్మన్ పరశురాములు, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఆకునూరి బాలరాజు, యెల్లె లక్ష్మీనారాయణ, నక్క నరసయ్య, నీలి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ధర్మపురిలో భట్టి, మంత్రులు తుమ్మల, అడ్లూరిల పర్యటన



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో నేడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు పర్యటించనున్నారు.పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాలు జరుపనున్నారు.మండలంలోని నేరేళ్ల గ్రామ శివారులో రూ.200 కోట్ల నిధులతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల సముదాయానికిశంకుస్థాపన, గోదావరి నది తీరంలో రూ.17 కోట్ల నిధులు వెచ్చించి ఏర్పాటు చేస్తున్న సీవరేజి ప్లాంటు శంకుస్థాపన,రూ.10 కోట్లతో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శంకుస్థాపన,రూ.2 కోట్లతో నిర్మించనున్న ఎస్సీ వసతి గృహ నిర్మాణం,రూ.4.3 కోట్లతో నూతన విద్యుత్తు లైన్ల విస్తరణ,ధర్మపురి పట్టణంలో రూ 2.58 కోట్లతో ఏర్పాటు చేసిన 33/11 కెవి సబ్ స్టేషన్,దొంతాపూర్ వద్ద రూ.2.18 కోట్లతో నిర్మించిన 33/11 విద్యుత్తు సబ్ స్టేషన్ లకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు.వీటితోపాటు వ్యవసాయ పనిముట్లు పంపిణీ,త్రాగునీటి సరఫరా పథకానికిశంకుస్థాపన జరుపనున్నారు. ఉప ముఖ్యమంత్రి, మంత్రులు తుమ్మల,అడ్లూరిల పర్యటనల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ లు మంగళవారం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ అధికారులు ప్రత్యేక బలగాలను మోహరించారు. డిఎస్‌పిరఘుచందర్, సిఐ రాం నర్సింహారెడ్డిల ఆధ్వర్యంలో ఎస్ఐలు గట్టి బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.


## మొబైల్ ఎక్స్‌రే ప్రారంభం



**ప్రజాపక్షం/చందుర్తి:** ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంగళవారం చందుర్తి మండల కేంద్రం లోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం లో మొబైల్ ఎక్స్‌రే ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.టీబీ ముక్త భారత్ లో భాగంగా రూ.24 లక్షలతో అందుబాటులోకి తీసుకువచ్చిన మొబైల్ ఎక్స్‌రే తో టీబీ రోగులకు ఇంటి వద్దనే వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు.టీబీ నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆసుపత్రి లో ఆరు నెలలు ఉచిత మందులను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చందుర్తి మండల వైద్యాధికారి వేణు,స్థానిక సర్పంచ్ పులి సత్యం ,ఆశిరెడ్డి పల్లి సర్పంచ్ బొజ్జ మల్లేశం, ఉప సర్పంచ్ బత్తుల క్రాంతి , నాయకులు గొట్టె ప్రభాకర్ ,అధికారులు, ఆసుపత్రి సిబ్బంది,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయ రమణారావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సోదరీమణుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయ రమణారావు అన్నారు.సుల్తానాబాద్ మండల కేంద్రంలోని యశోద నరహరి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సంబరాలు, వడ్డీ లేని రుణాల రూ.58,86,470 / విలువ గల చెక్కుల పంపిణీ, మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ చీరలను స్థానిక నాయకులతో కలిసి పెద్దపల్లి శాసనసభ్యుడు చింతకుంట విజయ రమణారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళలకు గర్వంగా తలెత్తుకునేలా ఉండే చీరలను పంపిణీ చేస్తున్నారని సూచించారు. అధికారం చేపట్టిన రెండు సంవత్సరాల కాలంలో అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని 5 లక్షల నుండి 10 లక్షలకు పెంచారని, అడిగినవారికి కాదనకుండా రేషన్ కార్డులను అందించారని, రైతులకు రుణమాఫీతో పాటు సన్న వడ్లకు బోనస్ అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలందరికీ సన్నబియ్యాన్ని అందించి అండగా నిలుస్తున్నారని సూచించారు.రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గం కోట్లాది రూపాయలతో అభివృద్ధి పథంలో దూసుకు పోతుందని నియోజకవర్గంలో బస్సు డిపోను ఏర్పాటు చేయడంతో పాటుసిసి రోడ్లు డ్రైనేజీలు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని పాత వార్డులలో రోడ్లు హైదరాబాద్ రోడ్లను తలపించేవిగా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రెండు సంవత్సరాల కాలంలోనే ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వచ్చామని సూచించారు. దేశంలోనే ఐదు లక్షల ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే అన్నారు. ప్రజలకు సన్న బియ్యం అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలో చెరువును మినీ ట్యాంక్ బండ్ గా మార్చేందుకు కృషి చేస్తున్నామని మహిళా సోదరీమణులు బతుకమ్మ ఆడిన అనంతరం చెరువులో నిమజ్జనం చేసేందుకు వెళ్లే ప్రాంతాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇక్కడినుండి తరలించుకుపోయిన కార్యాలయాలను తిరిగి తీసుకొచ్చామని తెలిపారు. త్వరలో ఆర్ అండ్ బిని ఎనిమిది కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామని అన్నారు. సుల్తానాబాద్ పట్టణాన్ని అత్యంత ఆధునీకరంగా సుందరీ కరణ నగరంగా అభివృద్ధి పరచనున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలోనే సంక్షేమ కార్యక్రమాలలో దూసుకు పోయామని తెలిపారు. మరో మూడు సంవత్సరాలు కాలం ఉందని . మరో ఐదు సంవత్సరాలు కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని ప్రజలందరూ ఆశీర్వదించి రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా అండగా వ్యవహరించాలన్నారు. అనంతరం వడ్డీ లేని రుణాలు 58 లక్షల 86,470 చెక్కును మహిళా గ్రూప్ సభ్యులకు అందించారు. 146 గ్రూపులకు తిరిగి వచ్చిన రుణాన్ని అందించారు. 2023– 25 వరకు మహిళ శక్తి 528 సంఘ సభ్యులకు అందించారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళలకు చీరల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు, తాసిల్దార్ బషీరోద్దీన్, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, పార్టీ శ్రేణులు శ్రీగిరి శ్రీనివాస్, సి ఓ స్వరూప, బిరుదు సమత కృష్ణ, వేగోళం అబ్బయ్య గౌడ్, ఊట్ల వరప్రసాద్, అంతటి పుష్పలత, మమ్మద్ నిషాద్ రఫీక్, అమీర్ శెట్టి రాజలింగం,ముత్యాల రవీందర్,గరిగే శ్రీనివాస్, కుమార్ కిషోర్,న్యాతరి శ్యాంసుందర్,సిద్ధ తిరుపతి, గాదాసు రవీందర్, చింతల రాజు,దున్నపోతుల రాజయ్య,తొర్రికొండ ప్రభాకర్, లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి 'పత్రికలు'

'ప్రజాపక్షం' క్యాలండర్ ఆవిష్కరణ చేసిన
డిసిసి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రధాన కృషి చేసేవి,ప్రభుత్వాలు ప్రతిపక్షాలు అనే తారతమ్యం లేకుండా ప్రజలకు అవగాహన కల్పించేవి పత్రికలు అని ఎమ్మెల్యే డిసిసి వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు.సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజాపక్షం క్యాలెండర్ ని ఆవిష్కరించారు. ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు తెలిసే విధంగా పత్రికల సహాయపడతాయని,సమాజంలో ఎలాంటి సమస్యలు ఉన్న సమస్య పరిష్కరానికి కృషి చేసే విధంగా అధికారులను ప్రజాప్రతినిధులను మేలుకొలుపుతాయని అలాంటి పత్రికలు అభివృద్ధి పథంలో నడిచే విధంగా చూడాలని అన్నారు.అలాంటి సమస్యలు తెలియజేయడంలో ప్రజాపక్షం పత్రిక ముందుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ తోట సత్యం,ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికని దయానంద్ పెంబి మండల అధ్యక్షుడు స్వప్నిల్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ కావలి సంతోష్,సత్తనపల్లి మాజీ పిఎసిఎస్ చైర్మన్ శ్రీనివాస్,సీనియర్ పాత్రికేయులు మంత్ర రాజ్యం దేవేందర్,రాసమల్ల రాజశేఖర్,పడాల లక్ష్మి నారాయణ,దండు సతీష్,గోదూరి రాజు ఉన్నారు.

## సిఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



**ప్రజాపక్షం / కేరమెరి :** గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని యువ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సిఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందని కేరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు అన్నారు. మంగళవారం కేరమెరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గ్రామపంచాయతీ స్థాయి సిఎం కప్ క్రీడా పోటీలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సురేష్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి ఆడే ప్రకాష్, తహసీల్దార్ సంతోష్ లతో కలిసి ఆయన ప్రారంభించారు.యువత క్రీడల వైపు ఆకర్షితులు కావడం వల్ల ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. పోటీల ద్వారా గ్రామీణ క్రీడాకారులకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించే గొప్ప అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు. క్రీడలు శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు సర్పంచ్, ఉప సర్పంచ్ లను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉప సర్పంచ్ శ్రీకాంత్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పవన్, ఫిజికల్ డైరెక్టర్ మహేష్, యోగా ట్రైనర్ దినేష్, కారోబార్ గడ్డల వెంకన్న, నాయకులు పెందోర్ శ్రీనివాస్, వినేష్, రాంచందర్ పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ఈ నెల 26వ తేదీన జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి ఏర్పాట్లపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వేడుకల నిర్వహణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వేదిక అలంకరణ, ప్రోటోకాల్, తాగునీరు వంటి సౌకర్యాల బాధ్యతలను ఆయా విభాగాల అధికారులకు అప్పగించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల జాబితాను ఈ నెల 24వ తేదీలోగా అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. వేడుకల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై స్టాల్స్ ప్రదర్శించాలని, విద్యార్థులచే దేశభక్తి గీతాలపై సాంస్కృతిక ప్రదర్శనలు ఉండేలా చూడాలని తెలిపారు. మినిట్ టూ మినిట్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్ పి పర్యవేక్షిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక పరిపక్వతకు దోహదం

ఎంపిడిఒ రమాకాంత్



**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** క్రీడా స్ఫూర్తి ప్రతి ఒక్కరిలో ఉండాలని,ఆటలు మానసిక పరిపక్వతకు దోహదం చేస్తాయని,గెలుపు ఓటములతో పనిలేకుండా ప్రయత్నించాలని ఖానాపూర్ మండల అభివృద్ధి అధికారి సి.ఎం.కప్ చైర్మన్ రమాకాంత్ అన్నారు.మంగళవారం మస్కాపూర్ గ్రామంలో సిఎం క్రీడల నిర్వాణ కార్యక్రమంలో నాలుగు గ్రామ పంచాయతీల క్లస్టర్లు అయిన సుర్జాపూర్,మేడంపెల్లి, మస్కాపూర్,ఎక్బాల్పూర్ గ్రామ పంచాయతీల క్రీడాకారులతో కబడ్డీ, ఖోఖో,వాలీబాల్ ఆటల్లో పోటీలు నిర్వహించమని,క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగించేవి కాక శరీర దృఢత్వాన్ని పెంపొందించే విదంగా ఉంటాయని,ఆటలతో అలసట తీరి మెదడు చురుకుగా పని చేస్తుందని తెలిపారు.మండల క్రీడాకప్ కన్వీనర్ ఎం.ఇ.ఓ సంధ్యారాణి,ఆయా గ్రా మాల సర్పంచులు దోనికేని లక్ష్మి దయానంద్,బక్కశెట్టి వెంకట్రాము లు, పార్శపు రోహిత శ్రీనివాస్,గుగ్లవత్ రాజేందర్,ఉపసర్పంచ్ బి.దోనికేని వెం కటేష్,ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్, మునీందర్,వ్యాయమ ఉపాధ్యాయులు షేక్ ఇమ్రాన్, అలేఖ్య, అనిత,ఉపాధ్యాయులు నరేందర్ రావు, తొంటి శంకర్,కుర్ర శేఖర్,వెన్నం అంజయ్య,పంచాయతీ కార్యదర్శులు కల్పన, మల్లేష్,సురేందర్,సాయినాథ్ వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## 'పది'విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన

అసోసియేట్ ప్రొఫెసర్ నాయిని ఉదయ్ రంజన్ గౌడ్

**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** మనోహరాబాద్ మండలంలోని కూచారం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సమయంలో ఏ విధంగా చదవాలి అనే అంశాల పై మంగళవారం అసోసియేట్ ప్రొఫసర్ నాయిని ఉదయ్ రంజన్ గౌడ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఎలా సన్నద్ధం కావాలి, మంచి మార్కులు ఏ విధంగా తెచ్చుకోవాలి అనే విషయాల గురించి విద్యార్థులకూ వివరించారు. పాస్ అవ్వడం అనేది పెద్ద విషయం కాదని, కష్టపడి ప్రణాళిక ప్రకారం చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నట్లు నాయిని ఉదయ్ రంజన్ గౌడ్ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిర్మల్ ఉత్సవాల నిర్వహణ భేష్..




జిల్లా ఇన్‌చార్జి మంత్రిజూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లా చరిత్ర,సాంస్కృతిక వారసత్వాన్ని చాటి చెప్పే వేదికగా నిర్మల్ ఉత్సవాలు సోమవారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి.నిర్మల్ జిల్లా చరిత్రను,సాంస్కృతిక వారసత్వాన్ని ప్రజలకు పరిచయం చేసే ఉద్దేశంతో ఈ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అ న్నారు.సోమవారం రాత్రి నిర్వహించిన నిర్మల్ ఉత్సవాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మంత్రికి గుస్సాడి నృత్యాలతో ఘన స్వాగతం పలికారు.జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.''నిర్మల్ ఉత్సవాలు'' పేరిట గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్‌కు,అధికారులకు అభినందన లు తెలిపారు.జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మా ట్లాడుతూ,ఘనమైన చరిత్ర కలిగిన నిర్మల్ జిల్లా విశేషాలు,సంస్కృతి,సంప్రదాయాలను గుర్తు చేసుకునేందుకు ఈ ప్రత్యేకమైన నిర్మల్ ఉత్సవాల ను ప్రారంభించామని తెలిపారు.ఈ ఉత్సవాల ద్వారా జిల్లా చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే అవకాశం లభిస్తుందన్నారు.నేటి నుంచి ఈ నెల 23వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఉత్సవా లు నిర్వహించబడతాయని తెలిపారు.ప్రతిరోజు ఉ దయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వర కు ఉత్సవాలు కొనసాగుతాయని,సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వి వరించారు.గత సంవత్సరం అధికారుల సమన్వ యం,ప్రజల భాగస్వామ్యంతో ఉత్సవాలు విజయవంతమయ్యాయని,ఉ త్సాహంతో రెట్టించిన కార్యక్రమాలతో విజయవంతంగా నిర్వహిస్తామని పే ర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో ఈ సంవత్సరం నిర్మల్ ఉత్సవాలను నిర్వహించుకోవడం గర్వించదగ్గ విషయమని అ న్నారు.ప్రభుత్వం ఇటు వంటి వినూత్న కార్యక్రమాలను ప్రోత్సహిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎస్పీ జానకీ షర్మిల ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఏఎస్పీ సాయికిరణ్,ఆర్డీఓ రత్నకళ్యాణి,వివిధ శాఖల అధికారులు ,సిబ్బంది, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

> నిర్మల్ జిల్లా చరిత్ర,సాంస్కృతిక వారసత్వాన్ని చాటి చేప్పేందుకే నిర్మల్ ఉత్సవాలు.. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

## సంగారెడ్డి మున్సిపాలిటీలో మౌలిక వసతుల బలోపేతం

రూ 31.70 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్‌రాజనర్సింహ తెలిపారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధిని మరింత వేగవంతం చేసే దిశగా రూ. 31.70 కోట్ల వ్యయం తో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎండి నిధులతో రూ 8 కోట్ల వ్యయంతో రోడ్లు ,మురుగు కాలువల నిర్మాణ పనులకు సిడిఎం ఏ నిధులతో రాజీవ్ పార్క్ సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అదే విదంగా అర్బన్ ఇన్‌స్ట్రాక్చర్ డెవలప్ మెంట్ పథకం కింద రూ. 18.70 కోట్లతో రోడ్లు ,మురుగు కాలువలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పనులు చేపట్టనున్నారు. హెచ్ఎండిఏ నిధులతో రూ. 2కోట్ల వ్యయంతో రాజంపేట చౌరస్తా నుండి ఫిల్టర్ బడ్ వరకు సిసి రోడ్డు నిర్మాణం, ఫిల్టర్ బెడ్ మరమ్మతుల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. రోడ్లు,డ్రైనేజిలు ,పార్కులు, చెత్త నిర్వహణ వంటి సౌకర్యాలు, బలోపేతం అయితే పట్టణాలు మరింత శుభ్రంగా సురక్షితంగా మారుతాయని అన్నారు.అవసరమైన అన్ని సహకారాలు అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. టీజీఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు,అడిషనల్ కలెక్టర్ పాండు, రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేందర్ మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ :** జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. జనవరి 25 మెదక్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహణ ఉంటుందన్నారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి యువత తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడం భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు పాత్రను బలపరచడం లక్ష్యంగా ఈ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల నిండిన యువత అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని, ఎన్నికల సమయంలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ఓటింగ్‌లో చురుకుగా పాల్గొనడం ద్వారా బలమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు.

## మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు

జిల్లా కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/గజ్వేల్ :** మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి పేర్కొన్నారు. మహిళా శక్తి సంబరాల్లో భాగంగా మంగళవారం గజ్వేల్ లో ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన సందర్భంగా డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మెప్మా పిడి హన్మంత రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలకిషన్, తహసిల్దార్ శ్రావణ్ లతో కలిసి ప్రసంగించారు. ప్రభుత్వ పథకాలను మహిళల పేరిటనే వర్తింపజేస్తుండగా, సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇం డ్లు మంజూరు చేయగా, జిల్లా లో 12500 ఇండ్లు అర్హులకు కేటాయించినట్లు స్పష్టం చేశారు. ఇందులో 90 శాతం గ్రౌం డింగ్ కాగా, 80 శాతం లబ్ధిదారులకు డబ్బులు వారి అకౌంట్లలో ప్రభుత్వం జమ చేసినట్లు తెలిపారు. అలాగే కొత్త రేషన్ కార్డులు మంజూరు ప్రక్రియతో పాటు పాత కార్డులలో సభ్యులను చేర్చగా, నాణ్యమైన ఆహారం అందించడానికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రైతు భరోసా కింద రూ 390 కోట్ల రైతుల ఖాతాలలో జమ చేయగా, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు గృహాలకు ఉచిత కరె ంట్ ఇస్తున్నట్లు చెప్పారు. గజ్వేల్ అర్బన్ లో రూ కోటి 28 లక్షలు వడ్డీ లేని రుణాలు ఇవ్వగా, 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరకు అర్హులే కాగా, గ్రూపులో ఉన్నవారికి మాత్రమే ఇస్తారనే అపోహ వద్దని అన్నారు. అధికారులు చీరల పంపిణీ చేస్తారని, ప్రభుత్వ పథకాలు పొంది మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలని వివరించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఐ మధ్య పొత్తు

**ప్రజాపక్షం / మంచిర్యాల :** త్వరలో జరగనున్న మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కోల్ బెల్ట్ ప్రాంతంలో కాంగ్రెస్, సిపిఐ పార్టీల మధ్య సీట్ల అవగాహన విషయంలో సానుకూల వాతావరణం కల్పిస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్ తెలిపారు. ఖమ్మంలో ఉప ముఖ్యమంత్రిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవైన శంకర్ కలిసి ఎన్నికల సర్దుబాటు అంశంపై చర్చించారు. ప్రేమ్ సాగర్ రావుతో మాట్లాడి రెండు పార్టీలు కలిసి పనిచేసేలా చూస్తానని భట్టి విక్రమార్క వెల్లడించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇరు పార్టీల మధ్య ఉన్న అవగాహన, స్నేహ సంబంధాలను ప్ర జల ఆకాంక్ష మేరకు కొనసాగిద్దామని ఈ భేటీలో నాయకులు నిర్ణయించినట్లు రామడుగు లక్ష్మ ణ్ వివరించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇరు పార్టీలు ఒక అవగాహనతో కలిసి ముందుకు వెళ్లాలని చర్చించినట్లు తెలిపా రు. సిపిఐ నాయకుల



విన్నపానికి ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్ప ందిస్తూ సమస్యను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చినట్లు వెల్లడించారు.

## ప్రజావాణికి 73 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 73 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్‌తో పాటు సబ్‌కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఆర్డీఓ రాజేంద్రకుమార్, కమీషనర్ దిలీప్‌కుమార్, పీడీ పవన్‌కుమార్, ఏసీపీ శ్రీనివాస్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గురుకులంలో గొంతు విప్పిన విద్యార్థినులు

ఉపాధ్యాయురాలి వేధింపులపై
ఉన్నత స్థాయి విచారణ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** చదువు నేర్పాల్సిన గురువే రాక్షసత్వంతో వ్యవహరిస్తూ, విద్యార్థినులను మానసిక క్షోభకు గురి చేస్తున్న వైనం నిజామాబాద్ జిల్లాలో సంచలనం సృష్టించింది. ఎడపల్లి మండలంలోని తెలంగాణ రాష్ట్ర బా లికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇం గ్లీష్, పీజీటీ టీచర్‌గా పని చేస్తున్న రజిని వేధింపులు భరించలేక విద్యార్థినులు తిరుగుబాటు చేశారు. గత కొంతకాలంగా సదరు ఉపాధ్యాయురాలు విద్యార్థినుల పట్ల అత్యంత కఠినంగా, అమానవీయంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉపాధ్యాయురాలి తీరుతో విసిగిపోయిన విద్యార్థినులు, ఈ నెల 8వ తేదిన పాఠశాలలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని మల్టీజోన్ 2 హెడ్ ఆఫీస్ నుంచి అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ పి.వేణుగోపాల్ రెడ్డి, అకాడమిక్ సెక్షన్ ఆఫీసర్ వెంకట్ రమణ పాఠశాలను సందర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ గంగా శంకర్ నుంచి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు సేకరించారు. ఉపాధ్యాయులు సిబ్బందితో మాట్లాడి రజిని గత ప్రవర్తన, ఆమె బోధన, వ్యవహార శైలి గురించా ఆరా తీశారు. విచారణ కమిషనర్ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టామన్నారు.



## గజ్వేల్ నియోజకవర్గానికి రూ.1000 కోట్ల నిధులు

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్:** రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్ నియోజకవర్గానికి వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల కింద రూ 1000 కోట్లకు పైగా నిధులు మంజూరైనట్లు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ధర్మారెడ్డి పల్లి, గజ్వేల్ లో జరిగిన వివిధ కార్యక్రమాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇక్కడి ప్రజలు కేసీఆర్ ను నమ్మి ఓటేసినప్పటికీ అందుబాటులో ఉండకపోగా, ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయినట్లు విమర్శించారు. ముఖ్యంగా ముంపు గ్రామాల ప్రజలకు కెసిఆర్, హరీష్ రావులు అరచేతిలో వైకుంఠం చూపి నట్టేట ముంచగా, వారి తొత్తులు నిర్వాసితుల నిధులు మింగేసినట్లు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కు అండగా నిలిస్తేనే గజ్వేల్ అభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. అయితే గజ్వేల్ నియోజకవర్గానికి సీఎం రేవంత్ రెడ్డి అవసరమైన నిధులు ఇస్తుండగా, ముంపు బాధితుల సమస్యల పరిష్కారం తమతోనే సాధ్యపడుతుందని తెలిపారు. ముఖ్యంగా అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అందజేస్తుండగా, ఆరు గ్యారెంటీలలో భాగంగా పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఆశీర్వదించాలని, అందుకు భిన్నంగా కెసిఆర్ కు ఓటు వేస్తే సిద్దిపేటలో మాత్రమే అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. సీసీ రోడ్ల కోసం అడిగిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి రూ.18 కోట్ల నిధులు మంజూరీ చేసినట్లు చెప్పారు. రైతులు ప్రభుత్వ పథకాల కోసం ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని, పదవి ఉన్నా, లేకపోయినా గజ్వేల్ ప్రజలతోనే తన జీవితం ముడిపడి ఉందని వివరించారు. డిసిసి అధ్యక్షులు అంక్షా రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కప్ప భాస్కర్, మహేష్ పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని జిల్లాల యంత్రాంగం పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుండి మున్సిపల్ శాఖ కార్యదర్శి టి.కె శ్రీదేవితో కలిసి జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ప్రింటింగ్ సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని, నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు.రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని, సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ నుండి ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆసిఫాబాద్ లోని 20 వార్డులకు 28 పోలింగ్ కేంద్రాలు, కాగజ్ నగర్ లోని 30 వార్డులకు 85 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

## అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

ఎంపి ధర్మపురి అరవింద్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజలకు ఉప యుక్తంగా నిలిచే అభివృద్ధి పనులను నిర్దిష్ట గ డువులోగా పూర్తి చేయించేందుకు అధికారులు చొరవ చూపాలని ఎంపీ ధర్మపురి అరవింద్ సూ చించారు. సమీకృత జిల్లా కార్యాలయాల స ము దాయం సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీ అరవింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యేలు రాకేష్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్య నారా యణ, కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా చేప డుతున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమ లు, పనుల ప్రగతి పై సమావేశంలో చర్చించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమ లునుసమీక్షించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో జిల్లాలో వివిధ పథకాల కింద చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు చొ రవ చూపాలన్నారు. ఎంపీ లాడ్స్ నిధులను మంజూరు చేసేందుకు పలువురు కమీషన్లు డిమాండ్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ ధోరణిని మార్చుకోవాలని సూ చించారు. బాధిత కుటుంబాలకు ఒకే విడతలో 20 వేలు వారి ఖా తాలలో నేరుగా జమా వుతాయని, కుటుంబ పోషణ చూసే వారిని కోల్పోయిన కుటుంబాలకు ఇది ఎంతో ఆదరువును అంది స్తుందన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ మా ట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన తిలక్ గార్డెన్ వాణిజ్య సముదాయాలలో బినామీలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, కార్పో రేషన్‌కు నామమాత్రపు అద్దె సైతం సంవత్సరాల తరబడి చెల్లించడం లేదని, మడిగెలను సబ్‌లీజ్‌కు ఇచ్చి వేలాది రూపాయలు తీసుకుం టున్నా ర న్నారు. కమీషనర్ ది లీప్ కుమార్ వివరణ ఇస్తూ ఈ అంశంపై స మగ్ర పరిశీలన జరిపామని, నిబంధనల కను గు ణంగా చర్యలు తీసుకుంటామని, అద్దె పెంపు, లీజు రద్దు ప్రతిపాదనలు కూడా పరిశీలనలో ఉ న్నాయని తెలిపారు. కాగా పూ లాంగ్ వాగు నిర్వహణపై ఇరిగేషన్ అధికా రులు పట్టిం చుకో వడం లేదని, ఎక్కడికక్కడ కబ్జాలు జరుగుతు న్నాయని సభ్యులు ప్రస్తావి ంచారు. కబ్జాదారులపై రెవె న్యూ అధికారులకు ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయిం చాలని ఎంపీ ఇరిగేషన్ అధికారులకు సూచిం చారు.

అదనపు కలెక్టర్లు అం కిత్, కిరణ్ కుమార్, డీఆర్‌డీఓ సాయగౌడ్, ఆశన్న, లింగం, విజయ, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
బుధవారం
21-01-2026
www.prajapaksham.in

"వామపక్ష పార్టీలతోనే భారతదేశ భవిష్యత్తు ముడిపడి ఉందని వామపక్ష పార్టీల అగ్రనేతలు అభిప్రాయపడ్డారు. వామపక్షాల బలోపేతం ద్వారానే పీడిత వర్గాలకు న్యాయం జరుగుతుందని, అసమానతలులేని నవ సమాజ నిర్మాణానికి అవకాశం కలుగుతుందని ఉద్ఘాటించారు. భారతదేశంలో పేట్రేగిపోతున్న ఫాసిస్టు శక్తులకు, అత్యంత ప్రమాదకరంగా మారిన మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా వామపక్షాలు బలమైన ఐక్య పోరాటాలను నిర్వహించాలని పిలుపు నిచ్చారు."



డి.రాజా, ఎం.ఎ.బేబీ, దీపాంకర్ భట్టాచార్య మాటా మంతీ...

ఖమ్మంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల చిత్రమాలికను వీక్షిస్తున్న సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, తదితరులు



సిపిఐ వందేళ్ల పాటల సిడిని ఆవిష్కరిస్తున్న దృశ్యం





ఫోటోలు.. కె.అనిల్ కుమార్







ముంబై మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు సేకరించిన రూ.50లక్షల చెక్కును డి.రాజాకు అందజేస్తున్న మహారాష్ట్ర సిపిఐ రాష్ట్ర నాయకులు



సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీకి స్వాగతం పలుకుతున్న ఖమ్మం జిల్లా సిపిఐ నాయకులు







సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశం




# రీల్



## రూ.300 కోట్ల క్లబ్‌లో 'మన శంకర వరప్రసాద్ గారు'..

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన సంక్రాంతి బ్లాక్‌బస్టర్ 'మన శంకర వరప్రసాద్ గారు' బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. ఈ చిత్రం విడుదలైన కేవలం 9 రోజుల్లోనే రూ.300 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక ప్రోమోను విడుదల చేసింది. మరోవైపు నార్త్ అమెరికాలో కూడా ఈ సినిమా 3 మిలియన్ డాలర్ల మార్కును దాటి దూసుకుపోతోంది. చిరంజీవి మాస్ ఎనర్జీ, నయనతార నటన మరియు విక్టరీ వెంకటేష్ క్యామియో రోల్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచింది. జనవరి 12న విడుదలైన ఈ చిత్రం రెండో వారంలో కూడా అన్‌స్టాపబుల్‌గా బాక్సాఫీస్ వద్ద తన హవా కొనసాగిస్తోంది.

## 'క్రేజీ కళ్యాణం' పోస్టర్




నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.2గా ప్రొడ్యూసర్ బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. యాక్టర్ వీకే నరేష్ బర్త్ డే సందర్భంగా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌లో పర్వతాలు అనే పాత్రలో ట్రెడిషనల్‌గా వీకే నరేష్ ఆకట్టుకుంటున్నారు. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్‌తో సాగే చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో 'క్రేజీ కల్యాణం' సినిమా చిత్రీకరణ జరిపారు. సురేష్ బొబ్బిలి 'క్రేజీ కల్యాణం' సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు.

## 'శుభకృత్ నామ సంవత్సరం' గ్లింప్స్



డాక్టర్ నరేష్ విజయ్ కృష్ణ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'శుభకృత్ నామ సంవత్సరం'. ఎస్ఎస్ సజ్జన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్వి పిక్చర్స్, అవిష్క ట్రీ ప్రొడక్షన్ బ్యానర్స్‌పై డిఆర్ విశ్వనాథ్ నాయక్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. గ్లిమ్స్ లాంచ్ ఈవెంట్లో డాక్టర్ నరేష్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ మా కుటుంబంలో సగమైన ఫ్యాన్స్‌కి పేరుపేరునా కృతజ్ఞతలు. మా కుటుంబంలో ఏదైనా సరే మాతో వచ్చి నిలబడే ఫ్యాన్స్‌ని కృష్ణ మాకు ఇచ్చి వెళ్లారు. రామోజీరావు జంధ్యాల నాకు ఒక ఫ్యామిలీ. వాళ్ళు వెళ్లిపోయిన తర్వాత చాలా డిప్రెషన్ ఫీల్ అయ్యాను. ఆ తర్వాత శ్రీ విష్ణు, రామ్ అబ్బరాజు మరో ఫ్యామిలీ లాగా వచ్చారు. నాకోసం ఒక క్యారెక్టర్ రాయడం అనేది నాకు ఎంతో బలాన్ని ఇస్తుంది. శ్రీ విష్ణు మై హీరో. మహేష్ తర్వాత అంత మంచి షటిల్‌గా ఉండే టైమింగ్ తనలో చూశాను. క్యారెక్టర్ ఆర్టిస్టుగా అద్భుతంగా ముందుకు వెళ్తున్న కొద్ది లీడ్ రోల్స్ కూడా మొదలయ్యాయి. అయితే నేను ప్రతిదీ క్యారెక్టర్ గానే చూస్తాను. తెలుగు కన్నడ సిస్టర్ లాంగ్వేజ్. ఒకటే లిపి ఉంటుంది. కల్చర్ దగ్గరగా ఉంటుంది. శుభకృత్ నామ సంవత్సరం కథ చాలా నచ్చింది. అద్భుతమైన కంటెంట్ ఉన్న సినిమా అని చెప్పారు.

శ్రీ విష్ణు మాట్లాడుతూ నరేష్ సినిమాలో ఉంటే చాలు అనే ఒక ఇమేజ్ ని క్రియేట్ చేసుకున్నారు. ఏ పాత్ర అయినా సరే అద్భుతంగా చేయగలిగే నటుడు మన తెలుగు పరిశ్రమంలో ఉండడం చాలా గర్విస్తున్నాను. ఆయన ఇంకా మంచి పాత్రలు చేయాలని కోరుకుంటున్నాను. దాని కంటే ఒక గొప్ప కథ వచ్చినప్పుడు చేస్తానని ఎదురు చూశాను. అలాంటి సినిమా మా కాంబినేషన్లో చూడబోతున్నా అన్నారు.

పవిత్ర లోకేష్ మాట్లాడుతూ నరేష్ లాంటి గొప్ప వ్యక్తితో జీవించడం దేవుడి ఆశీస్సులుగా భావిస్తున్నాను. నరేష్ ప్రతి క్యారెక్టర్‌కి ఎంతో ప్రిపేర్ అవుతారు. చిన్న పెద్దా అని ఉండదు. అన్నీ ఒకేలా చూస్తారు. ఆయన చాలా బిజీగా ఉన్నారు. నరేష్ ఒక కింగ్ లాగా బ్రతుకుతారు. ప్రతి క్షణాన్ని ఆస్వాదించాలని ఆయన ఫిలాసఫీ.

డైరెక్టర్ రామ్ అబ్బరాజు మాట్లాడుతూ.. యాభై నాలుగు ఏళ్ల అద్భుతమైన ప్రయాణంలో మేము కూడా భాగమైనందుకు చాలా హ్యాపీగా ఉంది. అలాగే నారి నారి సక్సెస్ కి కంగ్రాట్స్ అని చెప్పారు. డైరెక్టర్ సజ్జన్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, రాజేష్ దండా, నిర్మాత విశ్వనాథ్ నాయక్ పాల్గొన్నారు.



## 'కాన్ సిటీ' ఫస్ట్ లుక్

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'కాన్ సిటీ' సినిమా టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ లాంచ్ చేశారు. ఈ చిత్రంలో అర్జున్ దాస్ ప్రధాన పాత్రలో కనిపించగా, మలయాళ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అన్నా బెన్, కామెడీ కింగ్ యోగి బాబు, వెటరన్ నటి వడివుకరసితో పాటు చైల్డ్ ఆర్టిస్ట్ అకిలన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పవర్ హౌస్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది, హరీష్ దురైరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మధ్యతరగతి కుటుంబం నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారు. అర్జున్ దాస్ ఆఫీస్ బ్యాక్‌ప్యాక్‌తో అన్నా బెన్ హ్యాండ్‌బ్యాగ్‌తో యోగి బాబు, వడివుక్కరసి ట్రావెల్ బ్యాగ్స్‌తో చిన్నారి అకిలన్ విజయాన్ని సూచించే ట్రోఫీని తీసుకెళ్లడం క్యూరియాసిటీ పెంచుతూ టైటిల్, పోస్టర్‌ను రూపొందించారు. ఈ సినిమా మంగళూరు, చెన్నై, ముంబైలలో షూటింగ్ ఎనభై శాతం పూర్తయింది. ఈ చిత్రం తమిళం, తెలుగులో ఒకేసారి విడుదలవుతోంది.

## 'గొల్ల రామవ్వ'గా తాళ్లూరి రాజేశ్వరి

స్వర్గీయ భారత ప్రధాని పి.వి.నరసింహారావు రాసిన తెలంగాణ సాయుధ పోరాట గాథకు దృశ్యరూపం ఇస్తున్నారు. ప్రఖ్యాత రచయిత ముళ్ళపూడి వెంకట రమణ తనయుడు ముళ్ళపూడి వరా దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఈటీవీ విన్‌లో ఈ సినిమా ప్రసారం కానుంది. సుపరిచిత దర్శకులు స్వర్గీయ సునీల్ వర్మ తనయుడు రాఘవేంద్రవర్మ (బుజ్జి) నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రఖ్యాత గీత రచయిత ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్, జాతీయ అవార్డు గ్రహీతలు సుద్దాల అశోక్ తేజ, కాసర్ల శ్యామ్, మౌనశ్రీ మల్లిక్ పాటలు రాస్తున్నాను.




## అల్లరి నరేష్ ఇంట విషాదం



వృద్ధాప్య కారణాలతో ఇవివి సత్యనారాయణ తండ్రి ఈదర వెంకట్రావు కన్నుమూశారు. మంగళవారం తెల్లవారుజాము మూడు గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. 2019 మే 27న భార్య వెంకటరత్నం మరణించారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఒక కుమార్తె. పెద్దకుమారుడు ఈవివి సత్యనారాయణ, రెండో కుమారుడు గిరి, మూడో కుమారుడు శ్రీనివాస్, కుమార్తె ముళ్ళపూడి మంగాయమ్మ, ఆర్యన్ రాజేష్, అల్లరి నరేష్ మనుమలు. నిడదవోలు మండలం కోరుమామిడిలో అంత్యక్రియలు జరిగాయి.

## నేనేమీ హీరోని కాదు



గతేడాది కుబేర, ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద మంచి సక్సెస్‌ను అందుకున్న రష్మిక మందన్నా సినిమాలతోనే కాకుండా పలు ఇంటర్వ్యూల ద్వారా కూడా రెగ్యులర్‌గా ఫ్యాన్స్‌కు టచ్‌లోనే ఉంటుంది. తాజాగా ఓ చిట్ చాట్‌లో పాల్గొన్న రష్మిక పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించింది. తన కెరీర్ మొదలైన 2016 నుంచి ఇప్పటివరకు ఒకేలా ఉన్నానని, అన్ని రకాల జానర్లలో సినిమాలు చేస్తూ, అన్ని భాషల్లోనూ నటించాలనేదే తన కోరిక అని రష్మిక చెప్పింది. భాష పరంగా తనకు ఎలాంటి హద్దులు లేవని, తాను నటినని, నటిగా అన్ని రకాల ఆడియన్స్‌ను అలరించడమే తన పని అని, ఒక్కొక్కరికి ఒక్కో జానర్ సినిమా నచ్చుతుందని, అందుకే తాను అన్నీ విధాలైన సినిమాలు చేసి అందరినీ మెప్పించాలనుకుంటున్నట్టు రష్మిక చెప్పుకొచ్చింది. నెగిటివిటీ గురించి మాట్లాడుతూ, కొందరు కావాలనే డబ్బు కోసం రూమర్లను క్రియేట్ చేస్తారని రష్మిక అంటోంది. మొదట్లో రూమర్లు విని చాలా బాధ పడ్డానని, తర్వాత వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నానని, జీవితంలో జరిగిన ప్రతీ విషయం నుంచి ఏదొకటి నేర్చుకుంటూ ముందుకెళ్తున్నట్టు రష్మిక చెప్పింది. హీరోయిన్లు అందరిలో తానే ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకుంటున్నానని వస్తున్న వార్తలపై కూడా ఆమె క్లారిటీ ఇచ్చింది. ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకోవడానికి తానేమీ హీరోని కాదని చెప్పుకొచ్చింది.

## అత్యంత ప్రతిష్టాత్మకంగా 'మా వందే'



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్‌ను 'మా వందే' టైటిల్ తో సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు ప్రొడ్యూసర్ వీర్ రెడ్డి.ఎం. ఈ చిత్రంలో నరేంద్ర మోదీ పాత్రలో మలయాళ స్టార్ హీరో ఉన్ని ముకుందన్ నటిస్తున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశాన్నిస్తూ ప్రధాని మోదీ జీవితాన్ని యదార్ధ ఘటనల ఆధారంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు క్రాంతికుమార్.సీహెచ్. ప్రధాని మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని విశేషాలన్నీ ఎంతో సహజంగా మా వందే సినిమాలో చూపించబోతున్నారు. ఈ సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యున్నత సాంకేతిక విలువలు, వీఎఫ్ఎక్స్‌తో రూపొందుతోంది. మా వందే చిత్రాన్ని పాన్ ఇండియా భాషలతో పాటు ఇంగ్లీష్ లోనూ రిలీజ్ చేయనున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశం మా వందే చిత్రంలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. 'మా వందే' సినిమాను సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ సంస్థ 400 కోట్ల రూపాయలకు పైగా హ్యూజ్ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఈ స్టోరీ డ్రివెన్ మూవీని ప్రపంచంలో తొలిసారిగా తొలిసారి ఆరి అలెక్సా 265 జెంట్రీ, కుకీ లెన్స్ తో తెరకెక్కిస్తుండటం విశేషం. ఇప్పటికే మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకున్న మా వందే సినిమా సెకండ్ షెడ్యూల్ ఈ నెల 22వ తేదీ నుంచి కాశ్మీర్‌లో ప్రారంభం కా నుంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com